మన రాష్ట్రం మన పత్రిక

# నమస్తే తెలంగాణ

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

శుక్రవారం 28.4.2023 | సంపుటి 12 • సంచిక 324 • వెల. రూ.6.50 | హైదరాబాద్ పేజీలు: 12+16/12


శుక్రవారం, సూర్యోదయం: 5-52, సూర్యాస్తమయం: 6-35. శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు వైశాఖ మాసం శుక్ల పక్షం తిథి: అష్టమి సాయంత్రం 4-02 వరకు. నక్షత్రం: పుష్యమి ఉదయం 9-52 వరకు, తదుపరి ఆశ్లేష. వర్జ్యం: రాత్రి 12-14 నుంచి రాత్రి 2-02 వరకు. రాహుకాలం: ఉదయం 10-38 నుంచి పగలు 12-13 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-25 నుంచి ఉదయం 9-16 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 12-39 నుంచి పగలు 1-29 వరకు. అమృతకాలం: లేదు. భరణి కార్తె ఉదయం 6-40.


.... నిపుణ పేజీల్లో ....

- పార్లమెంటులో కోరమ్ ఎన్నోవంతు?
- వాటి పుట్టుకను బట్టి పర్వతాలు ఎన్ని రకాలు?
- అర్ధరాత్రి సూర్యుడు ప్రకాశించే దేశం ఏది?
- కాక్‌పిట్ ఆఫ్ యూరప్ అని ఏ దేశానికి పేరు?
- సూర్యుడికి భూమి అతిదగ్గరగా వచ్చే రోజు?





పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ప్రతినిధుల సభలో ప్రసంగిస్తున్న అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్.. సభలో పలు తీర్మానాలకు చప్పట్లతో ఆమోదం తెలుపుతున్న ప్రతినిధులు

# వంద సీట్లు మనవే

## వచ్చే ఎన్నికల్లో మనకు పోటీయే లేదు.. బీఆర్‌ఎస్ ట్రెండ్‌సెట్టర్ కానున్నది: కేసీఆర్

- ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలి
- పల్లెనిద్ర, బస్తీనిద్రలో ప్రజలతో నేతలు మమేకం కావాలి
- గుణాత్మక మార్పు కోసమే జాతీయ రాజకీయాల్లోకి..
- రాబోయే రోజుల్లో రూ.6 లక్షల కోట్లకు రాష్ట్ర బడ్జెట్
- నిరుపయోగ భూముల్ని గ్రామీణ పేదలకు పంచుదాం
- హైదరాబాద్ నోటరీ భూములనూ క్రమబద్ధీకరిద్దాం
- త్వరలో పాలమూరు, సీతారామ ప్రాజెక్టుల పూర్తి
- వర్షాలతో నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం
- సంక్షేమ పథకాల అమలులో తేడాలొస్తే కఠిన చర్యలే
- దళితబంధులో అవినీతి జరిగిందని తేలితే టికెట్ కట్
- పార్టీ ఫండ్ రూ.1,250 కోట్లు.. వడ్డీతో కార్యక్రమాలు
- పార్టీ ప్రతినిధుల సభలో అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్

**బీఆర్‌ఎస్‌లో చేరిన మహా బీజేపీ మాజీ ఎమ్మెల్యే చరణ్**



తెలంగాణభవన్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న పార్టీ అధినేత కేసీఆర్

*భారత రాష్ట్ర సమితి దేశానికి ఒక వెలుగుదివ్వెగా మారబోతున్నదని, జాతీయస్థాయిలో ట్రెండ్ సెట్టర్‌గా నిలువబోతున్నదని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. రాష్ట్రంలో వందకు పైగా సీట్లతో మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన స్పష్టంచేశారు. గులాబీ పార్టీ 22 ఏండ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న నేపథ్యంలో.. శుక్రవారం ప్రతినిధుల సభను హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రాధాన్యతలు, భవిష్యత్తు లక్ష్యాలపై ప్రతినిధులకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. నేతలకు బాధ్యతలను గుర్తుచేశారు. ప్రజలతో మమేకం కావాలని సూచించారు. ఈ సందర్భంగా కీలక రాజకీయ తీర్మానాలను ప్రతినిధుల సభ ఆమోదించింది.*

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): రాబోయే ఎన్నికల్లో 100 సీట్లలో ఘన విజయం సాధిస్తామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తెలిపారు. 'ప్రజలు ఎవరినో ఒకరిని ఎన్నుకోవాలని కాకుండా కచ్చితంగా మనల్నే ఎన్నుకోవాలి (ఎలక్షన్ షుడ్ బి నాట్ బై చాన్స్... బట్ బై చాయిస్) అన్న వాతావరణాన్ని మనం సృష్టించుకోవాలి. దూపైనప్పుడు బావి తవ్వుతం అనే రాజకీయం నేటి కాలానికి సరిపోదు' అని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కష్టపడి పనిచేస్తే తప్పకుండా విజయం సాధిస్తామని, ఇందులో ఎవరికీ ఎలాంటి అనుమానం అక్కరలేదని అన్నారు. అన్నిస్థాయిల్లోని పార్టీ క్యాడర్‌లో అసంతృప్తిని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని పార్టీ ప్రజా ప్రతినిధులకు సూచించారు. బీఆర్‌ఎస్ 23వ ఆవిర్భావ వేడుకలు తెలంగాణ భవన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించిన సీఎం కేసీఆర్.. పార్టీ ప్రతినిధుల సభను ఉద్దేశించి ప్రసంగించారు. దేశంలో మరే రాష్ట్రం చేపట్టని అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలంగాణ చేపట్టిందని.. ప్రభుత్వ పనితీరుపై ప్రజలు సంతోషంగా ఉన్నారని, విపక్షాలు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దుష్ప్రచారాన్ని అంతేబలంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం › 2వ పేజీలో

**బీసీ కులగణన జరపాలి.. బీఆర్‌ఎస్ రాజకీయ తీర్మానం** › 3

### ప్రజలు మనల్నే ఎన్నుకోవాలి

'ప్రజలు అనుకోకుండా ఎవరినో ఒకర్ని ఎన్నుకోవాలని కాకుండా కచ్చితంగా మనల్నే ఎన్నుకోవాలి' (ఎలక్షన్ షుడ్ బి నాట్ బై చాన్స్... బట్ బై చాయిస్) అనే వాతావరణాన్ని మనం సృష్టించుకోవాలి. 2014లో తెలంగాణ తొలి అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో 63 సీట్లు వస్తే.. 2019లో 88 సీట్లు గెలిచాం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, ప్రజల ఆదరణతో ఈసారి 100కు పైగా గెలుస్తాం. మన ప్రభుత్వం అధికారంలోకి రావడమనేది పెద్ద టాస్క్ కాదు. మునపటి కన్నా ఎక్కువ సీట్లు రావాలనేది ప్రాధాన్యతాంశం.

2014లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 1.47లక్షలుగా ఉండగా, అదిప్పుడు రూ. 3.17 లక్షలకు చేరుకున్నది. ఇది జాతీయ తలసరి ఆదాయం కన్నా రెట్టింపు. అలాగే ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం రూ. 2,19,518 ఉన్నది. అంటే ఏపీ తలసరి ఆదాయం తెలంగాణ కన్నా లక్ష రూపాయలు తక్కువ.

### పేదలకు భూములు పంచుదాం

గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, వాటి సర్వే నివేదికలను ప్రభుత్వానికి ఇవ్వండి. ఇండ్లు కట్టుకోవటానికి యోగ్యంగా ఉంటే తక్షణమే అర్హులైన పేదలకు పంచుదాం. హైదరాబాద్ నోటరీ భూములనూ క్రమబద్ధీకరిద్దాం. ఇందుకు సంబంధించిన ఫైళ్లపై కొత్త సెక్రటేరియట్‌లో సంతకం చేస్తా.

- ముఖ్యమంత్రి కేసీఆర్

### మరో నాలుగు రోజులు వర్షాలు

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

వడగండ్ల వానలూ పడొచ్చు

వాతావరణ కేంద్రం హెచ్చరిక

› 4

### సైబర్ నేరాలపై సెక్యూరిటీ బ్యూరో

పోలీసు శాఖలో 500 మంది సిబ్బంది నియామకం

800 పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక శిక్షణతో సైబర్ వారియర్లు

రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామస్థాయిలో కమిటీలు

› 4





ఈ నెల 30న ప్రారంభానికి సిద్ధమైన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన సచివాలయం తెలంగాణ వైభవ ప్రతీకగా వెలిగిపోతున్నది. ప్రారంభానికి కొన్ని గంటలే మిగిలి ఉండటంతో సర్వాంగసుందరంగా ముస్తాబైంది. రంగురంగుల విద్యుద్దీపకాంతుల్లో జిగేల్‌మంటున్నది

# 'ప్రైడ్ ఆఫ్ తెలంగాణ'

## ఇలాంటి సచివాలయం దేశంలో మరెక్కడా లేదు

- కొత్త పార్లమెంట్ భవనం కన్నా విశాలమైనది
- ఐజీబీసీ సర్టిఫికెట్ పొందిన తొలి సెక్రటేరియట్
- భవనంలో సర్వ హంగులు.. సకల సౌకర్యాలు
- ప్లానింగ్, విజన్, మానిటరింగ్.. అంతా సీఎందే
- 20 నెలల రికార్డు సమయంలో పనులు పూర్తి
- ఈ నెల 30న వైభవంగా ప్రారంభం
- 'నమస్తే తెలంగాణ'తో మంత్రి వేముల




హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సచివాలయం అత్యంత సువిశాలమైనదని, ఇటువంటి ప్రత్యేకతలు కలిగిన భవనం దేశంలో ఎక్కడా లేదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి గోల్డెన్ సర్టిఫికెట్ పొందిన గౌరవం కూడా మన సచివాలయానికే దక్కిందని తెలిపారు. భవనంలోని హాళ్లు, డోమ్‌లు, స్కైలాంజ్‌లు దేశంలోని ఏ ఇతర సచివాలయానికి లేవని చెప్పారు. కేంద్రం › 5వ పేజీలో


### ఎక్స్‌ట్రా క్లాసులు 3 గంటలు మించొద్దు

- కాలేజీ మధ్యలో మానేస్తే ఫీజు వాపస్
- ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

**విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు పటిష్ఠ మార్గదర్శకాలు విడుదల చేసిన ఇంటర్‌బోర్డు**



హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ) : కార్పొరేట్ రెసిడెన్షియల్ కాలేజీల అరాచకాలకు అడ్డుకట్ట వేసేలా రాష్ట్ర ఇంటర్ విద్యామండలి కీలక నిర్ణయాలు తీసుకొన్నది. కాలేజీల్లో అదనపు తరగతులు 3 గంటలు మించొద్దని స్పష్టంచేసింది. రెసిడెన్షియల్ సహా డే స్కాలర్లు మధ్యలో చదువు మానేస్తే ఫీజు వాపసు చేయాలని సూచించింది. ఈ మేరకు గురువారం ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్‌మిట్టల్ మార్గదర్శకాలను విడుదల చేశారు. ఎవరైనా విద్యార్థి ఆరోగ్య సమస్యలు సహా ఇతరత్రా కారణాలతో మధ్యలోనే కాలేజీ మానేస్తే అనుమతించాలి. విద్యార్థి చెల్లించిన ఫీజులను 7 రోజుల్లోపు తిరిగి ఇవ్వాలి. మొదటి మూడు నెలల్లో నిష్క్రమిస్తే 75శాతం, ఆ తర్వాత మూడు నెలల తర్వాత వెళ్లిపోతే 50శాతం, ఆ తర్వాత కాలేజీ మానేస్తామంటే 25శాతం › 8వ పేజీలో



# మక్కల కొనుగోళ్లకు గ్రీన్‌సిగ్నల్

- వెంటనే కేంద్రాలు ప్రారంభించాలని సీఎం కేసీఆర్ ఆదేశం
- యాసంగిలో 6.50 లక్షల ఎకరాల్లో మక్కజొన్న సాగు
- రాష్ట్రంలో 17.37 లక్షల టన్నుల దిగుబడి అంచనా
- మక్కల మద్దతు ధర క్వింటాలుకు రూ.1962గా నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): కష్టకాలంలో మక్కజొన్న రైతులకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. యాసంగి మక్కల కొనుగోలుకు సీఎం కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మక్కల కొనుగోళ్లకు సంబంధించి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అవసరమైన చోట వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించారు. ఈ మేరకు మార్క్‌ఫెడ్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ యాసంగిలో రాష్ట్రవ్యాప్తంగా 6.50 లక్షల ఎకరాల్లో మక్కజొన్న సాగైంది. ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో అధిక విస్తీర్ణంలో రైతులు మక్కజొన్న సాగు చేశారు. దీని ప్రకారం 17.37 లక్షల టన్నుల మక్కలు ఉత్పత్తి అవుతాయని అధికారులు అంచనా వేశారు. మూలిగే నక్కపై తాటికాయపడ్డ చందంగా తయారైంది మక్కజొన్న రైతుల పరిస్థితి. ఓవైపు అకాల వర్షాలతో పంట › 5వ పేజీలో



పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ప్రతినిధుల సభను ఉద్దేశించి ప్రసంగిస్తున్న పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.

# వంద సీట్లు మనవే

మొదటిపేజీ తరువాయి...

గత ఎనిమిదిన్నరేండ్లలో చేపట్టిన కార్యక్రమాలను ప్రతి ఒక్కరికీ వివరించేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. 2014లో 63 సీట్లు గెలిస్తే, 2018లో 88 సీట్లు గెలిచాం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, ప్రజల ఆదరణతో ఈసారి 100కు పైగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. 'మరోసారి మన ప్రభుత్వం అధికారంలోకి రావడమనేది పెద్ద టాస్క్ కాదు. మునపటికంటే ఎక్కువ సీట్లు రావాలనేదే ప్రాధాన్యతాంశం కావాలి' అని స్పష్టంచేశారు. తానే త్వరలో స్వయంగా ఒక్కో ఎమ్మెల్యేతో విడివిడిగా మాట్లాడతానని చెప్పారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నిజం చేసిన బీఆర్‌ఎస్, ప్రగతి పథాన ముందుకు సాగుతున్నదని అన్నారు. అదే స్ఫూర్తితో దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేదిశగా బీఆర్‌ఎస్‌గా మార్పుచెంది ఒక చారిత్రక దశలోకి ప్రవేశించిందని తెలిపారు. గుణాత్మక రాజకీయాలతో దేశంలో ట్రెండ్‌సెట్ చేయడం కోసమే బీఆర్‌ఎస్ ముందుకు వచ్చిందని స్పష్టంచేశారు. దేశానికి బీఆర్‌ఎస్ ఒక వెలుగుదివ్వెగా మారబోతున్నదని తెలిపారు.



గురువారం తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న పార్టీ అధినేత, సీఎం కేసీఆర్. చిత్రంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, సెక్రటరీ జనరల్ కే కేశవరావు, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, చామకూర మల్లారెడ్డి

### పనితీరుకు గీటురాయి

'2014లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1.47లక్షలు ఉంటే, ఇప్పుడు రూ.3.17 లక్షలకు చేరుకొన్నది. ఇది దేశ తలసరి ఆదాయానికి రెట్టింపు. ఏపీ తలసరి ఆదాయం రూ.2,19,518 ఉన్నది. మనకన్నా రూ.లక్ష తక్కువ. ప్రభుత్వ పనితీరుకు ఇదే గీటురాయి'అని కేసీఆర్ ఉదహరించారు. 'రాష్ట్రాన్ని ఏలే తెలివి ఉంటే బండమీద నూకలు పుట్టించుకోవచ్చు. మనం చిత్తశుద్ధితో చేపట్టిన కార్యక్రమాల వల్ల తలసరిలో మహారాష్ట్ర, తమిళనాడును దాటాం. తలసరి విద్యుత్తు వినియోగంలో అగ్రస్థానంలో నిలిచిచాం. కరెంటు, రోడ్లు, ధాన్యం కొనుగోళ్లు, వ్యవసాయం, పశు సంపద, మత్స్య సంపద.. ఇలా ప్రతి రంగంలో దేశమే ఆశ్చర్యపోయే ప్రగతిని నమోదు చేశాం. 2021-2022కు ముందు రాష్ట్ర జీఎస్టీ ఆదాయం రూ.34 వేల కోట్లు ఉంటే, రూ.44 వేల కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకొన్నాం. లక్ష్యానికి మించి రూ.54 వేల కోట్లు సాధించాం. రోజురోజుకూ ఆర్థిక వనరులు పెరుగుతున్నాయనడానికి జీఎస్టీ వసూళ్లు మంచి ఉదాహరణ. త్వరలోనే పాలమూరు రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. పూర్తిస్థాయి సాగునీళ్లు వస్తాయి' అని సీఎం చెప్పారు.

### రైతులను చైతన్యం చేయాలి

ఇటీవల కురిసిన అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకొంటుందని సీఎం కేసీఆర్ భరోసా ఇచ్చారు. మక్కలు, జొన్నలు సహా అన్ని పంటలను గతంలో మాదిరిగానే కొంటామని చెప్పారు. పంట కొనుగోళ్ల కోసం మార్క్‌ఫెడ్‌కు ఆదేశాలిస్తామని తెలిపారు. వ్యవసాయాన్ని నిలబెట్టి, రైతుల సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని వెల్లడించారు.

### నోటరీ భూముల క్రమబద్ధీకరణ

హైదరాబాద్ నోటరీ భూములను కూడా క్రమబద్ధీకరిస్తామని సీఎం కేసీఆర్ తెలిపారు. కొత్త సచివాలయంలో ఆ ఫైళ్లపై సంతకం చేస్తానని వెల్లడించారు. రూ.3 లక్షలిచ్చే గృహలక్ష్మి విధివిధానాలు త్వరలో విడుదలవుతాయని చెప్పారు. సొంత జాగాలున్నవారికి, పట్టాలున్నవారికి కూడా ఇండ్లు కట్టిస్తామని వివరించారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూములు నిరుపయోగంగా ఉన్నాయని, సర్వేచేసి నివేదికలు ప్రభుత్వానికి పంపాలని, ఇండ్లు కట్టుకోవటానికి అనువుగా ఉంటే తక్షణమే పేదలకు పంచుదామని తెలిపారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం లేని నియోజకవర్గాల్లో జడ్పీ చైర్మన్లు, ఎంపీలను జిల్లా ఇన్‌చార్జీలుగా ఉపయోగించుకోవాలని, మూడు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశించారు.

### పథకాల అమల్లో తేడాలొస్తే కఠిన చర్యలే

గృహలక్ష్మి, దళితబంధు, గొర్రెల పంపిణీ, పోడుభూముల పట్టాలు, 58, 59 జీవోల ప్రకారం క్రమబద్ధీకరణ సామాన్యులకు, పేదలకు లబ్ధి చేకూర్చే పథకాలని కేసీఆర్ అన్నారు. ఈ పథకాల్లో ఎటువంటి తేడాలు వచ్చినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

### అపురూపంగా ఆత్మీయ సమ్మేళనాలు

పార్టీ ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణ, నియోజకవర్గాలవారీగా సభలు విజయవంతంగా నిర్వహించారని పార్టీ శ్రేణులను, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కేసీఆర్ అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షలమంది ఈ సమావేశాల్లో పాల్గొన్నట్టు తెలిపారు. 'మనం పనులు బాగా చేస్తున్నం కానీ ప్రచారం లేదని మన శ్రేయోభిలాషులు అంటున్నరు. కనుక చేసిన పనిని చెప్పుకోవాలె. మీరు కూడా నావోతిగనే వుంటెట్ల?'అని ప్రశ్నించారు. ప్రచార సాధనాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. మన ప్రగతి గురించి సానుకూలంగా ఆలోచించే మీడియాను ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన అవసరమున్నదని చెప్పారు 'పదేండ్ల పాలనలో ఒక్కో గ్రామానికి పథకాల రూపంలో ఎన్ని డబ్బులు అందాయి? లబ్ధిదారులకు ఎట్లా అవి ఉపయోగపడుతున్నాయనే విషయంపై దృష్టి సారించాలి. క్యాడర్‌లో అసంతృప్తి ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలి' అని సూచించారు.

### విజన్‌లేని మహారాష్ట్ర

దేశంలో ఇప్పటికీ అత్యధికంగా రైతుల ఆత్మహత్యలు జరుగుతున్న రాష్ట్రం మహారాష్ట్ర అని సీఎం కేసీఆర్ చెప్పారు. మహారాష్ట్ర ప్రభుత్వానికి రైతాంగం విషయంలోనే కాదు అసలు ఏ విషయంలోనూ విజన్ లేదని మండిపడ్డారు. 'తెలంగాణలాంటి పథకాల అమలు చేస్తే దివాలా తీస్తామని మహారాష్ట్ర ప్రభుత్వం అంటున్నన్నది. కానీ, తెలంగాణ ఎందుకు దివాలా తీస్తలేదు?' అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రగతిని చూసేందుకు మహారాష్ట్ర వాళ్లు సొంత బండ్లేసుకుని వస్తున్నారని తెలిపారు. నాందేడ్, కంధార్-లోహా, ఔరంగాబాద్ సభలకు విశేష స్పందన వచ్చిందని సంతృప్తి వ్యక్తంచేశారు.

### కేసీఆర్‌కు కడియం ధన్యవాద తీర్మానం

దళితబంధు పథకం, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం, సచివాలయానికి అంబేద్కర్ పేరు, రాష్ట్రంలో గురుకులాల ఏర్పాటు సహా దళితులకోసం ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై తీర్మానాలను ఎమ్మెల్సీ కడియం ప్రవేశపెట్టారు. తీర్మానాలను బలపరుస్తూ సభను ఆమోదించాలని కోరుతూ ఎస్సీ డెవలప్‌మెంట్‌శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, గోరటి వెంకన్న, ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, గువ్వల బాలరాజు ప్రసంగించారు. తీర్మానాలకు సభ ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ సైతం తీర్మానాల పైనా స్పందించి ఆమోదించారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా పార్టీ అధ్యక్షులు మొత్తం 279 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

## ప్రతినిధుల సభ క్రమమిది

ఉదయం 11 గంటలకు తెలంగాణ భవన్‌కు చేరుకొన్న సీఎం కేసీఆర్.. తొలుత తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. తర్వాత ప్రతినిధుల సభకు చేరుకున్నారు. పార్టీ సెక్రటరీ జనరల్, ఎంపీ కే కేశవరావు ప్రసంగంతో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. అనంతరం కేసీఆర్ ప్రసంగం కొనసాగింది. చివరిగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీర్మానాలను ప్రవేశ పెట్టడంతో మొదటి సెషన్ పూర్తయింది. భోజనాల తర్వాత 2:30 గంటలకు సభ తిరిగి ప్రారంభమైంది. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి మొదటగా తీర్మానాలను బలపరుస్తూ ప్రసంగించారు. ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, ఎమ్మెల్సీ తాతా మధు, జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్, మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తీర్మానాలపై ప్రసంగించి ఆమోదించాలని కోరారు.

## పల్లె నిద్రలు.. బస్తీ నిద్రలు చేయండి

"ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకోవటానికి పల్లె నిద్ర, పట్టణాల్లో బస్తీ నిద్ర కార్యక్రమాలు ఉపయోగపడతాయని కేసీఆర్ సూచించారు. బస్తీలవారీగా, వార్డులవారీగా పల్లెలు పట్టణాల్లో నియోజకవర్గాలవారీగా తిరిగి సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సమగ్ర సమాచారంతో, తగిన వ్యూహంతో ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. ఎప్పటికపుడు ఈ సమీక్షల నివేదికలు పార్టీ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. రాబోయే పది రోజుల్లో ప్రజలతో సమీక్ష కార్యక్రమం ముగించాలని స్పష్టంచేశారు.

## కేంద్రం మీద మనకు ఆశలేదు

కేంద్రం చేసే సాయం 'దొంగలు పడ్డ ఆర్నెల్లకు కుక్కలు మొరిగినట్టు' ఉన్నదని సీఎం కేసీఆర్ ధ్వజమెత్తారు. 'తెలంగాణ రైతులకు కేంద్రం మీద ఆశలు ఏనాడూ లేవు. అవసరానికి అక్కరకొచ్చే పరిస్థితి కేంద్రానికి లేదు కాబట్టే రాష్ట్రమే కష్టమైనా నష్టమైనా భరించాలని నిర్ణయించుకున్నది' అని అన్నారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల సాయం ప్రకటించడం దేశంలోనే మొదటిసారి అని తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజను కొంటున్నది దేశంలో తెలంగాణ ప్రభుత్వం మాత్రమేనని చెప్పారు. 'తెలంగాణ పచ్చబడ్డది.. పల్లెలు సల్లబడ్డయి.. వలసపోయినవాళ్లు తిరిగివస్తున్నారు. కొత్త రాష్ట్రంగా ఆవిర్భవించాక అనేక రాష్ట్రాల మాడల్స్ తెప్పిచ్చి మనం ఎలా ముందుకుపోవాలని పరిశీలించా. వాటికంటే తెలంగాణ ముందంజలో ఉన్నది. మన పార్టీ రైతు పార్టీగా మారింది. రైతు రాజ్యాన్ని నడిపించుకుందాం'అని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్ర జీఎస్డీపీలో వ్యవసాయరంగం వాటా 23% చేరడం గొప్ప విషయమని అన్నారు.

---

## ఉజ్వల భారత్ కోసం బీఆర్‌ఎస్

### మంత్రి హరీశ్

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ):'స్వరాష్ట్ర సాధన కోసం నాడు టీఆర్‌ఎస్.. ఉజ్వల భారత్ కోసం నేడు బీఆర్‌ఎస్' అని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన ట్వీట్ చేశారు. 'కేసీఆర్ గారి సారథ్యంలో 22 ఏండ్ల క్రితం పురుడు పోసుకొన్న ఉద్యమ పార్టీ స్వరాష్ట్ర గమ్యాన్ని ముద్దాడి నేటి బంగారు తెలంగాణకు బాటలు వేసింది. అనతికాలంలోనే ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన పార్టీగా నిలిచి.. దేశానికే రోల్‌మాడల్ అయ్యింది. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి నాంది పలికింది. 9 ఏండ్లలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన కేసీఆర్, తెలంగాణ అభివృద్ధి మాడల్‌ను దేశ వ్యాప్తం చేసేందుకు బయలుదేరారు. దేశ అభివృద్ధి కోసం తలపెట్టిన మహాయజ్ఞం జాతీయస్థాయిలో విస్తరించి, మరిన్ని విజయాలు సాధించాలి. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేశవిదేశాల్లోని 'గులాబీ' అభిమానులకు పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు.' అని పేర్కొన్నారు.

# బీసీ జనగణన చేపట్టాలి

- గణనపై కేంద్రానికి భయమెందుకు?
- మత విద్వేషాలతోనే బీజేపీ కాలక్షేపం
- దళితబంధు సామాజిక పెట్టుబడి
- 1,250 కోట్లకు చేరిన పార్టీ ఫండ్
- బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకల్లో కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం తక్షణమే బీసీ జనగణన చేపట్టాలని సీఎం కేసీఆర్ డిమాండ్ చేశారు. బీసీ జన గణన చేపట్టడానికి కేంద్రం ఎందుకు వెనకడుగు వేస్తున్నదని ప్రశ్నించారు. గురువారం తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ 23వ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా పార్టీ ప్రతినిధుల సభలో సీఎం ప్రసంగించారు. గణన మత విద్వేషాలతో కాలయాపన చేస్తూ పక్కకు పెడుతున్నారని కేంద్రంపై మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బీఆర్ అంబేద్కర్ దార్శనికతతోనే సాధ్యమైందని సీఎం చెప్పా రు. సచివాలయానికి కూడా ఆయన పేరు పెట్టుకుని అంబేద్కర్ ఆశయాల సాధన దిశగా ముందుకు పోతున్నామని పేర్కొన్నారు. దళితబంధు పథకానికి పెడుతున్న ఖర్చు సమాజ సంపదను పెంచే సామాజిక పెట్టుబడిగా మారుతుందని వివరించారు. ప్రభుత్వం పంచుతున్న డబ్బు గ్రామాల్లో తిరిగి సమాజానికి చేరుతుందని, దీన్నే 'స్పిన్ ఆఫ్ ఎకానమీ' అంటారని తెలిపారు. ఎన్ని కష్టాలొచ్చినా దళితబంధు పథకం కొనసాగుతూనే ఉంటుందని తేల్చిచెప్పారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ప్రభుత్వాల మీద దళితబంధు ఒత్తిడి పెంచుతున్నదని చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీ ఫండ్ గురువారం నాటికి రూ.1,250 కోట్లకు చేరిందని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇందులో రూ.767 కోట్లను డిపాజిట్ చేశామని, తద్వారా నెలకు రూ.7 కోట్ల వడ్డీ వస్తున్నదని, దీంతో పార్టీని నడుపడం, జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణాలు, ప్రచారం, మౌలిక వసతుల కల్పన కోసం ఖర్చు చేస్తున్నామని వివరించారు.



తెలంగాణభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వేంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరిస్తున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా

### ముఖ్య కార్యక్రమాలు

- మే 4వ ఢిల్లీలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం.
- జూన్ 1న హైదరాబాద్‌లో అమరుల స్మారకం ఆవిష్కరణ.
- జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకలు.

### నూతన సచివాలయ ప్రారంభానికి రండి

ఈ నెల 30న ప్రారంభించుకునే నూతన సచివాలయానికి ప్రజాప్రతినిధులు, అధికారు లు మధ్యాహ్నం 12.45 కల్లా చేరుకోవాలని సీ ఎం సూచించారు. ఆ రోజు మధ్యాహ్నం 1.58 నుంచి 2.04 వరకు మంత్రులు వారి చాంబర్స్‌లో ఆసీనులు కావాలని ఆదేశించారు.



బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం తెలంగాణభవన్‌లో పార్టీ జెండాను ఎగరవేస్తున్న అధినేత, సీఎం కేసీఆర్. చిత్రంలో పార్టీ సెక్రటరీ జనరల్ కే కేశవరావు, మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, ఎంపీ నామా, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పార్టీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

## అట్టహాసంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ సంబురం

### గులాబీ జెండా ఆవిష్కరించిన అధినేత కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం తెలంగాణభవన్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, నమస్కరించారు. అక్కడి నుంచి భవన్ ప్రాంగణంలోని ఆచార్య కొత్తపల్లి జయశంకర్ విగ్రహం వద్దకు చేరుకొని, పూలమాలవేసి, నివాళి అర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ శ్రేణులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పార్లమెంటరీ పార్టీనేత కేకే తదితరులు పాల్గొన్నారు.

---

## రైతు రాజ్యం కోసం వడివడిగా అడుగులు

### ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ శ్రేణులకు ఎమ్మెల్సీ కవిత శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఈ మేరకు ట్వీట్ చేశారు. 'కేసీఆర్ నాయకత్వంలో పిడికెడు మందితో ప్రారంభమై.. ప్రత్యేక రాష్ట్రం సాధించి.. తొమ్మిదేండ్ల పాలనలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపి.. నేడు దేశ ప్రగతి కోసం, రైతు రాజ్యం కోసం వడివడిగా అడుగులు వేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులకు, కుటుంబ సభ్యులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు. తెలంగాణ తల్లి విముక్తి కోసం ఆనాడు.. భరతమాత బంగారు భవిత కోసం ఈనాడు.. జై కేసీఆర్.. జై తెలంగాణ... జై భారత్' అని పేర్కొన్నారు.

# రైతులకు మనమే భరోసా

- వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తిననీయం
- దళితబంధులో అవినీతి తేలితే చర్యలు
- తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్
- బీఆర్‌ఎస్ ప్రతినిధుల సభలో కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో దేశంలో రైతు రాజ్యం సాధిస్తామని సీఎం కేసీఆర్ చెప్పారు. తెలంగాణ సాధించిన స్ఫూర్తితో 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' నినాదంతో దేశాన్ని ప్రగతి పథంలో నిలిపేందుకు ముందుకు సాగుతున్నాం' అని తెలిపారు. గురువారం బీఆర్ఎస్ 23వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ ప్రతినిధుల సభను ఉద్దేశించి సీఎం కేసీఆర్ ప్రసంగించారు. వ్యవసాయాన్ని నిలబెట్టాలనేదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. 'ఎన్ని కష్టాలొచ్చినా వ్యవసాయాన్ని ఆదుకుంటాం. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందచేస్తాం. రైతుల ఆత్మస్థైర్యం ఎట్టి పరిస్థితుల్లోనూ దెబ్బతినకుండా చూస్తాం. అని స్పష్టంచేశారు.

### దళితబంధులో అవినీతి తేలితే టికెట్ కట్

దళితబంధు అమలులో అవినీతి తేలితే వచ్చే ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇచ్చే ప్రసక్తే ఉండదని సీఎం కేసీఆర్ హెచ్చరించారు. ఈ పథకంలో అవినీతికి ఎంతమాత్రం ఆస్కారం ఉండకూడదని ప్రజాప్రతినిధులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. 'నేను ఆత్మ పెట్టుకొని దళితబంధు పథకాన్ని రూపొందించిన. అహోరాత్రులు ఆలోచిస్తే దళితబంధు పుట్టింది. ఇంత మంచి పథకం అమలులో ఎక్కడా అవినీతి ఆస్కారాలకు తావు ఉండకూడదు. ఇందులో ఎమ్మెల్యేలే కాదు.. కిందోడు తప్పు చేసినా ఎమ్మెల్యేలదే బాధ్యత. ఈ విషయాన్ని గుర్తుంచుకొని మసలుకోవాలి' ఆయన హెచ్చరించారు.

### ప్రజలు సంతోషంగా ఉన్నారు: సండ్ర




రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి లబ్ధిదారుల ఇండ్లవద్దకే వెళ్లి అభిప్రాయాలు తెలుసుకొంటున్నామని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య చెప్పారు. ప్రజలు చాలా సంతోషంగా స్పందిస్తున్నారని తెలిపారు.

### దేశానికి కేసీఆర్ ఆదర్శం: గువ్వల



దళితబంధు తెచ్చి, సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టిన మహానాయకుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కీర్తించా రు. సీఎం నిర్ణయాలు దేశానికే ఆదర్శమన్నారు.

### సంపద ప్రజలకే: ఎమ్మెల్సీ సిరికొండ



దళితబంధు ఒక విప్లవం, ఒక సంస్కరణ అని ఎమ్మెల్సీ సిరికికొండ మధుసూదనాచారి అన్నారు. తరతరాలుగా సంపద సృష్టిలో ముం దున్నా.. ఇప్పటివరకు ఆ సంపద పంపిణీ జరగలేదని గ్రహించిన సీఎం కేసీఆర్, సృష్టించిన సంపదను ప్రజలకు పంచుతూ చరిత్రలో దార్శనికుడిగా నిలిచిపోతున్నారని కొనియాడారు.

### దేశం రుణపడి ఉంటది: బాల్క సుమన్



సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్నపుడే దళిత చైతన్య జ్యోతి కార్యక్రమంతో దళితుల అభివృద్ధి కోసం తపన పడ్డ దార్శనికుడు సీఎం కేసీఆర్ అని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ కొనియాడారు. కేసీఆర్ చేస్తున్న కృషికి భవిష్యత్తులో యావత్ భారతదేశం రుణపడి ఉంటుందని చెప్పారు.

### అబ్ కీ బార్ కేసీఆర్ సర్కార్: తోట



కేసీఆర్ నాయకత్వాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు విపరీతంగా ఆదరిస్తున్నారని ఏపీ రాష్ట్ర బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ పేర్కొన్నారు. కేంద్రంలో 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ మాత్రమే కాదు.. అబ్ కీ బార్ కేసీఆర్ సర్కార్' అని ఆయన ఆకాంక్షించారు.

### అవసరమైతే పార్టీ టీవీ ఛానల్

ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడం, ప్రజలతో కమ్యూనికేషన్స్ పెంచుకోవడం ప్రజాప్రతినిధులు కీలకమైన అంశంగా భావించాలని కేసీఆర్ సూచించారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజల్లో ఉండేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవడానికి టీవీ యాడ్స్, ఫిల్మ్ ప్రొడక్షన్‌ను భవిష్యత్తులో చేపట్టే అవకాశాలు న్నాయని చెప్పారు. ఇంకా అవసరమైతే పార్టీ ఆధ్వర్యంలో టీవీ ఛానల్‌ను కూడా తెస్తామని పేర్కొన్నారు.

## దేశానికి కేసీఆర్ నాయకత్వం అవసరం

- బీఆర్‌ఎస్ బలం కేసీఆర్, కార్యకర్తలే
- పార్లమెంటరీ పార్టీ నేత కేశవరావు



హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): ప్రస్తుతం దేశానికి సీఎం కేసీఆర్‌లాంటి ముందుచూపు ఉన్న నాయకత్వం అవసరమని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు అభిప్రాయపడ్డారు. విద్యార్థి నాయకుడిగా మాజీ ప్రధాని నెహ్రూతో సహా అనేకమంది నాయకులతో తాను కలిసి పనిచేశానని, తన సుదీర్ఘ రాజకీయ అనుభవంలో చూసిన గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని కేశవరావు పేర్కొన్నారు. తెలంగాణభవన్‌లో గురువారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ప్రతినిధుల సమావేశంలో కేశవరావు మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు బలం సీఎం కేసీఆర్, కార్యకర్తలే అని స్పష్టం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అఖండ విజయంలో కార్యకర్తలు గొప్ప పాత్ర పోషించారని గుర్తుచేశారు. 'నేషనల్ మిషన్'తో పార్టీని ముందుకు తీసుకుపోవాలన్నారు.

# దేశమంతా రైతు రాజ్యం

- భారీ రిజర్వాయర్ల నిర్మాణంతో నీటి సద్వినియోగం
- దేశవ్యాప్తంగా రైతుబంధు, రైతుబీమా, దళితబంధు
- కాంగ్రెస్, బీజేపీతో దేశం అధోగతి
- ప్రజాకాంక్ష మేరకు పరివర్తన రావాలి
- బీఆర్ఎస్ ప్రతినిధుల సభలో తీర్మానాలను ప్రవేశపెట్టిన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో సీఎం కేసీఆర్, కే కేశవరావు, స్పీకర్ పోచారం, శాసన మండలి చైర్మన్ గుత్తా, మంత్రులు మహమూద్ అలీ, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ఐకే రెడ్డి తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): దేశంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన పరివర్తనను సాధించేందుకు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అప్రతిహతంగా పురోగమిస్తుందని పార్టీ ప్రతినిధుల సభ ప్రకటించింది. భారతీయ సమాజం వికాసం ఆశించిన స్థాయిలో జరగడంలేదని.. దేశంలో అసహనం పెరిగిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేసింది. గురువారం తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ ప్రతినిధుల సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఆ తీర్మానాలపై చర్చ అనంతరం సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. దేశవ్యాప్తంగా బీఆర్ఎస్ విస్తరిస్తున్న తరుణంలో నిర్వహించిన ఈ సభ కీలక అంశాలపై దేశానికి స్పష్టత ఇచ్చింది. కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను ఎండగట్టి, బీఆర్ఎస్ ప్రాధాన్య తాంశాలను ప్రకటించింది. వాటిని సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ సాధిస్తుందని సభ అభిప్రాయపడింది. 'భారతదేశం రత్నగర్భ. ప్రకృతి ప్రసాదించిన అపారమైన అద్భుతమైన వనరులెన్నో ఉన్నా వాటిని వినియోగించుకోవడంలో ఇప్పటివరకు దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీ ఘోరంగా విఫలమయ్యాయి. ప్రజలకు తాగునీరు అందించలేని స్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉన్నది' అని విమర్శించింది.

## తీర్మానాలు

- దేశంలో వేల టీఎంసీల సామర్థ్యంతో కూడిన భారీ రిజర్వాయర్లను కనీసం రెండుమూడైనా నిర్మించాలి.
- నీటి వినియోగ విధానాన్ని మార్చాలి.
- వృథాగా నీటిని వినియోగించుకోవడానికి ప్రాజెక్టులు నిర్మించాలి.
- ప్రతి రాష్ట్రంలో కనీసం ఒక భారీ నీటి పారుదల ప్రాజెక్టు అయినా కేంద్ర నిధులతో నిర్మించాలి.
- దేశవ్యాప్తంగా దళితులకు దళితబంధు అమలు చేయాలి.
- వెంటనే జనగణన, బీసీ గణన చేపట్టాలి. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి
- దేశంలో సమగ్ర సాగునీటి విధానం రూపొందించాలి.
- తెలంగాణలో నెలకొల్పిన రైతురాజ్యం దేశమంతటా స్థాపించాలి.
- దేశవ్యాప్తంగా వ్యవసాయానికి ఉచితంగా, అన్ని రంగాలకు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసే నూతన విధానాన్ని తీసుకురావాలి.
- దేశంలో రైతులందరికీ రైతుబీమా, రైతుబంధు అమలు చేయాలి.
- వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలి.
- వాహనాల వేగం పెంచడానికి రహదారులను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలి.
- దేశంలో నిజమైన రైతు రాజ్యాన్ని నెలకొల్పే దిశగా బీఆర్ఎస్ పురోగమించాలి
- బీజేపీ ప్రభుత్వ దళిత వ్యతిరేక వైఖరిని సభ తీవ్రంగా ఖండించింది.
- దేశంలో భారీస్థాయిలో మౌలిక వసతుల కల్పన జరగాలి.

## జలదృశ్యం టు సుజల దృశ్యం

- పార్టీ ప్రగతి ప్రస్థానం అనన్యసామాన్యం
- దార్శనికత కలిగిన కేసీఆర్ వల్లే సాధ్యం
- పార్టీ ప్రతినిధుల సభలో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): నాటి జలదృశ్యం నుంచి నేటి సుజల దృశ్యం వరకు బీఆర్ఎస్ ప్రగతి ప్రస్థానం అనన్యసామాన్యంగా, అప్రతిహతంగా దూసుకుపోతున్నదని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు చెప్పారు. ఇదంతా సమర్థవంతమైన సీఎం కేసీఆర్ నాయకత్వం, దార్శనికతతోనే సాధ్యమైందని అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో పార్టీ ప్రతినిధుల సభలో కొన్ని తీర్మానాలు ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 'నేను ఇటీవల ఒక పెద్ద మనిషిని కలిసినప్పుడు వారు మీ సీఎంలో ఉద్యమకారుడే కాదు మంచి పాలనాదక్షుడు ఉన్నారు. ఇట్లా రెండూ కలిసి ఉండడం అరుదని కొనియాడారు. మన ప్రభుత్వ విధానం విధానం దేశానికి ఆదర్శంగా నిలిచింది. డాటా లేకుండా చేసే పాలన కరెక్టు కాదనేది మన సీఎం నమ్మిన అంశం. అందుకే రాష్ట్రం ఏర్పాటవగానే సమగ్ర కుటుంబ సర్వే చేపట్టి గణాంకాలతో అభివృద్ధిని సుసంపన్నం చేశారు' అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. దేశంలో 2.8 శాతం జనాభా కలిగిన తెలంగాణ అభివృద్ధి, పంచాయితీరాజ్ శాఖలో 30 శాతం జాతీయ అవార్డులను సొంతం చేసుకున్నట్టు వివరించారు. ధాన్యం దిగుబడి భారీగా పెరిగిందని, విద్య, వైద్య విద్య, గురుకులాల ఏర్పాటు వేరే ఏ రాష్ట్రంలో కూడా ఇంతగా లేవని వెల్లడించారు. దేశంలో ఒకే ఒక స్టార్టప్ స్టేట్ గా తెలంగాణ ఎదగడం గర్వకారణమని ఆనందం వ్యక్తం చేశారు. మౌలిక వసతుల కల్పన అనేది అభివృద్ధికి మూలమని, నాటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనెడీ చెప్పినట్టు పేర్కొన్నారు. దేశంలో సహజ వనరులను వాడుకొనే తెలివున్న ప్రభుత్వాలే లేవన్నారు. 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అని సీఎం కేసీఆర్ పిడికిలి బిగిస్తే దేశమంతా గొప్పగా స్పందిస్తున్నదని తెలిపారు. మహారాష్ట్రలో విజయవంతమవుతున్న సభలే నిదర్శనమన్నారు.

### మన విధానాలు అమలు చేస్తే..

'మన తల్లిదండ్రులు జీవిత చరమాంకంలో ఇల్లు కట్టుకొనేవారు. నేటి ఐటీతరం ఉద్యోగం రాగానే లోన్ తెచ్చుకొని ఇల్లు కడుతున్నారు. అప్పు తీర్చగలమనే భరోసాతో అభివృద్ధి చెందుతున్నారు. కేంద్ర పాలకులు ముఖ్యంగా బీజేపీ వంటి ప్రభుత్వాలు ఈ విధానాన్ని అనుసరిస్తే దేశం ఎప్పుడో ఐదు ట్రిలియన్ మార్కును దాటేది. ప్రపంచంలో అత్యంత అప్పులున్న దేశాలు, అదే సందర్భంలోనూ అత్యంత ధనవంతమైన దేశాలు అమెరికా, జపాన్‌లే' అనే విషయాన్ని మంత్రి కేటీఆర్ గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ చెప్పినట్టు నూతన ఆర్థిక విధానం తక్షణావసరమని తెలిపారు. 'విజన్ ఫర్ నయా భారత్' పేరిట మన అధినేత దార్శనికతతో ముందుకుపోవాలని సూచించారు. ఇప్పుడు దేశానికి కావాల్సింది 'డబుల్ ఇంజిన్ సర్కార్ కాదు.. డబుల్ ఇంపాక్ట్ సర్కార్' అని పేర్కొన్నారు. రాష్ట్రంలో శ్వేత, నీలి, పింక్, ఎల్లో వంటి ఐదు విప్లవాలతో అప్రతిహత ప్రగతిని సాధిస్తున్నట్టు వెల్లడించారు. రూ.4.5 లక్షల కోట్లను వ్యవసాయం, అనుబంధ రంగాలకే ఖర్చు చేయడం దేశంలోనే ఎన్నడూ జరగలేదని చెప్పారు. పాలకు సైతం జీఎస్టీ వసూలు చేస్తున్న కేంద్ర.. అదానీకిచ్చిన పోర్టులకు ఎందుకు జీఎస్టీ వసూలు చేయట్లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. యువత రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

## సీఎం కేసీఆర్‌కు పాదాభివందనాలు

- ప్రతినిధుల సభలో ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతి



హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): సకల సంపదలుగల దేశంలో దరిద్రమెందుకుందని తాను చిన్నప్పుడు విన్న పాటకు నేడు కేసీఆర్ సమాధానమైతున్నడని ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం కేసీఆర్ అని, ఆయనకు ఈ సందర్భంగా పాదాభివందనాలు తెలియజేస్తున్నానని చెప్పారు. దళిత బంధు విప్లవాత్మక పథకం అని, దీన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. భారతదేశ గతిని మార్చే విజన్‌తో ముందుకు సాగుతున్న సీఎం కేసీఆర్‌కు అండగా ఉంటామని తెలిపారు.







## బీసీ జనగణన చేపట్టాలి

- బీజేపీకి ప్రేమ ఉంటే బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటుచేయాలి:మంత్రి శ్రీనివాస్‌గౌడ్



హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): బీసీల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే రెచ్చగొట్టడం కాకుండా బీసీ జన గణన చేపట్టాలని, చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రతినిధుల సభలో బీసీల తీర్మానాన్ని బలపరిచారు. అనంతరం మాట్లాడుతూ కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం రూ.2 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని, తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం 8 ఏండ్లలో దాదాపు 1.60 లక్షల కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. బడ్జెట్‌లో బీసీ మంత్రిత్వ శాఖకు రూ.6,900 కోట్లు కేటాయించామని, దీనికి అదనంగా చేపలు, గొర్రెలకు నిధులు కేటాయించినట్టు చెప్పారు. తెలంగాణ తరహాలో దేశవ్యాప్తంగా బీసీ గురుకులాలు, , ఢిల్లీలో ఆత్మగౌరవ భవనాలకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.

## కేసీఆర్ ప్రభంజనాన్ని ఆపలేరు

- దేశంలో కొనసాగనున్న బీఆర్ఎస్ హవా: విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): దేశంలో బీఆర్ఎస్ హవా కొనసాగనున్నదని, కేసీఆర్ ప్రభంజనాన్ని ఆపడం ఎవరితరం కాదని మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సభలో రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సీఎం కేసీఆర్ ఆ రోజు జలదృశ్యంలో చెప్పిందే నేడు జరిగింది. మన రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి.. దేశం మొత్తం తెలంగాణతరహా పాలన కోరుకొంటున్నది. తెలంగాణకు సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల ప్రజలు సైతం మన పథకాలు కావాలని కోరడం.. మన నాయకుడి సమర్థ పాలనకు నిదర్శనం' అని పేర్కొన్నారు. దేశం యావత్తు తెలంగాణ మాడల్ కోరుకొంటున్నదని చెప్పారు. దీంతో కేంద్రంలోని బీజేపీతోపాటు మోదీ, షా ద్వయానికి భయం పట్టుకొన్నదని అన్నారు. దేశానికి పట్టిన ఈ దారిద్ర్యాన్ని పారదోలాలంటే కేసీఆర్‌లాంటి సమర్థుడు దేశానికి ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షించారు.

## దళితబంధు విప్లవాత్మకం

- దేశానికే రోల్ మాడల్‌గా దళిత బంధు పథకం: ఎమ్మెల్సీ కడియం శ్రీహరి



హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): 75 ఏండ్ల దేశ చరిత్రలో దళితుల అభ్యున్నతి గురించి సీఎం కేసీఆర్ మాత్రమే ఆలోచించారని విప్లవాత్మక దళిత బంధు తీసుకొచ్చారని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి చెప్పారు. ఇది దేశానికే రోల్‌మాడల్‌గా నిలిచిందని తెలిపారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ గొప్ప విజనరీ అని, దేశంలో నెహ్రూ తర్వాత అంతటి గొప్ప స్టేట్స్‌మన్ అని ప్రశంసించారు. పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రతినిధుల సభలో సచివాలయానికి అంబేద్కర్ పేరు, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు, దళిత బంధు పథకం ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతూ.. పార్లమెంటుకు కూడా అంబేద్కర్ పేరు పెట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ, సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం దళితజాతికి గర్వకారణమని పేర్కొన్నారు. ఢిల్లీ పార్లమెంటు భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని విజ్ఞప్తి చేస్తూ తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. దేశంలోని ప్రతి ఒక్కరికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందాలంటే ఢిల్లీలో బీఆర్ఎస్ జెండాను ఎగరేయాల్సిందేనని అన్నారు.

## బీఆర్ఎస్‌తోనే దేశానికి కొత్త దిశ

- దేశ రైతాంగానికి రోల్ మాడల్‌గా తెలంగాణ: రైతు బంధుసమితి చైర్మన్ పల్లా



హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): దేశానికి కొత్త దశ, దిశను చూపేది బీఆర్ఎస్సేనని, దేశ నిర్మాణంలో బీజేపీ, కాంగ్రెస్ విఫలమయ్యాయని రైతుబంధు సమితి చైర్మన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ పల్లా మాట్లాడారు. 75 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా దేశం నీళ్లు, విద్యుత్తు, ఆహార కొరతతో అలమటించడం దారుణమని, నాయకత్వలేమి దీనికి కారణమని.. కేసీఆర్ వంటి విజనరీతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. విద్యుత్తు, వ్యవసాయం, నీటిపారుదలలో తెలంగాణ రోల్‌మాడల్‌గా ఉన్నదని, బీఆర్ఎస్ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక ఈ మూడింటిపై సమగ్ర విధానాన్ని సమస్యలన్నింటికీ పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. సింగపూర్‌కు లీక్వాన్ యూ, చైనాకు డెంగ్ జియావో పింగ్, జపాన్‌కు షింజో అబే, మలేషియాకు మెహతీర్ మహ్మద్‌లా తెలంగాణను కేసీఆర్ తీర్చిదిద్దారని పేర్కొన్నారు. వ్యవసాయంలో దేశంలోనే తెలంగాణ నంబవర్‌వన్‌గా ఉన్నదని, రైతుబంధు, రైతుబీమాను అనేక రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని చెప్పారు.విద్యుత్తు రంగంలో తెలంగాణ అద్భుతాలు సృష్టించిందన్నారు.

## తెలంగాణలో అంబేద్కర్‌కు గౌరవం

- ప్రతినిధుల సభలో మంత్రి కొప్పుల



హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు తెలంగాణలో సముచిత గౌరవం దక్కిందని ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఆర్టికల్ 3ను రాజ్యాంగంలో పొందుపర్చి తెలంగాణ లాంటి ప్రాంతాలకు అంబేద్కర్ ఎంతో న్యాయం చేశారని తెలిపారు. ఆ ఆర్టికల్ ద్వారా తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలు ఏర్పడ్డా.. ఎవరూ అంబేద్కర్ గొప్పతనాన్ని గుర్తించలేదని పేర్కొన్నారు. కానీ, సీఎం కేసీఆర్ అంబేద్కర్‌కు సముచితమైన గౌరవం కల్పించారని చెప్పారు. తెలంగాణలో ఎస్సీ బిడ్డలకోసం పెద్ద సంఖ్యలో ఎస్సీ గురుకులాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మార్కెట్ కమిటీల్లో కూడా రిజర్వేషన్లు కల్పించామని వెల్లడించారు. దళిత బంధు ద్వారా రాష్ట్రంలో ఇప్పటికే 40 వేల కుటుంబాలకు రూ.4 వేల కోట్లు అందించినట్టు తెలిపారు. ఈ పథకాన్ని దేశమంతా అమలు చేయాలని దళితులు కోరుతున్నారని చెప్పారు. దేశం మొత్తం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకొంటున్నదని తెలిపారు.

## దేశ రాజకీయాలను మలుపు తిప్పే సత్తా

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): దేశ రాజకీయాలను మలుపు తిప్పే సత్తా సీఎం కేసీఆర్‌కే ఉన్నదని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. దళిత బంధు పథకంతో దేశంలో దళిత జనోద్ధరణకు సీఎం కేసీఆర్ కొత్త దారి చూపారని అన్నారు. పైనుంచి కిందికి పారే సహజ లక్షణమున్న నీటి ప్రవాహ దశను కాళేశ్వరంతో మార్చి కేసీఆర్ అపర భగీరథుడు అయ్యారని కీర్తించారు. 'తెలంగాణలో మూడు కాలాలతోపాటు మరో నీళ్ల కాలం వచ్చింది. రైతుబంధు, రైతు బీమాతో రైతు కుటుంబాలు కేసీఆర్‌ను దీవిస్తున్నాయి. నాడు ఒక్కడుగా మొదలై నేడు కోట్లమంది వెంటరాగా.. చేగువేరాలెక్క బయలు దేరిండు. నీటికి నడక నేర్పి మన బతుకులను తీర్చిదిద్దిండు.' అని వ్యాఖ్యానించారు.

## కేసీఆర్‌లో అంబేద్కర్: గోరటి వెంకన్న



హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): తాము సీఎం కేసీఆర్‌లో అంబేద్కర్‌ను చూసుకుంటున్నామని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న చెప్పారు. తెలంగాణ ప్రజల ఎజెండానే పాలన ఎజెండాగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని పేర్కొన్నారు. కరువునేలపై గలగలపారే జలాలను సృష్టించి పొట్టచేతపట్టుకొని వెళ్లిన వారిని తిరిగి తమ గూళ్లకు చేర్చటమే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది కార్మికులు రాష్ట్రానికి వలస వచ్చేలా చేసిన మానవీయ పాలకుడు సీఎం కేసీఆర్ అని చెప్పారు. నెల్సన్ మండేలా, మార్టిన్ లూథర్‌కింగ్, జాన్ ఎఫ్ కెన్నడీ లాంటి ప్రపంచమేధావులతోపాటు ఎస్ఆర్ శంకరన్‌లాంటి మేధావులు కలలుగన్న సమాజాన్ని నిష్ఠతో సీఎం కేసీఆర్ సృష్టిస్తున్నారని తెలిపారు. భారతీయ తత్వజ్ఞానాన్ని ఆకళింపు చేసుకొని సామాజిక, ఆర్థికస్థితిని మార్చేందుకు రాజకీయ అస్త్రాన్ని సంధించిన గొప్ప పాలకుడు సీఎం కేసీఆర్ అని అభివర్ణించారు. ఇదంతా తెలంగాణ పోరుడిగా తన మనసులోంచి వచ్చిన కృతజ్ఞతాపూర్వక అభిప్రాయమని స్పష్టం చేశారు

## కేసీఆర్ వల్లే బంగారు పంటలు: తాతా మధు



హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): తాను సాగునీటి కష్టాలు చూస్తూ పెరిగానని, తెలంగాణలో నేడు సీఎం కేసీఆర్ కృషితోనే బంగారు పంటలు పండుతున్నాయని ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తాతా మధు తెలిపారు. మంత్రి కేటీఆర్ ఐటీకి బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని పేర్కొన్నారు. ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన సినిమా నటి లయ అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోయారని, ఈ విషయాన్ని ఆమె ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారని చెప్పారు. బీజేపీది నాటి హిట్లర్ నాజీ ఫిలాసఫీ అని, ఆ పార్టీ పాలనలో ఆఫ్ఘనిస్తాన్ తదితర దేశాల మాదిరిగా మనదేశంలోనూ అంతర్యుద్ధం వచ్చే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ఆ ప్రమాదం నుంచి దేశాన్ని కాపాడే సత్తా సీఎం కేసీఆర్‌కు మాత్రమే ఉన్నదని తెలిపారు.

## ఢిల్లీలో బీఆర్ఎస్ శాశ్వత కార్యాలయం

- వచ్చే నెల 4న ప్రారంభించనున్న అధినేత సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలో నిర్మించిన బీఆర్ఎస్) నూతన కార్యాలయాన్ని మే 4న అట్టహాసంగా ప్రారంభించనున్నట్టు సీఎం కేసీఆర్ వెల్లడించారు. పార్టీ ఎంపీలంతా కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరవుతారని, మిగిలిన ప్రజాప్రతినిధులు కూడా పాల్గొనవచ్చని తెలిపారు. బీఆర్ఎస్‌గా మారిన అనంతరం పార్టీ కార్యకలాపాలకు జాతీయస్థాయిలో కార్యాలయం ఉండాలనే ఉద్దేశంతో ఢిల్లీలో శాశ్వత కార్యాలయాన్ని నిర్మించారు. జాతీయస్థాయి పార్టీ కార్యకలాపాలన్నీ కేంద్ర కార్యాలయం నుంచి నడువనున్నాయి. వివిధ పార్టీలను ఒకే వేదిక మీదికి తీసుకురావడం, సదస్సులు, సమావేశాలకు పార్టీ కార్యాలయం ఒక వేదికగా పని చేస్తుందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



**బీఆర్ఎస్‌లోకి మహా మాజీ ఎమ్మెల్యే**

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలోకి జోరుగా చేరికలు కొనసాగుతున్నాయి. మహారాష్ట్రలోని భండారా జిల్లా తుమ్సర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నేత చరణ్ వాగ్మారే గురువారం బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈయనతోపాటు అదే జిల్లాకు చెందిన జెడ్పీ మెంబర్లు, తుమ్సర్ నగర పరిషత్తు సభ్యులు, పలువురు సర్పంచ్‌లు, 100 మందికిపైగా నగర సేవకులు గులాబీ తీర్థం పుచ్చుకొన్నారు. వీరందరికీ సీఎం కేసీఆర్ గులాబీ కండువాలు కప్పి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ



కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రికి పోస్ట్ కార్డు రాస్తున్న మంత్రి కేటీఆర్, పక్కన ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, అరూరి రమేశ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

# ‘ఉపాధి’ని సాగుతో అనుసంధానించాలి

- కేంద్రానికి మంత్రి కేటీఆర్ లేఖ
- పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టిన ఎమ్మెల్యే పెద్దికి అభినందనలు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): ఇప్పటికైనా వ్యవసాయాన్ని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో అనుసంధానించే చర్యలను మొదలుపెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రికి పోస్ట్ కార్డు రాశారు. వ్యవసాయాన్ని ఉపాధి పథకంతో అనుసంధానించాలని కేంద్రాన్ని డిమాండ్‌చేస్తూ పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టిన నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని మంత్రి కేటీఆర్ అభినందించారు. గతంలో రాష్ట్ర శాసనసభ ఆమోదించిన తీర్మానం మేరకు కేంద్రంపై ఒత్తిడి పెంచేలా పెద్ది కార్యాచరణకు పూనుకోవడాన్ని మంత్రి స్వాగతించారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రారంభించిన పోస్టుకార్డు ఉద్యమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు అవుతున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# కో ఆప్షన్‌పై అభ్యంతరమెందుకు?

- పట్టణాభివృద్ధిలో కో ఆప్షన్ సభ్యుల సేవలు అవసరం
- మున్సిపల్ బిల్లుపై గవర్నర్ అభ్యంతరాలు అర్థరహితం
- మున్సిపల్ కో ఆప్షన్ల ఫోరం అధ్యక్షుడు సత్యనారాయణ

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన చట్టాలను గవర్నర్ తిరస్కరించడం సరికాదని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 1993 రాజ్యాంగ సవరణ చట్టాన్ని అనుసరించి ఉమ్మడి ఏపీలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మున్సిపల్ చట్టం ఆధారంగానే మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుల నియామకం కొనసాగుతున్నదని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం 2019 నూతన మున్సిపల్ చట్టం ప్రకారం మున్సిపాలిటీ చట్టాలపై అవగాహన కలిగిన నిపుణులు ఇద్దరిని, మైనార్టీ వర్గాల నుంచి మరో ఇద్దరిని కో ఆప్షన్ సభ్యులుగా తీసుకొనేలా, అందులో ఇద్దరు మహిళలు ఉండేలా చట్ట సవరణ చేశారని గుర్తుచేశారు. మున్సిపల్ నూతన చట్టం 2019 సెక్షన్ (4), 5 ప్రకారం మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులకు కూడా కౌన్సిలర్లతో సమాన హోదా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలోని పట్టణాల సంఖ్యతోపాటు, విస్తీర్ణం పెరగడం, పట్టణ ప్రగతితోపాటు వివిధ రకాల అభివృద్ధి పనులను ప్రభుత్వం వేగవంతం చేస్తున్న నేపథ్యంలో పట్టణాభివృద్ధిలో నిపుణులు, మైనార్టీల సలహాలు, సూచనలు స్వీకరించడం కోసం మున్సిపల్ కార్పొరేషన్లలో కో ఆప్షన్ల సంఖ్య 6 నుంచి 10కి పెంచాలని ప్రభుత్వం చట్ట సవరణ చేయగా అసెంబ్లీ ఆమోదించిందని వెల్లడించారు. అంతటి ప్రాధాన్యమున్న బిల్లును గవర్నర్ తిరస్కరించడం సరైంది కాదని ధ్వజమెత్తారు. అదీగాక కో ఆప్షన్లకు ఓటుహక్కే లేనప్పుడు సంఖ్య పెంచితే అభ్యంతరం ఎందుకని, రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న గవర్నర్ తీరు అభ్యంతరకరమని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయాలనే కుట్రతోనే ఇలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# టీజీటీ పోస్టుల సమగ్ర నోటిఫికేషన్ విడుదల

- మే 27 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 44 వేలు దాటిన ఓటీఆర్‌లు
- ట్రిబ్ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు

హైదరాబాద్, ఏప్రిల్27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) పోస్టుల భర్తీకి సంబంధించిన సమగ్ర నోటిఫికేషన్ గురువారం విడుదలైంది. పాఠ్యాంశాల వారీగా, జోన్ల వారీగా పోస్టులు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ తదితర అంశాల పూర్తి వివరాలను శుక్రవారం నుంచి www.treirb.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్టు తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) తెలిపింది. శుక్రవారం నుంచి మే 27 వరకు దరఖాస్తుల స్వీకరిస్తామని వెల్లడించింది. 4,006 టీజీటీ ఉద్యోగాల్లో 3,011 (75.17శాతం) పోస్టులు మహిళలకే కేటాయించడం విశేషం. మిగతా 995 (24.83%) పోస్టులు పురుషులకు దక్కనున్నాయి.

| గురుకులం | మహిళలు | పురుషులు | పోస్టులు |
|---|---|---|---|
| ఎస్సీ | 549 | 179 | 728 |
| ఎస్టీ | 201 | 17 | 218 |
| బీసీ | 1726 | 653 | 2379 |
| మైనార్టీ | 448 | 146 | 594 |
| జనరల్ | 87 | 0 | 87 |
| మొత్తం | 3,011 | 995 | 4,006 |

**9,231 పోస్టులకు నోటిఫికేషన్ పూర్తి**

అన్ని గురుకులాలకు ప్రభుత్వం 11, 687 పోస్టులను మంజూరు చేసింది. అందులో బోధన సిబ్బందికి 10,675 పోస్టులు కాగా, మిగిలినవి 1,012 బోధనేతర పోస్టులు. బోధన సిబ్బంది పోస్టులను ట్రిబ్ ద్వారా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ చేపట్టాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. బోధనేతర సిబ్బంది పోస్టుల్లో స్టాఫ్‌నర్స్ పోస్టులను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు భర్తీ చేయనున్నది. కాగా, గురువారం నాటికి గురుకులాల్లో ఆయా పోస్టులకు సంబంధించి దాదాపు 44 వేల మంది అభ్యర్థులు ఓటీఆర్ చేసుకొన్నట్టు అధికారులు వెల్లడించారు.

# ఆర్టిజన్ల పే రివిజన్‌పై ఉత్తర్వులు

- ఫిట్‌మెంట్, డీఏ, తదితర అంశాల లెక్కింపుపై స్పష్టత

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): పీఆర్సీ ప్రకారం విద్యుత్తు సంస్థల్లోని ఆర్టిజన్లకు జీతభత్యాల పెరుగుదల, వాటిని ఎలా లెక్కించాలనే దానిపై స్పష్టతనిస్తూ ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఆర్టిజన్లలోని గ్రేడ్–1, 2, 3, 4 కార్మికులకు ఏ స్థాయిలో వేతనాలు పెరుగుతాయో స్పష్టంగా పేర్కొన్నారు. 2018లో సవరించిన వేతనం, ఆపై తాజాగా 2022 ఏప్రిల్ నుంచి అందించాల్సిన ఫిట్‌మెంట్ (7 శాతం), రెండు ఇంక్రిమెంట్లు, పే ఫిక్సేషన్, డీఏ, 1.4.2022 నాటికి అత్యధిక పర్సనల్ పే తదితర అంశాలపై ఆ ఉత్తర్వుల్లో స్పష్టత ఇచ్చారు. తాజా ఫిట్‌మెంట్‌ను గత ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి చెల్లించనున్నారు.ఇదిలా ఉండగా.. పెన్షనర్లకు సంబంధించి కూడా రివైజ్డ్ పెన్షన్, డీఆర్, ఇతర వాటిపై ట్రాన్స్‌కో ఉత్తర్వులు జారీచేసింది.

# బీసీ సంక్షేమంలో తెలంగాణ ఆదర్శం

- నాడు భగీరథుడు గంగను రప్పించాడు
- నేడు కేసీఆర్ గోదారిని మళ్లించాడు
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల
- ఘనంగా భగీరథ మహర్షి జయంతి



మహర్షి భగీరథ స్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, శేఖర్ సగర

రవీంద్రభారతి, ఏప్రిల్ 27: బీసీ సంక్షేమంలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నదని తెలిపారు. బీసీల ఆత్మగౌరవం కోసం 41 కుల సంఘాలకు 87.3 ఎకరాల్లో 95 కోట్లతో ఆత్మగౌరవ భవనాలను నిర్మిస్తున్నామని వెల్లడించారు. భగీరథ మహర్షి వారసులైన సగరులకు సైతం కోకాపేటలో రెండెకరాలను కేటాయించడమే కాకుండా 2 కోట్ల నిధులను ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం వెచ్చించామని తెలిపారు. నాడు భగీరథ మహర్షి దివి నుంచి గంగను భువికి రప్పిస్తే, నేడు తెలంగాణ ప్రతి పంట పొలానికి గోదారిని మళ్లించిన సీఎం కేసీఆర్ అపర భగీరథుడయ్యాడని కొనియాడారు. బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ సగర కులస్తులను బీసీ(ఏ)లో చేర్చాలని సీఎం కేసీఆర్‌కు నివేదికను అందించామని, త్వరలోనే అది నెరవేరుతుందని ప్రకటించారు. అంతకు ముందు భగీరథ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు సగర సంఘం నేతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీ ఆర్ కృష్ణయ్య, ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, బీసీ సంక్షేమం సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ కమిషన్ సభ్యుడు సీహెచ్ ఉపేంద్రాచారి, టీయూడబ్ల్యూజే జనరల్ సెక్రటరీ మారుతీసాగర్, సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌సాగర్, ప్రధాన కార్యదర్శి గౌరన్న సాగర్, కోశాధికారి భిక్షపతి సాగర్, భూపేశ్‌సాగర్ సగర, గౌరవాధ్యక్షుడు హరికిషన్‌సాగర్ పాల్గొన్నారు.

# సింగరేణి థర్మల్‌కు ఉత్తమ బహుమతి

**నీటిని పొదుపు చేసినందుకు జాతీయ అవార్డు**

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): సింగరేణి థర్మల్ విద్యుత్తు సంస్థకు నీటి పొదుపులో మరోసారి ఉత్తమ బహుమతి లభించింది. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం అవలంబిస్తున్న పర్యావరణహిత చర్యలకు గుర్తింపుగా జాతీయస్థాయిలో దక్షిణాది రాష్ట్రాల క్యాటగిరీలో ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కింది. థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో అత్యంత పొదుపుగా నీటిని వినియోగిస్తున్నందుకు ముంబైకి చెందిన ప్రముఖ మిషన్ ఎనర్జీ ఫౌండేషన్ సంస్థ ఈ అవార్డును అందించింది. న్యూఢిల్లీలో బుధవారం నిర్వహించిన జాతీయస్థాయి సదస్సులో సంస్థ అధ్యక్షుడు ఎస్ దాల్వి చేతుల మీదుగా థర్మల్ విద్యుత్తు కేంద్రం ఏజీఎం కేఎస్ఎన్ ప్రసాద్ బహుమతిని అందుకున్నారు. సాధారణంగా 500 మెగావాట్లు అంతకు ఎక్కువ స్థాయి గల థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో ఒక మెగావాట్ విద్యుత్తు ఉత్పాదనకు 3 క్యూబిక్ మీటర్ల వరకు నీటిని వినియోగించవచ్చని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ నిబంధన. కాగా.. సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రంలోని ప్రత్యేక ఏర్పాట్లు, చర్యలతో ఈ నీటి వినియోగం 2.69 క్యూబిక్ మీటర్ల వరకు మాత్రమే ఉంటున్నది. ఈ ప్రత్యేకతను గుర్తిస్తూ దక్షిణ భారతదేశంలోని సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని ఎంపిక చేశారు.

## ఏసీబీ వలలో మున్సిపల్ అధికారి

- అసిస్టెంట్ సహా డీసీ అరెస్టు



డీసీ రిచా గుప్తా

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్,27: ఓ కాంట్రాక్టర్ బిల్లు పాస్ కావడానికి సంతకం పెట్టేందుకు లంచం వసూలు చేసిన ఓ అవినీతి అధికారి, ఆమె అసిస్టెంట్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. హైదరాబాద్ సౌత్‌జోన్ కార్యాలయం పరిధిలో క్లాస్–వీ సివిల్ కాంట్రాక్టర్ ఉమర్ అలీఖాన్ రూ.4 లక్షల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేశారు. బిల్లు పాస్ కావడానికి విజువల్ రిపోర్టుపై సంతకం పెట్టేందుకు సర్కిల్–8 డిప్యూటీ కమిషనర్ రిచా గుప్తా రూ.2 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విసిగిపోయిన కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అధికారుల సూచన మేరకు గురువారం మధ్యాహ్నం డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి కాంట్రాక్టర్ ఉమర్ అలీఖాన్ వెళ్లి ఆమె సూచన మేరకు అసిస్టెంట్ సతీశ్‌కు రూ.2 వేలు లంచంగా ఇచ్చాడు. వెంటనే ఏసీబీ డీఎస్పీ అధికారి సయ్యద్ ఫయాజ్ బృందం రిచాగుప్తాను, అసిస్టెంట్ సతీశ్‌ను అదుపులోకి తీసుకొని నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో స్పెషల్ జడ్జి ఎదుట హాజరుపర్చారు.

**తెలంగాణకు ఎక్సలెన్స్ అవార్డు**




సురక్షిత అబార్షన్లలో మొదటి స్థానంలో నిలిచినందుకు ఢిల్లీలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ అశోక్ బాబు, మాజీ అడిషనల్ సెక్రటరీ మనోహర్ అగ్నానీ నుంచి ‘ఎక్సలెన్స్ అవార్డు’ను అందుకుంటున్న తెలంగాణ వైద్యారోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ పద్మజ – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

# జూలై, ఆగస్టులో సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) పరీక్షను జూలై, ఆగస్టులో నిర్వహించనున్నట్టు సీబీఎస్ఈ తెలిపింది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా, మే 26 తుది గడువు అని వెల్లడించింది. కాగా, ఈసారి తెలంగాణలో ఉన్న ఆరు పరీక్ష కేంద్రాలను నాలుగుకు కుదించారు. నల్లగొండ, కరీంనగర్ కేంద్రాలను తొలగించి, హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్ పరీక్ష కేంద్రాలను మాత్రమే కేటాయించారు.

**పరీక్ష కేంద్రాల తొలగింపు సరికాదు**

రాష్ట్రంలో రెండు సీటెట్ పరీక్షాకేంద్రాలను తొలగించడం సరికాదని తెలంగాణ డీఎడ్ బీఎడ్ అభ్యర్థుల సంఘం అధ్యక్షుడు రావుల రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. దీనివల్ల వేలాది మంది అభ్యర్థులకు నష్టం కలుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కంటే ఈసారి రాష్ట్రంలో సీటెట్ రాసే అభ్యర్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నదని, కాబట్టి పరీక్ష కేంద్రాలను పెంచాలని రావుల రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# గ్రామస్థాయిలో రోడ్డు భద్రతా కమిటీలు

- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు
- రాష్ట్రవ్యాప్తంగా హాట్‌స్పాట్‌ల గుర్తింపు
- ప్రమాదాల్లో 53% ద్విచక్రవాహనాలే
- యాక్సిడెంట్ల నివారణలో ములుగు ఫస్ట్
- సమీక్షలో డీజీపీ అంజనీకుమార్




హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి పోలీసు కమిషనర్లు, ఎస్పీలతో డీజీపీ వీసీ

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు, ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు గ్రామస్థాయిలో రోడ్డు భద్రతా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు డీజీపీ అంజనీకుమార్ చెప్పారు. గురువారం తన కార్యాలయంలో రహదారుల భద్రతా చర్యలపై పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కమిటీలో రిటైర్డ్ టీచర్లు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సభ్యులుగా నియమించనున్నట్టు డీజీపీ వెల్లడించారు. తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే హాట్‌స్పాట్లను ఇప్పటికే గుర్తించామని, జిల్లా కలెక్టర్లు, ఆర్‌అండ్‌బీ, ట్రాఫిక్, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో రహదారులు మొత్తం 29,583 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయని వివరించారు. వీటిలో 2020లో 2,882 మంది, 2021లో 7,557 మంది, 2022లో 7,559 మంది మరణించారని తెలిపారు. వీటిలో ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో ఎక్కువగా మరణాలు సంభవించాయని, మొత్తం యాక్సిడెంట్లలో ఇవి 53 శాతమని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను 47 శాతం తగ్గించడంతోపాటు, 63 శాతం మరణాలను తగ్గించడంలో ములుగు జిల్లా మంచి ఫలితాలు సాధించిందని డీజీపీ అభినందించారు. 2021, 2022తో పోల్చితే 2023 మొదటి మూడు నెలల్లో రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్య గణనీయంగా తగ్గిందని రోడ్డు భద్రతా విభాగం అడిషనల్ డీజీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. 45 ఏండ్లు నిండిన డ్రైవర్లందరికీ కంటి పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టిన జిల్లాల ఎస్పీలను డీజీపీ అభినందించారు. కాన్ఫరెన్స్‌లో అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్, ఐజీలు చంద్రశేఖర్‌రెడ్డి, షానవాజ్ ఖాసిం, ఎస్పీ రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు 500 మంది

సైబర్ నేరాల నియంత్రణకు పోలీస్‌శాఖ కొత్తగా ‘సైబర్ సెక్యూరిటీ బ్యూరో’ను ఏర్పాటు చేసింది. ఇది బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి విధులు నిర్వర్తిస్తుంది. ఈ బ్యూరోలో 500 మంది సిబ్బందిని నియమించారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (టీ4సీ తోపాటు ప్రతి జిల్లాలో ‘సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ టీమ్’లను ఏర్పాటుచేశారు. రాష్ట్రంలోని 800 పోలీస్‌స్టేషన్లలో ప్రత్యేకంగా పోలీస్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చి సైబర్ వారియర్లుగా తయారు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు టోల్‌ఫ్రీ నంబర్ 1930, 100లకు వచ్చిన ఫిర్యాదులను విశ్లేషించి.. నేరాల అదుపునకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.


## లోకం పోకడ




## మరో నాలుగు రోజులు వర్షాలు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తేతెలంగాణ): రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలోని పలుచోట్ల తేలిక పాటి నుంచి ఒక మోస్తరు, ఉరుములు, మెరుపులు, వడగండ్ల వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం రాత్రి నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. శుక్ర, శని, ఆది, సోమవారాల్లో ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నదని తెలిపింది. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఏప్రిల్ 30, మే 1వ తేదీల్లో చాలా ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలుంటాయని తెలిపింది.

## ఎండాకాలం



| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| వరంగల్ | 37.0°c | 23.0°c |
| నల్లగొండ | 37.0°c | 21.0°c |
| ఆదిలాబాద్ | 36.8°c | 19.7°c |
| నిజామాబాద్ | 36.5°c | 22.9°c |
| రంగారెడ్డి | 36.5°c | 19.9°c |
| మహబూబ్‌నగర్ | 36.2°c | 22.3°c |
| ఖమ్మం | 35.0°c | 23.0°c |
| మెదక్ | 34.4°c | 19.6°c |
| కరీంనగర్ | 34.0°c | 23.0°c |
| హైదరాబాద్ | 33.0°c | 22.0°c |

**నిపుణ** విద్య, ఉద్యోగ సమాచారం

## అసిస్టెంట్ కమాండెంట్లు

**సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (అసిస్టెంట్ కమాండెంట్) ఎగ్జామినేషన్-2023 నోటిఫికేషన్‌ను యూపీఎస్సీ విడుదల చేసింది.**

- పరీక్ష పేరు: సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (అసిస్టెంట్ కమాండెంట్) ఎగ్జామినేషన్–2023
- మొత్తం ఖాళీలు: 322
- దళాల వారీగా ఖాళీలు: బీఎస్ఎఫ్–86, సీఆర్‌పీఎఫ్–55, సీఐఎస్ఎఫ్–91, ఐటీబీపీ–60, ఎస్ఎస్‌బీ–30
- అర్హతలు: డిగ్రీతోపాటు నిర్దేశిత శారీరక, వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
- వయస్సు: 20– 25 ఏండ్ల మధ్య ఉండాలి
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: మే 16
- వెబ్‌సైట్: https://www.upsc.gov.in

## షార్‌లో టెక్నీషియన్లు

**శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 94
- పోస్టులు: టెక్నికల్ అసిస్టెంట్, సైంటిఫిక్ అసిస్టెంట్, డ్రాఫ్ట్స్‌మ్యాన్ తదితరాలు
- అర్హతలు: పదోతరగతి, డిప్లొమా, ఐటీఐ ఉత్తీర్ణత
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: మే 16
- వెబ్‌సైట్: https://www.shar.gov.in

## ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- ఇండియన్ హిస్టరీ, ప్రైవేట్ ఉద్యోగాలు, జేఎల్ఎం మెటీరియల్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.
- కింది వెబ్‌సైట్‌ను క్లిక్ చేయండి.
- https://bit.ly/420thxP



నూతన సచివాలయంలో సువిశాలంగా క్యాబినెట్ మీటింగ్ హాల్



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయ ఫ్రంట్ వ్యూ



కొత్త సచివాలయంలో ఏర్పాటు చేసిన సోఫాలు

# సచివాలయానికి ఐదంచెల భద్రత

- సీఎం సూచనతో పటిష్ఠ పహారా
- భద్రత పర్యవేక్షణకు టీఎస్ఎస్పీకి డీజీపీ అంజనీకుమార్ ఆదేశాలు
- సుశిక్షితులైన 3 కంపెనీల రాక
- ఆక్టోపస్ నుంచి స్పెషల్ యూనిట్
- రక్షణకు సీఎస్‌డబ్ల్యూ, ఇంటలిజెన్స్, సివిల్ ఫోర్స్ నుంచి బలగాలు
- ట్రాఫిక్ నియంత్రణకు షిఫ్టుల వారీగా సిబ్బందికి విధులు



హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలమేరకు ఐదంచెల భద్రతను ఏర్పాటు చేయనున్నారు. నూతన సచివాలయానికి పటిష్ఠమైన భద్రతను అందించే బాధ్యతను డీజీపీ అంజనీకుమార్ 'తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్' (టీఎస్ఎస్పీ)కు అప్పగించారు. ఈ మేరకు తక్షణమే విధుల్లోకి చేరేలా చర్యలు తీసుకోవాలని టీఎస్ఎస్పీ అడిషనల్ డీజీ స్వాతి లక్రాను డీజీపీ అంజనీకుమార్ ఆదేశించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో.. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్మించుకున్న నూతన సచివాలయాన్ని ఈ నెల 30న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనున్నారు. ఇంద్రభవనాన్ని తలపిస్తున్న మన సచివాలయాన్ని చూసేందుకు ఇప్పటికే ఎంతోమంది సందర్శకులు క్యూ కడుతున్నారు. సచివాలయం ప్రారంభమైన తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, ప్రజల రాకతో సచివాలయ ప్రాంగణం కిక్కిరిసిపోయే అవకాశం ఉన్నందున భద్రతాపరంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్ఠమైన రక్షణ కల్పించాలని ప్రభుత్వం యోచించింది. దీంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు సచివాలయానికి పోలీస్ శాఖ ఐదంచెల భద్రతను ఏర్పాటు చేసింది.




### టీఎస్ఎస్పీ నుంచి మూడు కంపెనీలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ బెటాలియన్స్ నుంచి మూడు కంపెనీలు నిరంతరం గస్తీ కాస్తాయి. బీఆర్ అంబేద్కర్ సచివాలయానికి పక్కనే అమరవీరుల స్థూపం, అంబేద్కర్ 125 అడుగుల భారీ విగ్రహం, ఎన్టీఆర్ ఘాట్, పక్కనే హుస్సేన్ సాగర్, నెక్లెస్ రోడ్ ఈవెంట్స్, ఆ పక్కనే ఐమాక్స్ ఉండటం, ఆ ప్రాంతమంతా టూరిస్ట్ స్పాట్‌గా మారడంతో భద్రతాపరంగా ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. టీఎస్ఎస్పీ బెటాలియన్ నుంచి ఒక్కో కంపెనీలో 90 మంది సిబ్బంది ఉంటారు. వీరిలో ముగ్గురు కమాండెంట్లు, ఆరుగురు అసిస్టెంట్ కమాండెంట్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ర్యాంకు సిబ్బంది ఆరుగురు, ఆర్ఎస్ఐలు 12 మంది, ఏఎస్ఐలు 18, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు కలిపి మొత్తం 90 మంది ఉంటారు. ఇలా మూడు కంపెనీల నుంచి మొత్తం 270 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. పాత సచివాలయానికి కేవలం 150 మంది ఎస్పీఎఫ్ సిబ్బందితో రక్షణ కల్పించగా.. కొత్త సచివాలయానికి ఆ సంఖ్య నాలుగింతలు పెరిగింది.

### రంగంలోకి ఆక్టోపస్, ఇంటలిజెన్స్, సివిల్ ఫోర్సెస్

టీఎస్ఎస్పీ కంపెనీల బలగాలకు తోడు ఆక్టోపస్ నుంచి ఓ యూనిట్‌ను సచివాలయ భద్రతకు కేటాయించారు. ఈ స్పెషల్ యూనిట్‌లో మొత్తం 21 మంది సిబ్బంది ఉంటారు. వీరికి ర్యాంకులవారీగా విధి విధానాలు ఉంటాయి. సిటీ సెక్యూరిటీ వింగ్‌కు చెందిన 80 మంది సిబ్బంది కూడా సచివాలయ భద్రతలో భాగం కానున్నారు. వీరు ప్రత్యేకంగా చెకింగ్, బ్యాగేజీ చెకింగ్, బాంబ్, మెటల్ చెకింగ్ వంటి విధులు నిర్వర్తిస్తారు. ఈ విభాగంలో అడిషనల్ డీసీపీ ర్యాంకు అధికారి ఒకరు, ఏసీపీ ర్యాంకు అధికారులు ముగ్గురు, ఆర్ఐలు ఆరుగురు, ఆర్ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉంటారు. వీరితోపాటు సివిల్ పోలీసుల (సివిల్ ఫోర్స్) నుంచి ఇద్దరు డీఎస్పీలు, ముగ్గురు సీఐలు, ఎస్ఐలు ఆరుగురు, మిగతా సిబ్బంది మొత్తం కలిపి 32 మంది కేవలం సచివాలయ భద్రత కోసం పనిచేస్తారు. ఇంటలిజెన్స్ విభాగం నుంచి అడిషనల్ ఎస్పీ ఒకరు, ఏసీపీ ఒకరు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది భద్రతలో భాగమవుతారు. ఇక స్పెషల్ బ్రాంచ్ నుంచి ఏసీపీ, సీఐ, ఇద్దరు ఎస్ఐలు, సుమారు 8 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తిస్తారు.

### ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక వ్యవస్థ

సచివాలయ పరిసరాల పరిధిలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇందుకోసం సుమారు 25 మంది ట్రాఫిక్ సిబ్బంది షిఫ్టులవారీగా విధులు నిర్వర్తిస్తారు. ప్రస్తుతం సెక్రటేరియట్‌కు 22 మంది ట్రాఫిక్ సిబ్బందిని కేటాయించారు. ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ, మిగిలిన ర్యాంకుల సిబ్బంది ఉంటారు. వీరు సెక్రటేరియట్ పార్కింగ్, సీఎం మూమెంట్, మంత్రుల పార్కింగ్, విజిటర్స్ పార్కింగ్, ఉద్యోగులు, పౌరుల కోసం పనిచేస్తారు. అమరవీరుల స్థూపం, అంబేద్కర్ భారీ విగ్రహం, సచివాలయం ప్రాంతాలకు ఎక్కువగా పర్యాటకులు వచ్చే అవకాశం ఉండటంతో.. సచివాలయంలోకి వెళ్లే ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు విధులకు ఇబ్బంది కలుగకుండా ట్రాఫిక్ సిబ్బందిని సిద్ధం చేశారు. ట్రాఫిక్ రద్దీ పెరిగిన మరుక్షణమే సిబ్బందిని పెంచేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు.



విద్యుద్దీపాల వెలుగులో సచివాలయంలోని ఓ కారిడార్

### ప్రత్యేక శిక్షణ ఇప్పించాం



ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఇక నుంచి అంబేద్కర్ నూతన సచివాలయం భద్రతను టీఎస్ఎస్పీ చూసుకుంటుంది. సిటీ పోలీస్, ఆక్టోపస్, ఇంటలిజెన్స్, ట్రాఫిక్ వంటి విభాగాలను సమన్వయం చేసుకొంటూ కట్టుదిట్టమైన భద్రతను కల్పిస్తాం. రక్షణ విషయంలో రాజీ లేకుండా పహారా కాసే మూడు కంపెనీల సిబ్బందికి ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇప్పించాం. మొత్తం 300 మందిని సిద్ధంగా ఉంచాం. వీరంతా త్వరలో విధుల్లో చేరే అవకాశం ఉంది. రాబోయే కాలంలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, పౌరులు, సచివాలయ భద్రతల దృష్ట్యా మా సిబ్బందిని మరింత పెంచే అవకాశం ఉంది.

**- స్వాతి లక్రా, ఏడీజీ టీఎస్ఎస్పీ బెటాలియన్స్**

### సెక్రటేరియట్ సీఎస్‌వోగా పీ వెంకట్రాములు



నూతన సచివాలయ భద్రతకు సంబంధించి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో)గా తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని టీఎస్ఎస్పీ 3వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ పీ వెంకట్రాములుకు టీఎస్ఎస్పీ అడిషనల్ డీజీ స్వాతి లక్రా ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ కమిషనరేట్ సీపీ సీవీ ఆనంద్, సిబ్బందితో కలిసి సమన్వయంతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. టీఎస్ఎస్పీ నుంచి 1వ, 3వ, 8వ బెటాలియన్స్‌కు చెందిన మూడు కంపెనీలు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పీ వెంకట్రాములు ఆధ్వర్యంలో సచివాలయంలో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పీ వెంకట్రాములు 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ.. సచివాలయానికి పటిష్ఠమైన భద్రతను అందించేందుకు సుమారు 468 మంది సిబ్బంది నిరంతరం విధులు నిర్వర్తిస్తారని వెల్లడించారు. భద్రత విషయంలో రాజీ పడకుండా గస్తీ కాస్తామని తెలిపారు.

## మక్కల కొనుగోళ్లకు గ్రీన్‌సిగ్నల్

మొదటిపేజీ తరువాయి...

నష్టపోయి దుఃఖంలో ఉన్న రైతుకు మార్కెట్లో మక్కల ధర పడిపోవడం ఆవేదన మిగిల్చింది. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. మక్కల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా కొనుగోలు చేయాలని నిర్ణయించింది. వాస్తవానికి నెలక్రితం మార్కెట్లో మక్కలకు భారీ డిమాండ్ ఏర్పడింది. క్వింటాలుకు రూ.1,962 ధర ఉండగా.. మార్కెట్లో మాత్రం క్వింటాలుకు రూ. 2,600 ధర పలికింది. కానీ ప్రస్తుతం భారీగా పడిపోయింది. మద్దతు ధర కన్నా తక్కువగా రూ.1,600 పలుకుతున్నది. ఓ వైపు వర్షాలతో నష్టం, మరోవైపు మక్కల ధర పడిపోవడంతో రైతులు పంటలను అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ మక్కల కొనుగోలుకు ముందుకొచ్చారు. మక్కల కొనుగోలు ద్వారా భారీ ఆర్థిక నష్టం ఏర్పడుతున్నా.. రైతుల మేలు కోసం ప్రభుత్వమే మక్కలు కొనుగోలు చేయాలని నిర్ణయించారు.

## 6 నుంచి 9 తరగతుల్లో ఎల్‌ఐపీ

- **రాష్ట్ర విద్యాశాఖ అధికారుల సమీక్ష**

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో తొలిమెట్టు తరహాలోనే మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తున్నది. 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (ఎల్‌ఐపీ) నిర్వహించాలని భావిస్తున్నది. దీనిపై గురువారం హైదరాబాద్ సైఫాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులు, ఎస్‌ఈఆర్టీ అధికారులతో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎల్‌ఐపీపై క్షేత్రస్థాయిలో నివేదికలు రూపొందించాలని జిల్లా అధికారులకు సూచించారు. మే 8న మార్గదర్శకాలు విడుదల చేస్తారని సమాచారం. కాగా, రాష్ట్రంలోని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను మరింత బలోపేతం చేయాలని విద్యాశాఖ భావిస్తున్నది. టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లు నిర్వహించాలని నిర్ణయించింది. ఈసారి టీచర్ తనకు నచ్చిన సబ్జెక్టు ఎంపిక చేసుకొనే వెసులుబాటు ఇవ్వాలని భావిస్తున్నది.

- **ఎంపీ సంతోష్‌కు తానా ఆహ్వానం**



*ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మహాసభలకు ఎంపీ సంతోష్‌కుమార్‌కు ఆహ్వానం అందింది. గురువారం తానా సభ్యులు ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. యూఎస్‌ఏలోని పెన్సిల్వేనియా కన్వెన్షన్ సెంటర్‌లో జూలైలో నిర్వహించనున్న 23వ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరారు. సదస్సుకు ఆహ్వానించిన తానా సభ్యులకు ఎంపీ ధన్యవాదాలు తెలిపారు.*

*- హైదరాబాద్, నమస్తే తెలంగాణ*

## గాంధీభవన్ దీక్షకు రేవంత్ గైర్హాజరు

హైదరాబాద్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): 'రాహుల్ గాంధీని ఎంపీగా అనర్హుడిని చేయటం దుర్మార్గం. ఆయన కోసం ఏమైనా చేస్తా.' 'రాహుల్ గారూ మా ఇంటికి రండి. మా ఇంటిని మీ ఇంటిగా అనుకోండి'.. పలు సందర్భాల్లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇలాంటి స్టేట్‌మెంట్లు ఇచ్చి తన స్వామిభక్తిని చాటుకున్నారు. కానీ ఇదంతా కపటప్రేమ అని తేలిపోయింది. రాహుల్‌గాంధీపై అనర్హత వేటుకు వ్యతిరేకంగా గాంధీ భవన్‌లో నిర్వహించిన 'సత్యాగ్రహ దీక్ష'కు రేవంత్ హాజరు కాలేదు. దీంతో ఇన్నాళ్లపాటు ఆయన చెప్పినవన్నీ కట్టుకథలేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉంటూ రాహుల్ గాంధీ కోసం ఏమైనా చేస్తానంటూ భీరాలు పలికిన రేవంత్‌రెడ్డి.. దీక్షకు రాకపోవటమేంటని? పార్టీలో పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పదవిని కాపాడుకునేందుకే రేవంత్ నటిస్తున్నారని, వాస్తవానికి రాహుల్‌పై ఎలాంటి అభిమానం లేదని దీక్ష సందర్భంగా నేతలు మాట్లాడుకోవటం గమనార్హం.



నూతనంగా ఎన్నికైన పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

## పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గం

- **అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మోహన్‌రెడ్డి, భాస్కర్‌రావు**

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏపిల్ 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ ఎన్నికలకు చీఫ్ రిటర్నింగ్ అధికారిగా పీవీ నారాయణరావు వ్యవహరించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా కాసర్ల మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఉప్పల నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఉడుతల భాస్కర్‌రావు, కార్యదర్శిగా పోతూరి వెంకట్‌రావు, కోశాధికారిగా వంగేటి అభిషేక్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మోముల సుధాకర్‌రెడ్డి, పురుమండ్ల శ్యామ్ సుందర్‌రెడ్డి, సిద్దెంకి జగన్మోహన్‌రెడ్డి, త్రిపురనేని సుబ్రహ్మణ్యం, వేముల రవీందర్‌రెడ్డి, గంధంనేని వినయ్‌ప్రసాద్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ వచ్చే ఐదేండ్ల పాటు పదవిలో ఉంటుంది.

# ప్రైడ్ ఆఫ్ తెలంగాణ

మొదటిపేజీ తరువాయి...

నిర్మిస్తున్న నూతన పార్లమెంటు భవనం సెంట్రల్ విస్టాకన్నా మన సచివాలయం విశాలమైనదని అన్నారు. ఎన్నో ప్రత్యేకతలతో కూడిన మన సచివాలయం పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట ఆత్మగౌరవ ప్రతీకగా, ప్రైడ్ ఆఫ్ తెలంగాణగా నిలుస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ముందస్తు ప్రణాళికలు, నిరంతర పర్యవేక్షణ ఫలితంగా 20 నెలల్లోనే సచివాలయ నిర్మాణం సాకారమైందని అన్నారు. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 30న అత్యంత వైభవంగా సచివాలయాన్ని ప్రారంభించనున్నామని చెప్పారు. సచివాలయం ప్రారంభ ఏర్పాట్లు, భవనం విశేషాలపై మంత్రి గురువారం 'నమస్తే తెలంగాణ'తో ముచ్చటించారు. వివరాలు ఆయన మాటల్లోనే....

### అనేక ప్రత్యేకతలు మన సచివాలయం సొంతం

*'సచివాలయంలో మొత్తం 635 గదులు, 30 కాన్ఫరెన్స్ హాళ్లను నిర్మించాం. మంత్రులందరికీ ప్రత్యేక చాంబర్లతో పాటు కాన్ఫరెన్స్ హాళ్లను ఏర్పాటుచేశారు. విధుల్లో జాప్యం జరుగకుండా అన్నీ ఒకే చోట ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సమీకృత సచివాలయ నిర్మాణాన్ని చేపట్టారు. మంత్రులు, కార్యదర్శులు, సిబ్బంది ఒకేచోట ఉన్న సచివాలయం దేశంలో ఇదే మొదటిది. గతంలో ఒక్కొక్కరు ఒక్కో కార్యాలయంలో ఉండటంతో విధి నిర్వహణ, ఫైళ్ల మూవ్‌మెంట్‌లో తీవ్ర జాప్యం జరిగేది. ఇక్కడ ప్లగ్ అండ్ ప్లే వ్యవస్థను ఏర్పాటుచేశారు. ఉద్యోగులకు అవసరమైన సకల సౌకర్యాలు ఇందులో ఉంటాయి. వారు తమ ఫైళ్లు, కంప్యూటర్లు మాత్రం తెచ్చుకుంటే సరిపోతుంది. ప్రతి కాన్ఫరెన్స్ హాలులో వీడియో కాన్ఫరెన్స్ కోసం భారీ తెరలను ఏర్పాటుచేశాం.*

### 20 నెలల్లోనే భవనం సిద్ధం

సచివాలయానికి పునాదిరాయి వేసిననాడే సీఎం కేసీఆర్ నాతోపాటు అధికారులను పిలిచి భవనానికి అవసరమైన సామగ్రిని ముందే కొనుగోలు చేయాలని, ఎటువంటి జాప్యం చేయరాదని స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. దీంతో 20 నెలల్లోనే భవన నిర్మాణం పూర్తయింది. వాస్తవానికి పునాదిరాయి పడినప్పటి నుంచి ఈ ఏడాది ఏప్రిల్ మాసాంతానికి 26 నెలలు అవుతుంది. ఇందులో కొవిడ్ కారణంగా మూడు నెలలు, కొవిడ్ వల్ల సొంత ఊళ్లకు వెళ్లిపోయిన కార్మికులు తిరిగి విధుల్లో చేరేందుకు మరో మూడు నెలల సమయం పట్టింది. ఇలా ఆరు నెలలు వృథా అయింది. మొత్తం 10 లక్షల చదరపు అడుగుల భవన నిర్మాణాన్ని 20 నెలల్లో పూర్తిచేయడం రికార్డుగా చెప్పవచ్చు. ఏసీల ఏర్పాటుకు ఆరు నెలలు పట్టింది. ప్రధాన పిల్లర్లు, గుమ్మటాలకు ముందుగా పోతపోసిన నిర్మాణాల (గాల్వనైజ్డ్ రీఇన్‌ఫోర్స్డ్ కాంక్రీట్, సీఆర్‌సీ) జీఆర్‌సీ పనులు కూడా బాగానే సమయం తీసుకున్నాయి.



### సచివాలయానికి కాదని పార్లమెంటుకు సరఫరా

డోమ్‌లు, డోక్‌లకు చుట్టూ ఏర్పాటుచేసిన గ్లాస్, స్తూపాల ఏర్పాటుకు దాదాపు ఆరునెలల సమయం పట్టింది. రాజస్థాన్‌లోని ధోల్‌పూర్ మైన్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన రెడ్ శాండ్‌స్టోన్‌ను వాడారు. ముందుగా రాజస్థాన్‌లోని ఓ మైన్‌నుంచి ఈ రాయిని తెప్పించేందుకు ఒప్పందం చేసుకోగా, అదే మైన్ నుంచి పార్లమెంటు నిర్మాణానికి కూడా రెడ్ శాండ్ స్టోన్‌ను కొనుగోలు చేశారు. దీంతో మన సచివాలయం కోసం మరో మైన్ నుంచి కొనుగోలు చేయాల్సి వచ్చింది. సచివాలయ నిర్మాణంలో 3500 క్యూబిక్ మీటర్ల రెడ్ శాండ్ స్టోన్‌ను 1000 లారీల ద్వారా ఇక్కడికి తరలించారు. గ్రౌండ్ ఫ్లోర్ గోడ నిర్మాణం పూర్తిగా ఈ రెడ్ శాండ్ స్టోన్‌తోనే నిర్మించారు.

### సచివాలయంలో సకల సౌకర్యాలు

*సచివాలయంలో రిసెప్షన్ హాలు, మీడియా హాలు, రెండు బ్యాంకులు, రెండు ఏటీఎంలు, బస్ కౌంటర్, రైల్వే కౌంటర్, క్యాంటీన్, అసోసియేషన్ బిల్డింగ్, డిస్పెన్సరీ, మసీదు, దేవాలయం, చర్చి తదితరమైనవి ఉన్నాయి. 300 సీసీ కెమేరాలను ఏర్పాటుచేయడంతోపాటు రెండు షిఫ్టుల్లో పనిచేసేందుకు 300 మంది సెక్యూరిటీ సిబ్బందిని నియమిస్తున్నాము. ఈ సీసీ కెమేరాలను అనుసంధానం చేస్తూ ఐదో అంతస్తులో ఓ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటుచేశారు.*

### ఐజీబీసీ గోల్డ్ సర్టిఫికెట్ పొందిన మొదటి సచివాలయం

ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) ద్వారా గోల్డెన్ సర్టిఫికెట్ పొందిన మొదటి ఏకైక సచివాలయంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్‌కు అరుదైన గౌరవం దక్కింది. విద్యుత్ వాడకాన్ని తగ్గించేందుకు పార్కింగ్ స్థలంలో సోలార్ ప్యానెళ్లను ఏర్పాటుచేస్తున్నారు. మొత్తం 28 ఎకరాల స్థలంలో కేవలం రెండున్నర ఎకరాల్లో మాత్రమే నిర్మాణాలు చేసి, మిగిలిన స్థలాన్ని పచ్చదనం, పార్కింగ్, రోడ్ల కోసం వినియోగించడం విశేషం.

### తూర్పు ద్వారం నుంచి ప్రముఖుల ప్రవేశం

సచివాలయానికి నాలుగువైపులా నాలుగు ద్వారాలు ఉన్నాయి. ఇందులో తూర్పు వైపు నుంచి ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ తదితరులు వెళ్లవచ్చు. పశ్చిమం వైపు ఏర్పాటుచేసిన ద్వారాన్ని అత్యవసర సమయాల్లో మాత్రమే ఉపయోగించాలని నిర్ణయించారు. ఈశాన్యంలోని ద్వారం గుండా అధికారులు, ఉద్యోగులు వెళ్తారు. వారికి పార్కింగ్ కూడా అక్కడే ఉంది. ఆగ్నేయ ద్వారాన్ని సందర్శకులకు ప్రత్యేకించారు. వారికి ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యం, పాసులు ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు.

### సరిపడా నీరు నిల్వచేసేందుకు ఏర్పాట్లు..

సచివాలయంలో 2000 మంది పనిచేయనున్నారు. తాగునీటికోసం 120 కిలోలీటర్ల (కేఎల్‌డీ) సామర్థ్యంగల సంపు, ఇతర అవసరాల కోసం 180 కిలోలీటర్ల సంపులు రెండు, వర్షపునీటిని నిల్వచేసేందుకు 200 కిలో లీటర్ల సామర్థ్యంగల మరో సంపును ఏర్పాటుచేశారు. ఏసీ ప్లాంటుకు అవసరమయ్యే నీరు, గార్డెనింగ్ కోసం, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలాంటి నీటి కొరత లేకుండా ఉండేలా తగిన ఏర్పాట్లు ఉన్నాయి.

### పార్లమెంటుకన్నా ప్రత్యేకమైనది!

*కేంద్రం నిర్మిస్తున్న నూతన పార్లమెంటు భవనం సెంట్రల్ విస్టా వైశాల్యం 6,98,270 చదరపు అడుగులు కాగా, మన సచివాలయాన్ని 10 లక్షల చదరపు అడుగుల్లో నిర్మించారు. మరే ఇతర రాష్ట్రంలోనూ ఇంత విశాలమైన, సమీకృత సచివాలయం లేదు. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చే విధంగా డిజైన్ చేయడంతోపాటు గదుల ఎత్తు కూడా 14 అడుగులుగా నిర్మించారు. ముందూ వెనుక భాగంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక పోర్టికోల ఎత్తు 42 అడుగులు. కుతుబ్‌మినార్ కన్నా ఎత్తైన మన సచివాలయంలో ఆరో అంతస్తులో 28 అడుగుల ఎత్తైన రెండు హాళ్లను నిర్మించారు. ప్రత్యేక అతిథులు, విదేశీ ప్రతినిధులతో సమావేశాలు, విందుల కోసం వీటిని ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు. లోవర్ ఫ్లోర్, గ్రౌండ్ ఫ్లోర్ తరువాత ఆరు అంతస్తులు కాగా, ప్రధాన డోమ్‌లు ఉన్నచోట భవనం 11 అంతస్తులుగా ఉంది. ప్రధాన డోమ్‌ల వైశాల్యం 2,500 చదరపు అడుగులు. డోమ్‌ల ఎత్తు 48 అడుగులు కాగా, వయా 50 అడుగులు. మొత్తం భవనంలో 34 డోమ్‌లను నిర్మించారు. సచివాలయానికి ఇరువైపులా మొత్తం 24 లిఫ్టులు ఉండగా, అందులో ఎనిమిది స్కైలాంజ్‌వరకు వెళ్లేలా ఏర్పాటు చేశారు.*

### నిర్వహణ వ్యయం నెలకు కోటి

సచివాలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 617 కోట్లు మంజూరుచేసిన విషయం తెలిసిందే. అయితే, నిర్మాణ సామగ్రిపై జీఎస్టీ ఆరు శాతం నుంచి 18 శాతానికి పెరిగింది. స్టీలు, సిమెంటు ధరలు కూడా భారీగా పెరిగాయి. దీంతో వ్యయం 20-30 శాతం వరకూ పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. భవనం నిర్వహణకుగాను ప్రతి చదరపు అడుగుకు సుమారు రూ. 10 చొప్పున మొత్తం 10 లక్షల చదరపు అడుగులకు నెలకు రూ. కోటి వరకూ ఖర్చవుతుందని అంచనా.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

# ఆపన్న హస్తం

***వడగండ్ల*** వానకు పంట నేలరాలి, గుండె పగిలిన రైతన్నకు రాష్ట్ర ప్రభుత్వం ఆపన్నహస్తం అందించింది. రైతులు, కౌలు రైతులు అనే తేడా లేకుండా, ఈ పంట ఆ పంట అనే భేదం లేకుండా ఎకరాకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేస్తున్నది. ఇంత పెద్ద మొత్తంలో నష్టపరిహారం ఇవ్వటం దేశంలోనే తొలిసారి. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన విధానాలతో నేడు తెలంగాణ రాష్ట్రం.. భారతదేశ వ్యవసాయ రంగంలో కొత్త చరిత్రను లిఖిస్తున్నది. ధాన్యం అత్యధికంగా పండించే అగ్రశ్రేణి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఇప్పుడిప్పుడే రైతుల ముఖాల్లో సంతోషం కనిపిస్తున్నది. ముంబయి, దుబాయిలకు వలసపోయిన వాళ్లు సొంత ఊర్లకు తిరిగొచ్చి నాగలి చేపడుతున్నారు. ఇటువంటి సంబుర సమయంలో ప్రకృతి కన్నెర్రతో.. రైతుల కష్టం పూర్తిగా నేలపాలవుతున్నది. నీళ్ల పాలైన పంటను చూసి అన్నదాతలు ఆగమైతున్నరు.

వారిలో ధైర్యం చెడకుండా, ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా గత నెల పలు జిల్లాల్లో పర్యటించారు. ఆ సమయంలో ఆయన జ్వరంతో బాధపడుతున్నా కూడా కష్టంలో ఉన్న రైతన్నను కలిసి భరోసా ఇవ్వటానికే సిద్ధమయ్యారు. అప్పటికప్పుడు రూ.10 వేల సాయం ప్రకటించారు. నష్టపోయిన వారిలో కౌలు రైతులు కూడా గణనీయమైన సంఖ్యలో ఉండటంతో, వారికి కూడా సాయం అందుతుందని చెప్పి వేలాది మంది కౌలు రైతులకు ఉపశమనం కలిగించారు. కేంద్రం నుంచి ఏకాణా రాకున్నా, మొత్తం రాష్ట్ర ఖజానా నుంచే రూ.151 కోట్ల పరిహారం అందేలా చర్యలు తీసుకున్నారు. నిజానికి, ఇటువంటి దుఃఖ సమయాల్లో రాజకీయాలను పక్కనపెట్టి వ్యవహరించాల్సిన బాధ్యత కేంద్రానిది. కానీ, మోదీ హయాంలో ఉన్నత సంప్రదాయాలన్నీ కనుమరుగైనట్లుగానే ఇదీ మాయమైంది. 'మా రైతులంతా విచారంలో ఉన్నారు. మీరూ చేయూతనివ్వండి' అని విజ్ఞప్తి చేస్తే నెలల తర్వాతగానీ రాష్ట్రానికి కేంద్ర బృందం రాదు. వచ్చిన తర్వాత వారు నివేదికలు తయారు చేయటానికి మరికొంత కాలం. ఆ తర్వాతైనా సాయమేమైనా ఉంటుందా అంటే అదీ లేదు. అందుకనే ఈసారి కేంద్రానికి నివేదిక కూడా పంపకుండా రాష్ట్రప్రభుత్వం మంచి పని చేసింది.

దేశంలో మెజారిటీ ప్రజానీకం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నా, ఆ రంగంలో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించాలన్న సోయి కేంద్రానికి లేదు. దేశానికి ఒక వ్యవసాయ విధానమే లేదు. అప్పుడో ఇప్పుడో తీసుకొచ్చే పథకాలు కూడా.. కాపీ కొట్టినవే. తెలంగాణ రైతుబంధును కాపీకొట్టి 'కిసాన్ సమ్మాన్ నిధి'ని తీసుకొచ్చారు. కానీ, మన రైతుబంధు నిరంతరాయంగా కొనసాగుతుంటే, కిసాన్ నిధి అనేకానేక సమస్యలతో కునారిల్లుతున్నది. ఫసల్ బీమా అనే మరో పథకం కూడా రైతుల కంటే బీమా కంపెనీలకే లాభం చేకూర్చే కార్యక్రమమైంది. ఈ నేపథ్యంలోనే, వ్యవసాయం దండుగ అన్నవారితోనే పండుగ అని పలికించిన ముఖ్యమంత్రి కేసీఆర్.. దేశ వ్యవసాయ రంగ సమూల ప్రక్షాళనకు నడుం కట్టారు. 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' నినాదం నేడు దేశమంతటా ప్రకంపనలు రేపుతున్నది. రైతు రాజ్యంలోనే రైతులందరికీ భరోసా.

# మన ఆత్మగౌరవ గోపురం



మంత్రి శ్రీదేవి
98482 54678

ఏ షాజహాను రూపుదిద్దిన మహా గుమ్మటమో
ఏ నిజాము పునాది వేసిన అపురూప కౌశలమో..
ఏ చక్రవర్తి రంగులద్దిన వన్నెల గోపురమో..
కాకతీయ కళామ తల్లి తోరణమో..
భువనమెల్ల పరచుకున్న ధవళీకృత దీధితులు..
నవ లోకోత్తర భావ ప్రకటిత సంకేతములు..
మహోన్నత సౌధశైలి మహోత్కృష్ట నిర్మాణం..
భళారే.. తెలంగాణ ప్రగతికిదే తార్కాణం..

రాచవన్నెలలరించి రమ్యత శోభిల్ల జేర్చి..
కూర్చి, భాగ్యనగరేతిహాస యశఃచంద్రికలను
దిశాంతాల దునాళించి
దీప్తులెల్ల వెలయింపగ
వహ్వా.. యే ఇమారత్..
అవ్వల్ హై హకీఖత్
అని పొగడుట ఖాయం..
అదే.. భవన విజయం..

కుతుబ్ షాల కొలువైనా..
నిజాం రాజు నెలవైనా..
దక్కన్‌గా కీర్తి దక్కినా..
పక్కా తెలగాణ మాది..
కులం, మతం కడుదూరం
కలిసి బతుకుటే ధర్మం..
సహకారం మా కులం..
సమ్మతమే మా మతం..
సచివులైననేమి వారు..
సహోద్యోగులైననేమి..
గద్దెపైన నున్న నేమి..
కర్మచారులైననేమి..
పాలకులు, పాలితులు..
ప్రజాసేవకే నిత్యం..
ప్రకటితమైనదీ సత్యం..
సచివాలయ ప్రాంగణం..
సహృదయతకు నిదర్శనం..





సచివులు కర్మచారుల
కార్యనిరతి, సేవా తత్పరత
ఓ తపస్సులా, ఓ యోగంలా,
ఓ యాగంలా కొనసాగించడానికి
ఆలయం లాంటి స్థల
నిర్మాణమే సచివాలయం..
అంబేద్కర్ మహాశయుని
మహదాశయాలకు తార్కాణంగా
ఆయన పేరిట నిర్మాణం
ఆయన ఉద్దేశించిన
లక్ష్యసాధనకు అభినివేశం..
అందుకే ఆ మహానుభావునికి అంకితం.

భువనాలు సమస్తం
మెచ్చిన భవన విజయం..
బాపు కేసీఆర్ సత్‌సంకల్పం
సారథ్యం సముచిత నేతృత్వం..
శిరమెత్తి చూడగ చిత్రమ్ముగాదోచు
భవన సౌందర్యపు పాలవెలుగు
గుమ్మటముల చేర్పు, కుడ్యముల
మేల్కూర్పు
కన్ను గదుపనీదు కదలనీదు..
సౌధాంతరమునందుసౌఖ్యవంతములైన
గదుల నిర్మాణము పదిలముగను
సచివుల నిలయము సౌకర్యముల తోడ
చరితార్థముగనిల్చు తరతరముల..
పూర్వ రాజులు గట్టిరీ పుడమిపైన
సౌధముల తోడ వసతిగ వీధులెల్ల
రాచబాటలు, కొలనులు, రాష్ట్రమందు
నేటి సచివాలయము వాని సాటిగాదె..!

**తె**లంగాణ రాష్ట్ర వైభవానికి దర్పణం డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం. అసలు తెలంగాణ ఆత్మగౌరవానికి పునాది పడ్డదే తెలంగాణ భవన్ ద్వారా. దశాబ్దాల కిందట కొన్ని దోపిడీ వర్గాల కుట్రతో అధికారం, అస్తిత్వం కోల్పోయిన మన తెలంగాణ నేడు నూతన సచివాలయ భవనం ద్వారా సగర్వంగా నిలిచింది. ఒకప్పటి సచివాలయం దోపిడీ వర్గాల చీకటి అడ్డా, తెలంగాణ ప్రాంత మంత్రులకు, ప్రజాప్రతినిధులకు కూడా అంతుచిక్కని గూడుపుఠాణీల రహస్య నిలయం. పైరవికారులే చక్రం తిప్పే చీకటి కోట. ఏ విభాగం ఎక్కడుందో, ఏ ఫైల్ ఏ బల్ల కింద నక్కిందో తెలియని అయోమయం. నేడు ఆ చీకటి చరిత్రను దూరం చేసే వెలుగుల పుంజం మన సచివాలయం.

ఒక్క సచివాలయమే కాదు.. అన్నదాతలకు అండగా, అడ్డాగా రైతువేదిక భవనాలు, ఆదివాసీలకు, బంజారాలకు, అన్ని సామాజిక వర్గాలకు ఆత్మగౌరవ భవనాలు, గ్రామగ్రామాన కమ్యూనిటీ భవనాలు, సమీకృత అంగన్వాడీ భవనాలు, 10 జిల్లాలను 33 జిల్లాలుగా చేసుకొని ప్రతి జిల్లాకు ఒకే చోట పరిపాలనా సౌలభ్యం కోసం సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనాలు, పోలీస్ కమాండ్ కంట్రోల్, పలు దవాఖానలు, యాదాద్రి దేవాలయం, వివిధ ఐటీ హబ్‌లు.. ఎన్నో, ఎన్నెన్నో... రాజకీయంగా తనపై కుట్రలు జరుగుతున్నా, లక్ష నిందలు వేస్తున్నా తెలంగాణ సముజ్వల స్వరూపాన్ని చెక్కుతున్న కలియుగ విశ్వకర్మ బాపు కేసీఆర్. చరిత్రలోని పురాతన కట్టడాలైన మైసూరు ప్యాలెస్, బెంగళూరులోని విధానసౌధ, ముంబయిలోని తాజ్‌మహల్ హోటల్ లాంటివాటికి దీటుగా నిలవనున్నదీ సచివాలయం.

> కొత్త సచివాలయం భావితరాలకు ఆదర్శ నిలయం. ఎనిమిదేండ్లలో అన్నిరంగాలలో బాపు కేసీఆర్ నాయకత్వంలో మెరుపు వేగంతో దూసుకుపోతున్న ప్రగతికి ప్రతిరూపం. అన్ని సామాజిక మార్పులకు రాజకీయాధికారమే మాస్టర్ కీ అని బాబాసాహెబ్ చెప్పిన మాటకు, తెలంగాణ ప్రజల అధికార దర్పానికి దర్పణం.

స్వాభిమానానికి, స్వతంత్రతకు, అధికారానికి, స్వావలంబనకు శిఖరాగ్ర రూపం. అద్భుతమైన గుమ్మటాలతో ఈ కట్టడం అపురూప కౌశలానికి నిదర్శనం. గుమ్మటాలు కావవి, తెలంగాణ తల్లి పిల్లల తలపై శిరస్త్రాణాలు. పార్టీలు, జెండాలు మార్చేటోళ్లకు, దోపిడీ ముఠాల చక్రవర్తులకు, చెప్పులు మోసే మరుగుజ్జులకు ఇప్పుడు తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి అర్థం కాదు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లు, డైరెక్టర్లు, సిబ్బంది ఒకే భవనంలో ఒకరికొకరు అందుబాటులో ఉండి ప్రభుత్వపరంగా తీసుకునే పలు ప్రజా సంక్షేమ నిర్ణయాలు అట్టడుగుస్థాయి వరకు త్వరితగతిన చేరనున్నాయి. ఇంటిని చూసి ఇల్లాలి గొప్పదనాన్ని అంచనా వేసినట్టు, పెట్టుబడులు పెట్టడానికి వచ్చే పారిశ్రామికవేత్తలు మన సచివాలయాన్ని చూసి, అక్కడ వేగంగా నిర్ణయాలు తీసుకోవటం చూసి, తమ నిర్ణయాలను త్వరితగతిన వెల్లడించే అవకాశం ఉన్నది. సెలవు రోజుల్లో సందర్శకులకు సచివాలయ వీక్షణకు కల్పించటమనేది ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయం. అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ తన కాలేజీ రోజుల్లో విహారయాత్రలో భాగంగా వైట్‌హౌస్‌ను సందర్శించినప్పుడు, దేశానికి సారథ్యం వహించి మంచి పరిపాలనను అందించాలని స్ఫూర్తి పొందినట్లు చెప్పారు. మన సచివాలయాన్ని సందర్శించే భవిష్యత్ తరాలు కూడా ఇదే విధంగా గొప్ప స్ఫూర్తిని పొందుతాయి. చరిత్రను విస్మరించే వారు చరిత్రను నిర్మించలేరు. చరిత్రను వక్రీకరించేవారు చరిత్ర హీనులవుతారు. గత చరిత్ర పునాదుల మీద నిలబడే వర్ధమాన, భవిష్యత్తు చరిత్రను నిర్మించుకోగలం. చరిత్రను తెలుసుకోవడం వల్ల గతంలో జరిగిన దురాచారాలను, చెడును భవిష్యత్తులో నివారించుకోగలం. ఇది అర్థం కాని అరాచకశక్తులే గత చరిత్రను వక్రీకరిస్తాయి. మసీదులు తవ్వుతాం, చార్మినార్ కూలగొడతాం, పాత బస్తీని మాయం జేస్తామని విద్రోహ ప్రకటనలు చేస్తాయి. ఇది ఎంతవరకొచ్చిందంటే.. మహాత్ముడిని హత్య చేసినవాడిని మహాత్మా గాడ్సే అంటున్నారు. బ్రిటిష్ వాడికి క్షమాపణ పత్రం రాసిచ్చిన వాడిని బాపూజీ అంటున్నారు. మన తెలంగాణలో సబ్బండవర్గాల ప్రజలు సాగించిన రైతాంగ సాయుధ పోరాటాన్ని కూడా హిందువులకు, ముస్లిం పాలకులకు మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నో తరాలుగా కలిసిమెలిసి జీవిస్తున్న మన సమాజాన్ని మతపరంగా విడగొట్టి రాజకీయ ప్రయోజనం పొందాలనుకుంటున్నారు.

> పోరాడి సాధించుకున్న తెలంగాణను మరో గుజరాత్‌గా మార్చాలనుకుంటున్నారు. ఉద్యమ చైతన్యం కలిగి ఉన్న మనం మతోన్మాద మూకల ఆటలు సాగనివ్వకూడదు. అరువై ఏండ్ల బానిసత్వం నుంచి మనల్ని విముక్తి చేసిన బాపు కేసీఆర్‌పై మోదీ-షాల ముఠా సాగిస్తున్న దాడిని మనం తిప్పికొట్టాలి.

'అశోకుడు చెట్లు నాటించెను, కాకతీయులు చెరువులు తవ్వించారు' అని మనం పాఠాలు చదువుకున్నట్టుగా.. భవిష్యత్ తరాల వారు 'బాపు కేసీఆర్ ప్రపంచం అబ్బురపడే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించెను, యాదాద్రి క్షేత్రం నిర్మించెను, గొప్ప సచివాలయం కట్టించెను' అని చదువుకుంటారు.

వహ్వా! బేషక్ సారే కాయినాత్
మే బే షుమార్ యే ఇమారత్ హై!
దునియామే బేమిసాల్ ఇస్కీ హిమాయత్ హై!
తహజీబె గంగా జమునా ఝుల్కే ఇస్కే నూర్ సే!
తారీఫె కాబిల్ హర్ అదా
ఇస్కీ మానో తో ఏ చష్మే బద్దూర్ హై


(వ్యాసకర్త: రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షురాలు)

# చరిత్రలో నిలిచే పాలన సౌధం

నెర్రెలు బారిన తెలంగాణ నేలలను కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి పచ్చని మాగాణులుగా మార్చిన అపర భగీరథుడు మన కేసీఆర్. ఆయన మదిలో రూపుదిద్దుకున్న కొత్త సచివాలయం నేడు మనందరి కళ్ల ముందు దేదీప్యమానంగా ఆవిష్కృతమైంది. భిన్న సంస్కృతులకు నెలవైన మన సంప్రదాయానికి అద్దం పడుతూ, అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణమైన తెలంగాణ సచివాలయం వంటిది దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేదు. మహాద్భుత కట్టడంగా నిర్మితమైన సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టటం సీఎం కేసీఆర్ సమున్నత దృష్టికి తార్కాణం.



డాక్టర్ ఎన్.యాదగిరిరావు



**తె**లంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ మొదటి లక్ష్యం బీడువారిన భూముల్లో సాగు నీరు పారించడం. అనితర సాధ్యమైన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించారు. సాగునీటి ప్రాజెక్టులను తరాలపాటు నిర్మించాల్సిన అవసరం లేదని, పాలకుడికి చిత్తశుద్ధి ఉంటే మూడు నాలుగేండ్లలోనే పూర్తి చేయవచ్చు అనేదానికి ఇది ఒక ఉదాహరణ. ఆలయాలను, దేవుళ్లను కొందరు రాజకీయాలకు మాత్రమే వినియోగించుకుంటున్న ఈ రోజుల్లో, తెలంగాణ గర్వించదగ్గ గొప్ప పుణ్యక్షేత్రంగా యాదగిరిగుట్టను తీర్చిదిద్దారు. నేడు యాదాద్రిని సందర్శించిన వారంతా ఆలయ వైభవాన్ని చూసి అబ్బురపడుతున్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలు తరతరాలపాటు కొనసాగాలనే ఆలోచనతో హైదరాబాద్ నడిబొడ్డున, ప్రపంచంలోనే ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు కేసీఆర్. ఈ క్రమంలోనే నూతన సచివాలయాన్ని అందరూ ఆశ్చర్యపోయేరీతిలో నిర్మించారు.

సువిశాలమైన 28 ఎకరాల ప్రాంగణంలో 10.52 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆరు అంతస్తులలో సచివాలయం నిర్మాణమైంది. ఛత్తీస్‌గఢ్‌లో 6.75 లక్షల చదరపు అడుగులు, మధ్యప్రదేశ్‌లో 9 లక్షల చదరపు అడుగుల సచివాలయాలే ఇప్పటి వరకు పెద్దవి. వీటిని తెలంగాణ నూతన సచివాలయం అధిగమించింది. ఎన్నో త్యాగాలకు ఓర్చి తెచ్చుకున్న తెలంగాణను ఎలా బాగు చేసుకోవాలి, దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా ఎలా నిలపాలనే స్పష్టమైన విజన్ కేసీఆర్‌కు తొలి నుంచీ ఉంది. ఉద్యమకాలంలో కొన్ని వేల సార్లు ఆయన ఆ విషయం చెప్పేవారు. తెలంగాణను సాధించిన తర్వాత ఈ దిశగా ఆయన ప్రతి క్షణం ప్రయత్నించారు. రాష్ట్ర ఆత్మగౌరవం, అభివృద్ధి విషయంలో ఆయన తపనకు నిదర్శనమే కొత్త సచివాలయ నిర్మాణం. ఇండో-పర్షియన్-అరేబియన్ శైలితో కేవలం 26 నెలల్లోనే నిర్మాణం పూర్తి చేయడం ఒక చరిత్ర. తొమ్మిదేండ్లలో మనం సాధించిన అభివృద్ధికి ఒక సమున్నత ప్రతీక సచివాలయం. గంగా జమునాతెహజీబ్ అనే మన భావనకు అద్దం.

రూ.610 కోట్ల వ్యయంతో చేపట్టిన కొత్త సచివాలయ నిర్మాణం రికార్డు వేగంతో పూర్తయ్యింది. 2019 జూన్ 27న సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు జరిగిన అనేక ప్రయత్నాలు ముఖ్యమంత్రి సంకల్పం ముందు ఓడిపోయాయి. 2020 జూలైలో పాత భవనాల కూల్చివేత మొదలైంది. 2021 జనవరి 4న సచివాలయ నిర్మాణ పనులు మొదలయ్యాయి. అంటే కేవలం రెండేండ్లలోనే ఇంత భారీ నిర్మాణం పూర్తయ్యింది. ప్రభుత్వ నిర్మాణాలు ఆలస్యంగా జరుగుతాయనే ఒక అపప్రథ మన దేశంలో ఉంది. ఈ అభిప్రాయాన్ని తెలంగాణ ఇప్పటికే కాళేశ్వరం రూపంలో, యాదగిరిగుట్ట పునర్నిర్మాణం రూపంలో, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ రూపంలో చెరిపివేసింది. ఆ జాబితాలో సచివాలయం కూడా చేరింది.

కొత్త సచివాలయ నిర్మాణానికి ముందు కేసీఆర్ చాలా కసరత్తు చేశారు. మన చరిత్రను గుర్తుకు తెచ్చేలా డెక్కన్, కాకతీయ నిర్మాణశైలిలో సచివాలయం ఉండాలనుకున్నారు. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా వసతులు ఉండాలనుకున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా సచివాలయ ప్రాంగణంలో దేవాలయం, మసీదు, చర్చి నిర్మించాలని ఆదేశించారు. ఒక ఇంటి పెద్ద సొంతింటి కలను నిజం చేసుకునే క్రమంలో ఇల్లు నిర్మాణానికి ఎంత జాగ్రత్తగా వ్యవహరిస్తారో, కొత్త సచివాలయ నిర్మాణానికి సంబంధించిన ప్రతి అంశంపై కేసీఆర్ అంత శ్రద్ధ చూపించారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా దేశంలోనే ప్రముఖ ఆర్కిటెక్ట్ సంస్థ ఆస్కార్ అండ్ పొన్ని ఆర్కిటెక్ట్స్ సచివాలయానికి రూపకల్పన చేసింది. ప్రముఖ నిర్మాణ సంస్థల్లో ఒకటైన షాపూర్జీ పల్లోంజీ మూడు షిఫ్టుల్లో పని నడిపించి వేగంగా నిర్మాణాన్ని పూర్తి చేసింది. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి సచివాలయ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టి నిర్మాణం పూర్తి చేయించారు.

అమెరికాలోని వైట్ హౌస్‌ను తలపించేంత గొప్పగా సచివాలయం కనిపిస్తున్నది. జాతీయ చిహ్నాలను ప్రతిష్ఠించిన రెండు ప్రధాన గుమ్మటాలు, 34 చిన్న గుమ్మటాలతో మన తెలంగాణ నిర్మాణశైలికి సచివాలయం అద్దం పడుతున్నది. ప్రకృతి విపత్తులను సైతం తట్టుకొనేలా సచివాలయ నిర్మాణం జరిగింది. భవనం చుట్టు, ముందు ఏర్పాటు చేసిన ల్యాండ్‌స్కేప్ సచివాలయానికి ప్రత్యేక ఆకర్షణ. సెక్రటేరియట్ ప్రాంగణంలో నిర్మించిన గుడి, మసీదు, చర్చి మతసామరస్యానికి ప్రతీకలు. క్లర్కు నుంచి ఐఏఎస్ దాకా ప్రతి ఉద్యోగికి, వివిధ పనుల మీద సచివాలయానికి వచ్చే సందర్శకులకు అవసరమైన అన్ని సదుపాయాలు ఏర్పాటయ్యాయి. ఇకపై హైదరాబాద్‌కు వచ్చే పర్యాటకులు తిలకించే స్థలాల్లో మన సెక్రటేరియట్ కూడా ఒకటి కానున్నది. తెలంగాణ అభివృద్ధికి కేంద్రంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం వెయ్యేండ్లు వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం.

(వ్యాసకర్త: అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ)

పాలన భవనాలు ప్రభుత్వ కార్యక్రమాల అమలు కేంద్రాలు మాత్రమే కాదు, అవి ప్రజల సాంస్కృతిక వారసత్వ చిహ్నాలు. నిబద్ధులైన పాలకులు తమ పాలనా నిర్వాహక కేంద్రాలను ఆ సంస్కృతి కొనసాగింపులో భాగంగానే చూస్తారు. నేడు మన ముందు రూపుదాల్చిన నూతన తెలంగాణ సచివాలయ భవనం కూడా అటువంటిదే.

# ఘన సంస్కృతి చిహ్నం



రేండ్ల రాజేశ్
99126 61170




**ఉ**మ్మడి ఏపీలో సచివాలయ భవనం అరకొర సౌకర్యాలతో ఉండేది. అప్పటి ప్రభుత్వాలు ఎప్పటి అవసరాలకు అనుగుణంగా అప్పుడు పాత భవనాలను కూల్చివేస్తూ కొత్త భవనాలను కడుతూ వచ్చారే తప్ప భవిష్యత్ అవసరాలను గుర్తించలేదు. నాడు ముఖ్యమంత్రి కార్యాలయంగా ఉపయోగించిన సమత బ్లాక్ (సి బ్లాక్)ను 1978లో నిర్మించారు. అది ప్రస్తుత అవసరాలకు ఏమాత్రం ఉపయోగకరంగా లేకపోగా, భద్రత పరంగా అనేక సవాళ్లు ఉన్నాయని పలు నివేదికలు వెల్లడించాయి. 2004లో పూర్తయిన డి-బ్లాక్‌ను కొత్త సౌకర్యాలతో నిర్మించినా, ప్రారంభమైన తొలిరోజు నుంచే ఎన్నో లోపాలు బయటపడ్డాయి. సచివాలయంలోని వివిధ భవనాల ఆధునికీకరణ, అంతర్గత డిజైనింగ్ పేరుతో ఏటా లక్షల రూపాయలు ఖర్చు చేసేవారు. అంతేగానీ, రాష్ట్ర పాలనకు కేంద్రమైన సచివాలయాన్ని దాని ప్రాధాన్యానికి తగిన స్థాయిలో పునర్నిర్మించటంపై అప్పటి పాలకులు దృష్టి పెట్టలేదు. సచివాలయంలో వేర్వేరుగా ఉన్న అనేక భవనాలలో హెచ్ బ్లాక్ ఒకటి. దానిని కూల్చివేసి కొత్తగా రెండు (నార్త్, సౌత్) హెచ్ బ్లాక్ భవనాలను నిర్మించారు. వాటిలో కూడా ప్రారంభం నుంచే అనేక రిపేర్లు, అంతర్గత మార్పులు జరుగుతుండేవి. ఇక జే, కే, ఎల్, ఏ, బీ బ్లాకు భవనాలను వినియోగించడంలో కూడా ఎన్నో అవాంతరాలు, భద్రతపరమైన సమస్యలు ఎదురయ్యేవి.

గత 20 ఏండ్లలో పరిపాలనలో అనేక కొత్త మార్పులు చోటుచేసుకున్నాయి. టైప్ మెషిన్ల కాలం పోయి కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇంటర్నెట్, ఓఎఫ్‌సీ, వై-ఫై వాడకం పెరిగింది. వాటికి తగినట్లు సర్వర్ల ఏర్పాటు, నిరంతర విద్యుత్ సరఫరా, ఏసీల వినియోగం తప్పనిసరి అయింది. డాటా స్టోరేజీ, సైబర్ సెక్యూరిటీ వంటి కొత్త సవాళ్లు తలెత్తాయి. వాటికి తగిన పరిష్కారాలు చూడాల్సి వచ్చింది. అదేవిధంగా ప్రజల ముందుకు పాలనను తీసుకు రావటం కోసం ఆధునిక కమ్యూనికేషన్స్ వ్యవస్థలను విరివిగా వాడుతూ మారుమూల ప్రాంతాలను పరిపాలనతో అనుసంధానించాల్సి వచ్చింది. ఈ అవసరాలకు పాత భవనాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేసే క్రమంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం కోసం కొత్తగా అభివృద్ధి చెందుతున్న ఈ-ఫైలింగ్, ఈ-ఆఫీస్ వంటి వాటిని పల్లె, పట్నం మొదలుకొని రాష్ట్ర రాజధాని వరకు విరివిగా ఉపయోగించాలంటే ఆధునిక సౌకర్యాలు, కొత్త హంగులతో కూడిన నూతన భవనం ఆవశ్యకత అనివార్యమైంది.

తెలంగాణను సాధించిన తొలినాళ్లలోనే ఈ అవసరాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రహించారు. భవిష్యత్ తెలంగాణ పరిపాలనకు, సుస్థిర అభివృద్ధికి భరోసా ఇచ్చే భవనం నిర్మించాలని సంకల్పించారు. కొత్త రాష్ట్రం సాధించుకున్న తర్వాత వేగంగా చోటు చేసుకుంటున్న అభివృద్ధి కార్యకలాపాలు, పాలన వికేంద్రీకరణలో భాగంగా కొత్త జిల్లాల ఏర్పాటు, సమీకృత జిల్లా పరిపాలనా కార్యాలయాలు, పోలీసు కార్యాలయాలు, రాజధానిలో నిర్మించిన పోలీస్ కమాండ్ కంట్రోల్ వంటివి పరిపాలనలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉన్న ప్రగాఢ సంకల్పాన్ని తెలియజేస్తున్నాయి. దీంట్లో భాగంగానే నూతన సచివాలయం కూడా నిర్మాణమైంది. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయం ఇవ్వాళ దేశానికే రోల్ మోడల్. రాష్ట్ర ప్రజలకు, ఉద్యోగులకు ముఖ్యమంత్రి ఇచ్చిన ఒక కానుక. కొత్త సచివాలయం వేదికగా తెలంగాణ సచివాలయ ఉద్యోగులు మరింత ఉత్సాహంతో పని చేసి, అంబేద్కర్ కలలుగన్న ప్రజా సంక్షేమం కోసం నిబద్ధతతో కృషి చేయాలి. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ఒక దిక్సూచిగా, ఆదర్శంగా నిలబెట్టాల్సిన తరుణమిది. తెలంగాణ ప్రజలందరి సంబురమిది.

(వ్యాసకర్త: కోశాధికారి, తెలంగాణ సచివాలయ సంఘం)




బొడ్రాయి
మరిన్ని వ్యాసాలు epaper.ntnews.com



- **మరాఠ్వాడాలో మార్పు బట్వాడా**
  మహారాష్ట్ర జనం బీఆర్ఎస్ సారథి కేసీఆర్ బాట పడుతున్నరు. చిన్నా, పెద్ద అంతా బీఆర్ఎస్‌తో మమేకం ఐతున్నరు. మరాఠా పబ్లిక్‌లో కేసీఆర్ పిలుపు నరనరాన ప్రేరణ రాజేస్తున్నది.
  -ఇల్లెందుల దుర్గాప్రసాద్



- **ఓ తెలంగాణ బిడ్డా.. ఇదీ మన ఘనత**
  రాష్ట్రం సాధించి తొమ్మిదేండ్లు అవుతున్నది. ఈ తొమ్మిదేండ్లలో మన రాష్ట్రం, మన సర్కారు ఏం సాధించిందో ప్రతి తెలంగాణ బిడ్డ తెలుసుకోవాలి.
  - వై సతీశ్‌రెడ్డి




- **ఆపద్బాంధవుడు సీఎం కేసీఆర్!**
  స్వరాష్ట్రంలో రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న సీఎం కేసీఆర్.. రాళ్లవానతో దిగాలుపడ్డ రైతన్న వద్దకే రాష్ట్ర యంత్రాంగాన్ని పంపి వారికి ఎంతో ధైర్యాన్ని ఇచ్చారు.
  - సుంకె రవిశంకర్

# మౌనమేల మోదీ!

'ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసే శక్తులు ఇప్పుడు బలం పుంజుకున్నాయి. దేశంలో ఎమర్జెన్సీ మళ్లీ రాబోదని నేను అనుకోవట్లేదు'.. 2015లో 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో బీజేపీ కురువృద్ధుడు ఎల్‌కే అద్వానీ చేసిన వ్యాఖ్యలివి. ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేండ్ల పాలనలో అత్యవసర స్థితి నాటి చీకటి రోజులు ప్రస్తుతం నెలకొన్నాయి.

- దేశంలో సంచలనంగా ఎనిమిది కీలకాంశాలు
- విపక్షాలు ప్రశ్నించినా స్పందించని ప్రధాని మోదీ
- ప్రశ్నించిన వారిపై ఎదురుదాడి, కక్ష సాధింపు
- జాబితాలో పుల్వామా దాడి , అదానీ వివాదం, చైనా దురాక్రమణ, కర్ణాటకలో 40% కమీషన్, నోట్ల రద్దు, కొవిడ్ మరణాలు, గుజరాత్ అల్లర్లు
- వివిధ సూచీల్లో దిగజారిన భారత్ ర్యాంకులు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): తొమ్మిదేండ్ల బీజేపీ పాలనలో ప్రజాస్వామ్య ధ్వంసరచన అప్రతిహతంగా కొనసాగుతున్నది. కేంద్రం అరాచకాలను ప్రశ్నించిన గొంతుకలను పిసికి వేయడం పరిపాటిగా మారింది. 2002 గుజరాత్ అల్లర్ల ఘటన నుంచి నిన్నటి అదానీ వివాదం వరకూ ప్రతీ అంశం ఇందుకు మినహాయింపు కాదు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 8 అంశాలపై ప్రతిపక్షాలు పెద్దయెత్తున నిరసనలు వ్యక్తం చేస్తున్నప్పటికీ, ప్రధాని మోదీ మౌన ముద్రనే ఆశ్రయిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

**చైనా దురాక్రమణ:** లఢక్, అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా దురాక్రమణకు పాల్పడుతున్నా.. కేంద్రం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నది. చైనాది పెద్ద ఎకానమీ అని, అలాంటి వాళ్లతో యుద్ధంలో మనం ఎలా గెలవగలమని విదేశాంగమంత్రి జైశంకర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి.



**గుజరాత్ అల్లర్లు:** 2002 గుజరాత్ అల్లర్లలో ప్రధాని నరేంద్రమోదీ పాత్రపై బీబీసీ రెండు సిరీస్‌లలో సంచలన డాక్యుమెంటరీని ప్రసారం చేసింది. అనంతరం భారత్‌లోని బీబీసీ కార్యాలయాలపై ఐటీ సోదాలు నిర్వహించింది. గుజరాత్ అల్లర్లు ఉద్దేశపూర్వకమైనవేనంటూ నివేదికను ఇచ్చిన మాజీ ఐపీఎస్ అధికారి సంజీవ్‌భట్‌ను ఓ లాకప్‌డెత్ కేసులో అరెస్టు చేశారు. కోర్టు ఆయనకు యావజ్జీవ శిక్ష విధించింది.

**పుల్వామా ఘటన:** పుల్వామా ఉగ్రదాడిలో 40 మంది సైనికులు అమరులవ్వడానికి కేంద్రమే కారణమని, జవాన్ల మరణాలను మోదీ ఎన్నికల ప్రయోజనాలకు వాడుకొన్నారని జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో ఓ కేసులో ఆయనకు సీబీఐ నోటీసులు జారీ చేసింది.


**అదానీ వివాదం:** హిండెన్‌బర్గ్ ఆరోపణలు, అదానీ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ పడిపోవడం, అదానీ-మోదీ బంధం తదితర అంశాలను ఉటంకిస్తూ పార్లమెంట్‌లో కాంగ్రెస్ నేత రాహుల్.. ప్రధానిని ప్రత్యక్షంగా టార్గెట్ చేశారు. అనంతరం మోదీ' ఇంటి పేరు కేసులో రాహుల్‌ను కోర్టు దోషిగా తేల్చి లోక్‌సభ సభ్యత్వం రద్దు చేసింది.

**సూచీల్లో భారత్ ర్యాంకు:** గడిచిన తొమ్మిదేండ్ల బీజేపీ పాలనలో ఆకలి సూచీ, హ్యాపీనెస్ ఇండెక్స్, పత్రికా స్వేచ్ఛ, సమానత్వ సూచీ, పర్యావరణం, మానవాభివృద్ధి, అవినీతి లేమి, పింఛన్ ఇలా 12 సూచీల్లో భారత్ ర్యాంకు మరింతగా దిగజారిపోయింది.

**పెద్దనోట్ల రద్దు:** నల్లధనం వెనక్కి తీసుకొస్తానంటూ 2016లో ప్రధాని మోదీ తీసుకొన్న పెద్ద నోట్ల రద్దు నిర్ణయం అతిపెద్ద వైఫల్యమని తేలింది. నోట్ల రద్దు తర్వాత బ్యాంకులకు 99.3 శాతం విలువైన నోట్లు తిరిగొచ్చినట్టు ఆర్బీఐ వెల్లడించింది. అయితే, ఈ ఏకపక్ష నిర్ణయంతో ఆర్థిక వ్యవస్థకు రూ. 5 లక్షల కోట్ల నష్టంతో పాటు ఏటీఎంల ముందు క్యూలైన్లలో నిలబడలేక, ఇతరత్రా కారణాలతో 108 మంది మరణించారు.



**40 శాతం కమీషన్ రాజ్:** కర్ణాటకలోని బీజేపీ ప్రభుత్వంలో అవినీతి పరాకాష్ఠకు చేరింది. ప్రజాప్రతినిధుల అధికార దాహానికి పలువురు కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకొన్న ఘటనలు దేశవ్యాప్తంగా సంచలనంగా మారాయి. అయితే, దీనిపై ప్రధాని ఇప్పటివరకూ నోరుమెదపలేదు.




**కొవిడ్ మరణాలు:** భారత్‌లో కరోనా మరణాల లెక్కలను కేంద్రప్రభుత్వం తక్కువ చేసి చూపిస్తున్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) కిందటేడాది ఆరోపించింది. ప్రభుత్వ గణాంకాల కంటే 10 రెట్లు ఎక్కువ మరణాలు సంభవించినట్టు తెలిపింది. ఈ ఆరోపణలను భారత్ ఖండించింది.



## గ్యాంగ్‌స్టర్లు సమాజంలో తిరగకూడదు

### ప్రధాని మోదీకి ఐఏఎస్ అధికారి కృష్ణయ్య కూతురి విజ్ఞప్తి




హైదరాబాద్: బీహార్ మాజీ ఎంపీ ఆనంద్ మోహన్‌సింగ్ లాంటి గ్యాంగ్‌స్టర్లు తిరిగి సమాజంలోకి రాకూడదని దివంగత ఐఏఎస్ కృష్ణయ్య కూతురు పద్మ అన్నారు. తన తండ్రి హత్య కేసులో నిందితుడైన ఆనంద్ మోహన్ సింగ్‌ను 29 ఏండ్ల తర్వాత గురువారం విడుదల చేయడంపై ఆమె తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రధాని మోదీ జోక్యం చేసుకొని తగిన న్యాయం చేయాలని ఆమె కోరారు. 'ఈ విషయంలో పోరాడటానికి నాకు శక్తి లేదు. ఇలాంటి గ్యాంగ్‌స్టర్లు బీహార్‌తో పాటు ఏ రాష్ట్రంలోనూ స్వేచ్ఛగా తిరగకుండా ఒక చట్టం తీసుకురావాలి. ప్రస్తుత పరిస్థితిని పరిగణనలోనికి తీసుకోండి' అంటూ ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. గురువారం ఆమె ఒక టీవీ చానల్‌తో మాట్లాడారు. 'మీకు నా తండ్రి గురించి తెలియకపోతే బీహార్ ప్రజలను అడగండి. ఈనాటికీ వారు నా తండ్రి కోసం పోరాడటానికి సిద్ధంగా ఉన్నారు' అని ఆమె అన్నారు. ఆనంద్ మోహన్ సింగ్ విడుదలపై అటు బీఎస్పీతో సహ పలు రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, కేంద్ర ఐఏఎస్ అధికారుల సంఘం నితీశ్ సర్కారుపై ధ్వజమెత్తాయి. 'సివిల్ సర్వెంట్లుగా ఉండటం విలువైనదేనా? అని కొన్నిసార్లు కొందరు ఆశ్చర్యపోతారు. ఈ విషయంలో సుప్రీం కోర్టు, సీజేఐ జోక్యం చేసుకోవాలి' అని తెలంగాణ సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్మితా సబర్వాల్ బుధవారం ట్వీట్ చేశారు.



## న్యాయం కోసం 'పట్టు' వదలట్లేదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): ప్రముఖ రెజర్లు ఢిల్లీ నడివీధుల్లో న్యాయం కోసం లడాయికి దిగింద్రు. అయినా కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన కరవైంది. వీరి సమస్యను ఎక్కువగా ప్రచారం కానివ్వొద్దని బీజేపీయే గూడు పుఠాణి చేస్తున్నదనేది క్రీడాభిమానులు అనుమానిస్తున్నారు. అయితే ఇప్పుడిప్పుడే రెజర్ల పోరాటం ఢిల్లీని దాటి రాష్ట్రాలను తాకింది. ఆమ్ ఆద్మీ పార్టీ, ఆలిండియా డెమొక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్, ఎస్‌ఎఫ్‌ఐ తదితర ప్రజా సంఘాలు మహిళా రెజర్లు చేస్తున్న పోరాటంలో పాలుపంచుకునేందుకు సిద్ధమయ్యాయి. రెజ్లర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే కేంద్రం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదంటున్నారు విశ్లేషకులు.

## దిగొచ్చిన మహా సర్కార్

### రైతుల డిమాండ్లు నెరవేర్చుతామని హామీ

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో వేల మంది రైతులు చేపట్టిన 'కిసాన్ మార్చ్'తో శివసేన, బీజేపీ ప్రభుత్వం దిగివచ్చింది. ప్రభుత్వం ముందుంచిన రైతుల డిమాండ్లను నెరవేర్చడానికి ప్రభుత్వం సిద్ధమని రెవెన్యూ మంత్రి రాధాకృష్ణ విఖే పటేల్ గురువారం ప్రకటించారు. దీనికంటే ముందు ఆలిండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) నేతృత్వంలోని రైతు సంఘాల నాయకులు, మంత్రి రాధాకృష్ణ పటేల్ నేతృత్వంలోని ప్రభుత్వ ప్రతినిధుల బృందానికి మధ్య సుదీర్ఘంగా చర్చలు సాగాయి. 'నిర్దిష్ట కాల పరిమితిలో డిమాండ్లను పరిష్కరిస్తామని ప్రభుత్వం నుంచి హామీ లభించింది. దీంతో కిసాన్ పాదయాత్రను ఆపేస్తున్నా'మని ఏఐకేఎస్ నాయకుడు అజిత్ నావలే ప్రకటించారు. డిమాండ్ల పరిష్కారానికి ఏఐకేఎస్ నేతృత్వంలోని వేల మంది రైతులు అకోలా నుంచి లోన్ వరకూ 53 కిలోమీటర్ల కిసాన్ మార్చ్‌ను చేపట్టిన సంగతి తెలిసిందే.

## మోదీ ఒక విష సర్పం: ఖర్గే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శ చేశారు. ప్రధాని మోదీని విష సర్పంతో పోల్చిన ఆయన తర్వాత తన విమర్శలకు క్షమాపణ చెబుతూ.. తాను బీజేపీ సిద్ధాంతాలను విషసర్పంతో పోల్చినట్టు వివరణ ఇచ్చారు. 'ప్రధాని మోదీ విష సర్పం లాంటి వారు. అది విషమైనదా కాదా అని మీరు ఆలోచించవచ్చు. దానిని నాకారో చావు ఖాయం' అంటూ కర్ణాటకలోని కలబురగిలో జరిగిన ఎన్నికల సభలో ఆయన తీవ్రంగా విమర్శించారు. కాగా, ఖర్గే వ్యాఖ్యలను బీజేపీ సహ పలు పార్టీలు ఖండించాయి. దీంతో వెనక్కి తగ్గిన ఖర్గే తాను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పారు. తాను బీజేపీ ఆలోచనా సరళిపైనే విమర్శలు చేసినట్టు ఆయన వివరించారు.

## రాహుల్ కేసు విచారణ నుంచి తప్పుకున్న జడ్జి

అహ్మదాబాద్, ఏప్రిల్ 27: సూరత్ కోర్టు విధించిన శిక్షను నిలిపివేయాలని కోరుతూ గుజరాత్ హైకోర్టులో కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ రాహుల్ గాంధీ వేసిన అప్పీల్ పిటిషన్ విచారణ నుంచి న్యాయమూర్తి గీతాగోపి తప్పుకున్నారు. ప్రధాని మోదీ ఇంటి పేరును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై దాఖలైన పరువునష్టం కేసులో రాహుల్ గాంధీకి సూరత్ కోర్టు రెండేండ్ల జైలు శిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పును నిలిపివేయాలని రాహుల్ మంగళవారం గుజరాత్ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. ఈ కేసును న్యాయమూర్తి గీతాగోపి విచారించాల్సి ఉండగా ఆమె తనకు తానే విచారణ నుంచి తప్పుకున్నట్టు చెప్పారని రాహుల్ తరపు న్యాయవాది పీఎస్ చపనేరి తెలిపారు.



## 1 నుంచి షిర్డీ బాబా ట్రస్ట్ నిరవధిక బంద్

షిర్డీ, ఏప్రిల్ 27: షిర్డీలోని ప్రసిద్ధ సాయిబాబా దేవస్థానంలో సీఐఎస్ఎఫ్‌తో భద్రత నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ వ్యతిరేకించింది. ఇందుకు నిరసనగా మే 1 నుంచి నిరవధికంగా బంద్ నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఇప్పటి వరకు మహారాష్ట్ర పోలీసులు ఆలయ భద్రతను పర్యవేక్షిస్తున్నారు. కాగా, షిర్డీ విమానాశ్రయ భద్రతను 2018 నుంచి సీఐఎస్ఎఫ్ పర్యవేక్షిస్తున్నది.

## సూడాన్ నుంచి స్వదేశానికి 1,181 మంది

ముంబై/న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: అంతర్యుద్ధం కారణంగా సూడాన్‌లో చిక్కుకున్న భారతీయులను భారత ప్రభుత్వం దశలవారీగా తీసుకొస్తున్నది. గురువారం వరకు 1,181 మందిని మాతృదేశానికి తరలించింది. సౌదీ అరేబియాలోని జెద్దా నుంచి రెండో బ్యాచ్‌లో 246 మందిని భారత వైమానిక విమానంలో గురువారం ముంబైకి తీసుకొచ్చారు. నౌకాదళం ద్వారా రెండు విడతల్లో 575 మందిని స్వదేశానికి తీసుకొచ్చారు. మూడో బ్యాచ్‌ను తీసుకొచ్చేందుకు ఐఎన్ఎస్ తార్కాష్ గురువారం సూడాన్ పోర్టుకు చేరుకున్నది.

## సొరంగం తవ్వి మందుపాతర పెట్టి!

న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడలో జవాన్లపై దాడికి మావోయిస్టులు సొరంగాన్ని తవ్వి ఐఈడీని అమర్చారని గురువారం పోలీసులు వెల్లడించారు. 'రోడ్డు పక్కగా చిన్న సొరంగాన్ని తవ్వి ఐఈడీ బాంబును అమర్చారు. జవాన్ల వాహనాల కాన్వాయ్ వెళ్లే ముందు రోడ్ ఓపెనింగ్ పార్టీస్ అక్కడ డిటెక్షన్ చేపట్టి ఉంటే దాడి జరిగేది కాదు' అని దంతెవాడ బాంబు పేలుడు ఘటనాస్థలంలో విచారణ అధికారి ఒకరు మీడియాకు వెల్లడించారు. 'సొరంగాన్ని మట్టితో కప్పేశారు' అని తెలిపారు.

## ఒప్పందాలు ఉల్లంఘిస్తే ఇద్దరికీ ఇబ్బందే: భారత్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: ఒప్పందాల ఉల్లంఘన రెండు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాల మూలాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని చైనాను భారత్ హెచ్చరించింది. గాల్వాన్ సంఘటన తర్వాత ఇరుదేశాల రక్షణ శాఖ మంత్రుల సమావేశంలో భారత్ ఈ మేరకు చైనాకు బలమైన సందేశాన్ని పంపింది. షాంగై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) సమావేశాన్ని పురస్కరించుకుని చైనాకు చెందిన లెఫ్ట్‌నెంట్ జనరల్ లీ షాంగ్‌పూతో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయ్యారు. భారత్-చైనా సరిహద్దు వద్ద ఉన్న శాంతి, ప్రశాంత పరిస్థితుల ఆధారంగానే ఇరు దేశాల మధ్య సంబంధాలు బలపడతాయని రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టం చేశారు.

## మెరుగైన శృంగారంతో దీర్ఘాయువు


టోక్యో, ఏప్రిల్ 27: మెరుగైన శృంగార జీవితాన్ని గడిపే మధ్య వయస్కులైన పురుషులు ఎక్కువ కాలం జీవిస్తారని జపాన్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. యమగట యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు పదేండ్ల పాటు 40 ఏండ్లు పైబడిన 8,558 మంది పురుషులు, 12,411 మంది మహిళలపై అధ్యయనం చేసి ఆయుష్షుకు, శృంగార జీవితానికి సంబంధం ఉన్నదని గుర్తించారు. లైంగిక ఆసక్తి తక్కువగా ఉన్న 40 ఏండ్లు పైబడిన పురుషులకు గుండెజబ్బులతో మరణించే ముప్పు 1.36 రెట్లు, అధికంగా ఉన్నదన్నారు.

## నాడీ రుగ్మతలతో వృషణాల క్యాన్సర్!

స్టాక్‌హోమ్, ఏప్రిల్ 27: ఆటిజం, ఏడీహెచ్‌డీ వంటి నాడీ సంబంధ రుగ్మతలతో వృషణాల క్యాన్సర్ వచ్చే ముప్పు పెరుగుతుందని స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్తలు గుర్తించారు. ఉప్సల యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు జరిపిన అధ్యయనంలో నాడీ సంబంధ రుగ్మతలకు, వృషణ క్యాన్సర్‌కు సంబంధం ఉన్నదని వెల్లడైంది. ఈ అధ్యయన వివరాలు బ్రిటిష్ జర్నల్ ఆఫ్ క్యాన్సర్‌లో ప్రచురితమయ్యాయి. వృషణ క్యాన్సర్ అనేది అరుదైన వ్యాధి. ఎక్కువగా 15 నుంచి 35 ఏండ్ల మధ్య వయస్కులు దీని బారిన పడతారు.

# అవినీతి తాట ఒలుస్తాం

- దానికి వ్యతిరేకంగానే మా ఓటు
- ఎడీనా సర్వేలో కర్ణాటక ఓటర్ల స్పష్టీకరణ
- అధికార బీజేపీకి ఓటమి భయం



## కన్నడనాట ఓట్ల వేట

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: కర్ణాటకలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తన పాలనలో తీవ్ర అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయింది. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన నేతలు అక్రమాలకు, లంచగొండి పనులకు పాల్పడుతూ రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. సీఎం బొమ్మైతో పాటు ఆయన మంత్రివర్గ అనుచరులపై కోట్ల రూపాయల కుంభకోణాలకు సంబంధించి తీవ్ర ఆరోపణలున్నాయి. బొమ్మై ప్రభుత్వ హయాంలో 40 శాతం కమీషన్ ఇవ్వందే ఏ ఫైలూ ముందుకు కదలడం లేదని రాష్ట్రంలోని కాంట్రాక్టర్లు, పలువురు పారిశ్రామికవేత్తలు వాపోతున్నారు. అయితే తాము ప్రభుత్వ అవినీతి అంశానికే తొలి ప్రాధాన్యం ఇచ్చి వారికి వ్యతిరేకంగా ఓటు వేస్తామని ఓటర్లు చెప్పినట్టు ఒక సర్వే వెల్లడించడంతో అధికార పార్టీ గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్టయ్యింది. అవినీతి సమస్యనే ఓటర్లు ప్రధాన సమస్యగా భావిస్తున్నారు. దీని ప్రాతిపదికనే తాము అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులకు ఓటు వేస్తామని మెజారిటీ ఓటర్లు తెలిపారు. ఎడీనా అనే సంస్థ కర్ణాటకలో జరిపిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. అవినీతికి వ్యతిరేకంగానే ఓటు వేస్తామని 68 శాతం ఓటర్లు తెలియజేశారు. అన్ని పార్టీల మద్దతుదారులు కూడా తాము అవినీతికి వ్యతిరేకమని చెప్పారు. 77 శాతం కాంగ్రెస్ మద్దతుదారులు, 66 శాతం జనతాదళ్, 61 శాతం బీజేపీ మద్దతుదారులు తాము అవినీతికి వ్యతిరేకంగా ఓటేస్తామన్నారు.

**వ్యక్తిగతంగా కలిసి సర్వే**

183 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ అభిప్రాయ సేకరణ జరిపారు. ఒక్కో నియోజకవర్గంలోని 16 బూత్‌లను ఎంపిక చేశారు. ఓటర్లను వ్యక్తిగతంగా కలిసి వివరాలు సేకరించారు. 40 వేల మందిని సర్వే చేశారు. ఇంకా 28 నియోజకవర్గాల్లో సర్వే నిర్వహించాల్సి ఉన్నది. సమాజంలోని వివిధ కులాల ఓటర్లను ఈ సర్వేలో ప్రశ్నించారు. అభిప్రాయాలు తెల్పినవారిలో 55 శాతం మంది పురుషులు, 45 శాతం స్త్రీలు ఉన్నారు.

| కర్ణాటకలో ఓటింగ్‌పై ప్రభావం చూపే అంశాలు | శాతం |
|---|---|
| అవినీతి | 68 |
| ధరల పెరుగుదల | 47 |
| నిరుద్యోగం | 34 |
| మహిళల భద్రత | 13 |
| తాగునీరు, విద్యుచ్ఛక్తి | 13 |
| ఆరోగ్యం, విద్య | 12 |
| నేరాలు, హింస, దౌర్జన్యాలు | 10 |

## 40 కేసుల్లో నిందితుడి తరఫున మోదీ ప్రచారం

బెంగళూరు, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): దాదాపు 40 క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్న మణికంఠ రాథోడ్‌ను గెలిపించాలని ప్రధాని మోదీ ప్రచారం చేయనున్నారు. మే 6న మణికంఠ పోటీచేస్తున్న చిత్తాపుర నియోజకవర్గానికి మోదీ రానున్నారని, రావుర గ్రామంలో జరిగే బహిరంగ సభల్లో ప్రసంగిస్తారని రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి రవికుమార్ తెలిపారు. ఈ స్థానంలో కాంగ్రెస్ నుంచి ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే పోటీచేస్తుండంతో బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొన్నది. రాథోడ్‌పై కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా కేసులు ఉన్నాయి.

- **బీజేపీకి ఓటేయొద్దు: కిసాన్ మోర్చా**



అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు ఓటేయొద్దని సంయుక్త కిసాన్ మోర్చా, కర్ణాటక రైతు, వ్యవసాయ కూలీల సంఘాలు రైతాంగానికి పిలుపు నిచ్చాయి. 'మోదీ వంటి రైతు వ్యతిరేక నాయకుడు ప్రభుత్వంలో కొనసాగకూడదు. ఆయన చెప్పిన రైతుల ఆదాయం రెట్టింపు, ఫసల్ బీమా పథకం, కిసాన్ పథకాలు పెద్ద అబద్ధాలుగా తేలాయి. ఇలాంటి అవినీతి ప్రభుత్వం బారి నుంచి ప్రజాస్వామ్యాన్ని రక్షించడం కోసం బీజేపీని ఓడించి తీరాలి' అని కిసాన్ మోర్చా కోరింది.

## ఎన్నికల నిర్వహణపై బీజేపీ పెత్తనం?

బెంగళూరు, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'ఏయే బూత్‌లను సెన్సిటివ్‌గా ప్రకటించాలి? ఏయే ప్రాంతాలకు పారా మిలిటరీ బలగాల్ని పంపాలి? ఏయే బూత్‌లకు వెబ్ కాస్టింగ్ వ్యవస్థ అవసరమో వెంటనే తెలపాలి. లేకపోతే జాబితాలో మీ సిఫారసులను చేర్చటం కష్టం' అని ఏకంగా కేంద్ర మంత్రి, కర్ణాటక బీజేపీ నాయకురాలు శోభా కరంద్లాజె తమ పార్టీ శ్రేణులకు లేఖ రాయడం సంచలనం సృష్టించింది. ఎన్నికల నిర్వహణపై బీజేపీ పెత్తనం చేసేందుకు, అక్రమాలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నదని దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## షా, నడ్డా ప్రసంగాలు వివాదాస్పదం

బెంగళూరు, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఓట్ల కోసం కేంద్ర మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు నడ్డా చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలు కన్నడనాట విపక్షాలకు అస్త్రాలుగా మారాయి. మోదీ చల్లని చూపులు రాష్ట్రంపై పడేందుకు బీజేపీ అభ్యర్థులకే ఓటేయాలని నడ్డా ఇచ్చిన పిలుపు ఆక్షేపణలకు గురైంది. వరాలిచ్చేందుకు మోదీ ఏమైనా దేవుడా? అని విపక్షాలు విమర్శించాయి. ప్రధాని చేతిలో పెడితే తప్ప కర్ణాటక ప్రగతి పట్టాలపై దూసుకుపోదని అమిత్ షా అన్న మాటలకు విపక్షాలు స్పందిస్తూ.. ఆ మాత్రం అర్హతలు కన్నడిగులకు లేవా? అని అడిగాయి.

## స్వలింగ జంటలకు ప్రయోజనాలెలా?

### కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీం

న్యూఢిల్లీ: స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించకపోవడం వల్ల రాజ్యాంగం కల్పించిన సామాజిక హక్కులను ఆ వర్గం వారు కోల్పోయే ప్రమాదం ఉన్నదని, వారికి ఆ హక్కులు కల్పించే మార్గాన్ని చూడాలని సుప్రీం కోర్టు కేంద్రానికి సూచించింది. జాయింట్ బ్యాంక్ ఖాతాలు తెరవడం, ఇన్సూరెన్స్ పాలసీలలో నామినీగా భాగస్వామిని పేర్కొనడం లాంటి సామాజిక హక్కులను స్వలింగ వివాహం చేసుకున్న వారికి కూడా కల్పించాల్సి ఉన్నదని తెలిపింది. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలంటూ దాఖలైన పలు పిటిషన్లపై ధర్మాసనం ముందు వారం నుంచి వాదనలు సాగుతున్నాయి.


## మధ్యాహ్న భోజన వంట సామానుకు జెమ్ పోర్టల్

న్యూఢిల్లీ: మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన వంట సామగ్రిని ఇక నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-మార్కెట్ కేంద్రం 'జెమ్' పోర్టల్ నుంచే కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఈ పథకానికి అవసరమైన ధాన్యాన్ని నాఫెడ్ నుంచి కొనుగోలు చేసుకోవచ్చని తెలిపింది. కేంద్రం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం పీఎం పోషణ్‌కు అవసరమైన స్టవ్‌లు, ఇతర సామగ్రి సేకరణలో ఇంతవరకు జరుగుతున్న ఆలస్యాన్ని నివారించడానికి ఈ నిర్ణయం తీసుకున్నామని ఒక అధికారి తెలిపారు. దీనివల్ల సరుకుల సరఫరాలో ఆలస్యం తగ్గుతుంది.

## బిషప్‌ల మీటింగ్‌లో మహిళలకు ఓటుహక్కు

వాటికన్ సిటీ, ఏప్రిల్ 27: పోప్ ఫ్రాన్సిస్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. క్యాథలిక్ మహిళల డిమాండ్‌కు అనుగుణంగా బిషప్‌ల సమావేశంలో ఓటు వేసేందుకు వారికి హక్కు కల్పించాలని నిర్ణయించారు. ఈ మేరకు తాజా సమావేశంలో తీర్మానించారు. క్యాథలిక్ చర్చి తీసుకునే నిర్ణయాల్లో ఇకపై మహిళలు భాగస్వాములు కానున్నారు. తమకు నిర్ణాయాధికారాలు కల్పించాలని వీరు ఎన్నో ఏండ్లుగా డిమాండ్ చేస్తున్నారు. వారి డిమాండ్ ఇన్నేండ్లకు ఫలించింది.

**తెరుచుకున్న బద్రీనాథ్ ఆలయం**



ఓం నమో నారాయణాయ అష్టాక్షరీ మంత్ర స్మరణతో ప్రముఖ బద్రీనాథ్ క్షేత్రం మార్మోగింది. గురువారం వేద, వాయిద్యాల నడుమ ఆలయ ద్వారాలు తెరుచుకున్నాయి. చార్‌ధామ్ యాత్రలో భాగంగా ఇప్పటికే కేదార్‌నాథ్ ఆలయాన్ని తెరిచిన విషయం తెలిసిందే. అయితే విపరీతంగా మంచు కురుస్తుండటంతో కేదార్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు.




## ట్యాంక్ నిండా పెట్రోల్ పోయించొచ్చా?

**ప్రచారం:** వాహనాల్లో గరిష్ఠంగా (మ్యాక్సిమమ్) పెట్రోల్, డీజిల్ పోయించకండి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నది. ఉష్ణోగ్రతలు పెరిగితే పెట్రోల్ ట్యాంకు పేలవచ్చు.

**వాస్తవం:** వాహన తయారీ సంస్థ సూచించిన మేరకు గరిష్ఠంగా పెట్రోల్, డీజిల్ పోయించవచ్చు. ఉష్ణోగ్రతలు పెరిగినా పేలుడు సంభవించదు. తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దు.

- **వరుసగా.. ఢీ కొట్టి**




సినిమాలో జరిగినట్టే 12 కార్లు వరుసగా ఢీకొన్నాయి. గురువారం ముంబై-పుణె ఎక్స్‌ప్రెస్‌వే పై వెళ్తున్న ఓ లారీ బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో అది ముందున్న ఓ కారును ఢీకొట్టింది. ఆ కారు వెళ్లి ముందున్న కారును.. అలా 12 కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి.

## మోదీని గద్దె దింపాలి

- సీపీఐ నేత చాడ వెంకట్‌రెడ్డి

మంథని, ఏప్రిల్ 27: ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపి దేశాన్ని రక్షించుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యు డు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పెద్దపల్లి జిల్లా మంథని, కమాన్‌పూర్, రామగిరి, కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లో నిర్వహించిన సీపీఐ ప్రజా చైతన్య యాత్రలో చాడ పాల్గొని మాట్లా డారు. మోదీ సర్కార్ దేశ సంపదను కార్పొరేట్ పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నదని ఆరోపించారు.

## ఎస్సారెస్పీలోకి స్వల్ప ఇన్‌ఫ్లో

మెండోరా, ఏప్రిల్ 27: నిజామాబాద్ జిల్లాలో కురిసిన వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్‌లోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నదని ఏఈఈ రవి తెలిపారు. 2,748 క్యూసెక్కుల వరద వచ్చి చేరిందని పేర్కొన్నారు. ఎస్కేప్ గేట్ల నుంచి గోదావరిలోకి 50 క్యూసెక్కులు, మిషన్ భగీరథ తాగునీటి అవసరాల కోసం 152 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1091.00 అడుగులు (91.03 టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 1065.30 అడుగుల (20.226 టీఎంసీలు) నీటి నిల్వ ఉన్నదని ఆయన పేర్కొన్నారు.

# హరిత భవన్‌కు ఆధ్యాత్మిక హంగులు

## సీఎం కేసీఆర్ సూచనలతో పునరుద్ధరణ పనులు ప్రారంభం

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 27 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై ప్రతి కట్టడానికి ఆధ్యాత్మిక హంగులు అద్దారు. కొండపైన గల తెలంగాణ టూరిజం హరిత అతిథి గృహ సముదాయాన్ని కూడా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వైటీడీఏ అధికారులు తీర్చిదిద్దనున్నారు. ఈ మేరకు గురువారం పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. భవనానికి ఉత్తర ప్రాంతంలో బాల్కనీ తొలగించారు. సీఎం కేసీఆర్ సూచనలతో వైటీడీఏ ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి హరిత అతిథి గృహ సముదాయానికి కొత్త నామూనాలను సిద్ధం చేయగా సీఎం కేసీఆర్ ఆమోదం తెలిపారు. విశ్వవిఖ్యాతిగాంచిన యాదగిరిగుట్ట దేవస్థానానికి దేశ నలమూలలతోపాటు విదేశీయులు సైతం వస్తున్నారు. వారందరిని హరిత హోటల్ సముదాయం ఆకట్టుకునేలా కాకతీయ పిల్లర్లు, దేవతామూర్తులు, పంచనారసింహుడి ప్రతిమలు ఉండేలా నిర్మాణం చేపట్టనున్నారు. కిటికీలు, దర్వాజలతోపాటు ప్రతి గదిని అద్భుతంగా తీర్చిదిద్దనున్నారు. త్వరలోనే హరిత భవన్ సరికొత్త రూపుతో భక్తులను ఆకట్టుకోనున్నది.



గుట్టపై హరిత హోటల్ నమూనా

## రోడ్డు ప్రమాదంలో నలుగురి మృతి

నిజామాబాద్ క్రైం, ఏప్రిల్ 27: నిజామాబాద్ నగర శివారులోని అర్సపల్లి వద్ద గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ మండలం ఊట్‌పల్లి గ్రామానికి చెందిన కూలీలు కలెక్టరేట్ వద్ద నిర్మిస్తున్న ఐటీ హబ్‌లో పని చేస్తున్నారు. నిత్యం గ్రామం నుంచి వచ్చి పనులు ముగించుకొని తిరిగి వెళ్తున్నారు. రోజు మాదిరిగానే పనులు ముగించుకొని ఆటోలో తిరిగి వెళ్తున్నారు. అర్సపల్లి బైపాస్ రోడ్డులో ఉన్న పెట్రోల్ బంక్ వద్దకు రాగానే అర్సపల్లి నుంచి ఎదురుగా వచ్చిన బొలేరో పికప్ వ్యాన్ కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోడ్రైవర్ ఆర్ ప్రశాంత్(35), కూలీలు డీ చరణ్(25), డీ శ్యామ్(48), ఆర్ రేఖ(32) అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. వీరితో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు.



**చిట్టి చేతుల ఆసరా** | అకాల వర్షాలతో చేతికొచ్చిన పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. చాలాచోట్ల కోసి ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. నిజామాబాద్ నగర శివారులోని తారకరామారావు కాలనీ వద్ద ఓ రైతు దంపతులు పంటను ఆరబెట్టేందుకు కష్టపడుతుండగా వారి పిల్లలు తమకు చేతనైన కాడికి సాయం చేస్తున్న దృశ్యం గురువారం 'నమస్తే తెలంగాణ' కెమెరాకు చిక్కింది. –స్టాఫ్ ఫొటోగ్రాఫర్/ నమస్తే తెలంగాణ

మట్టి మాటలు www.ntnews.com చూడండి

## కుక్కల దాడిలో 32 మందికి గాయాలు

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 27: గ్రేటర్ వరంగల్ నాలుగో డివిజన్‌లో వీధికుక్కల దాడిలో 32 మందికి గాయాలయ్యాయి. బాధితులకు ఎంజీఎంలో వైద్యులు చికిత్స అందించారు.

## ఎక్స్‌ట్రా క్లాసులు 3 గంటలు మించొద్దు

› మొదటిపేజీ తరువాయి...

ఫీజులు వాపసు చేయాలి. రెసిడెన్షియల్ కాలేజీలకు ఇది వర్తిస్తుంది.

**మార్గదర్శకాలిలా..**

- ఇంటర్ బోర్డు గుర్తింపు పొందిన భవనం, ప్రాంగణాల్లోనే తరగతులు నిర్వహించాలి.
- పీజీలో 50% మార్కులు పొందిన వారినే అధ్యాపకులుగా నియమించాలి. ఫ్యాకల్టీకి ఆధార్‌బేస్డ్ బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి.
- ఫ్యాకల్టీని విద్యాసంవత్సరం మధ్యలో తొలగించరాదు.
- ప్రతీ జూనియర్ కాలేజీ సీనియర్ ఫ్యాకల్టీని స్టూడెంట్ కౌన్సిలర్‌గా నియమించాలి.

**రెసిడెన్షియల్ కాలేజీల్లో ఇలా..**

- విద్యార్థులకు కనీసం 8 గంటలు నిద్ర తప్పనిసరి.
- సాయంత్రం గంట పాటు ఆట విడుపు(రిక్రియేషన్)కు కేటాయించాలి.
- ఏడాదిలో రెండుసార్లు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి.
- విద్యార్థులకు 75శాతం హాజరు తప్పనిసరి.
- యాంటి ర్యాగింగ్ కమిటీలను నియమించాలి.

**అడ్వర్టయిజ్‌మెంట్లపై నిఘా**

కాలేజీలు జారీచేసే అడ్వర్టయిజ్‌మెంట్లపై గట్టి నిఘా పెట్టనున్నారు. తప్పుడు ప్రకటనలు, ఫేక్ ర్యాంకులను అడ్డుకొనేందుకు ప్రత్యేకంగా పర్యవేక్షణ విభాగాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ విభాగం అనుమతిస్తేనే కాలేజీలు ప్రకటనలు జారీ చేయాలి. నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీలపై కఠిన చర్యలు తీసుకొంటారు.

## జనగామ కాంగ్రెస్‌లో గ్రూపుల లొల్లి

- పార్టీ నుంచి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సస్పెన్షన్

జనగామ, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ) : జనగామ నియోజకవర్గంలో మరికొన్ని గంటల్లో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్‌మార్చ్ ప్రారంభం కానుండగా ముఖ్యనేతల మధ్య నెలకొన్న గ్రూపు విభేదాలు బహిర్గతమయ్యాయి. పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పరస్పరం కత్తులు నూరుతూ ప్రత్యక్ష యుద్ధాన్ని ప్రకటించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు, క్రమశిక్షణ ఉల్లంఘనపై ఫైవ్‌మెన్ కమిటీ నివేదిక ఆధారంగా మాజీ ఎమ్మెల్యే కొమ్మూరిని కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు జనగామ డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాజీ గురువారం ప్రకటించారు. కొమ్మూరి వర్గీయులు కొందరు నాయకులు సమావేశమై పార్టీని భ్రష్టు పట్టిస్తున్న పొన్నాలను తామే కాంగ్రెస్ నుంచి తొలగించామని స్పష్టం చేశారు. ఆ తర్వాత మీడియా సమావేశం ఏర్పాటు చేసిన కొమ్మూరి.. అధికార పార్టీకి కోవర్టుగా ఉన్న పొన్నాలకు మతిభ్రమించిందని ఆరోపించారు. ఆయన్ను ఎర్రగడ్డ దవాఖానలో చేర్పించాలనడంతో ఇరువర్గాల నాయకులు, కార్యకర్తలు పరస్పర నిందారోపణలకు దిగ డం పార్టీలో రచ్చకు దారితీసింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ జనగామ కాంగ్రెస్ రెండు వర్గాలు, నాలుగు గ్రూపులుగా విడిపోవడం గమనార్హం. టీపీసీసీ మాజీ చీఫ్ పొన్నాల, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు జంగా అనుచరులు ఎవరికి వారే అన్నట్టుగా జట్టుకట్టి ఒకరిపై మరొకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకోవడంతో పార్టీ నవ్వులపాలవుతున్నదని కార్యకర్తలు వాపోతున్నారు.

## బండి బెయిల్ రద్దు పిటిషన్ కొట్టివేత

వరంగల్ లీగల్, ఏప్రిల్ 27: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ బెయిల్ రద్దుపై పోలీసులు వేసిన పిటిషన్‌ను హనుమకొండ జిల్లా కోర్టు గురువారం కొట్టివేసింది. టెన్త్ హిందీ పేపర్ కేసు విషయంలో బండి సంజయ్ బెయిల్‌ను రద్దు చేయాలని పోలీసులు వేసిన పిటిషన్‌పై రెండు రోజుల వాదనల అనంతరం కోర్టు ఈ నిర్ణయం తీసుకున్నది.

# బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునా
మాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10,
బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## మరాఠ్వాడాలో మార్పు బట్వాడా

మహారాష్ట్ర జనం బీఆర్ఎస్ సారథి కేసీఆర్ బాట పడుతున్నరు. చిన్నా, పెద్ద అంతా బీఆర్ఎస్ తో మమేకం ఐతున్నరు. మరాఠా పబ్లిక్‌లో కేసీఆర్ పిలుపు నరనరాన ప్రేరణ రాజేస్తున్నది. ఎంతటి పాలకులనైనా, ప్రభుత్వాలనైనా మన చేతిలో ఉన్న ఓటు అనే తిరుగులేని ఆయుధంతో కాలగర్భంలోకి తోసేయవచ్చని అక్కడి ప్రజల్లో ఆలోచనలు రేకెత్తిస్తున్నారు కేసీఆర్. సభల్లో కేసీఆర్ ఉపన్యాసాలు సరికొత్త సంచలనం అవుతున్నయి. మహత్తరమైన ఆ ఓటు శక్తిని ఇచ్చింది అదే మహారాష్ట్ర నేలపై జన్మించిన బాబా సాహెబ్ అంబేద్కర్ అని ఉటంకిస్తూ వారిలో కొత్త స్ఫూర్తిని రగిలిస్తున్నారు.



తెలంగాణ సర్కార్ తరహా సమూల, సమగ్ర వికాసం తాలూకు మార్పు(విప్లవం)పై చర్చ, ఆలోచన ఒకరి నుంచి మరొకరికి బట్వాడా (పంపిణీ) అవుతూ టాప్ గేరుతో స్పీడ్ అందుకొన్నది. మహారాష్ట్రలో ఒక్కో దశను చకచకా దాటుతూ బీఆర్ఎస్ ప్రబల శక్తిగా పట్టు బిగిస్తున్నది. బ్రహ్మాండమైన బహిరంగ సభలు ఓ వైపు నిర్వహిస్తూనే, ఊరూరా పార్టీ కమిటీలతో బీఆర్ఎస్ మహా నిర్మాణానికి సమాయత్తం అవుతున్నది. బేస్ లెవెల్ టు స్టేట్ మొత్తం పటిష్ఠమైన బీఆర్ఎస్ సాధానికి కార్యాచరణ ఖరారు చేసింది.

గ్రామ కమిటీలకు మే తొలివారం నుంచి జూన్ మొదటి వారం దాకా ముహూర్తం ఫిక్స్ చేసింది. జనాన్ని ఒక ప్రాంగణానికి చేర్చే మీటింగ్స్ స్థాయిని దాటి జనం వద్దకే పార్టీ వెళ్ళే దిశగా కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఏకంగా లక్షల మందితో కిసాన్ మహా ర్యాలీ నిర్వహణకు బీఆర్ఎస్ పూనుకుంటున్నది. మహారాష్ట్రలో సింహభాగమున్న గ్రామీణ ప్రజానీకం భాగస్వామ్యమయ్యే జిల్లా పరిషత్ ఎన్నికల కదన రంగంలోకి బీఆర్ఎస్ దూకనున్నది. తద్వారా మహారాష్ట్రలో పట్టు సాధించాలని పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారు.

పేరులోనే మహారాష్ట్ర. పరిపాలనా వైఫల్యాల తీరుతో చిన్నబోయిన రాష్ట్రం. ప్రజలేమో అమాయకులు. కష్టజీవులు.ఎంతో మర్యాదస్తులు. తాము పస్తులుండైనా అతిథుల కడుపు నింపే ఆత్మ బంధువులు. అపారమైన దేశభక్తి, దైవభక్తి గలవారు. స్వచ్ఛమైన గోదావరి జీవనది పుట్టిన నేలపై అంతే స్వచ్ఛమైనది మహారాష్ట్ర సమాజం. రాష్ట్రంలో వనరులు పుష్కలం. ప్రజల జీవన ప్రమాణాల పరిరక్షణకు తగిన సదాలోచనలు, రాజకీయ సంకల్పాలు మాత్రం శూన్యం.

ప్రపంచ మేధావి బాబా సాహెబ్ అంబేద్కర్, వీరాధి వీరుడు ఛత్రపతి శివాజీలను కన్న పుణ్యభూమి మీద, ఎందరో మహానుభావులు నడయాడిన నేల మీద ఈ పాలకుల నిష్క్రియపరత్వం చాలదన్నట్టు..ఈ మధ్య కాలంలో ఊగిసలాటలతో దిన దిన గండంలా అస్థిర ప్రభుత్వం. రైతుల ఆత్మహత్యలు నిత్యకృత్యం.

అభివృద్ధి సంక్షేమం పరంగా అంధకారం అలుముకున్న క్లిష్ట తరుణంలో ఆ దైవమే పంపించినట్టుగా బీఆర్ఎస్-కేసీఆర్ రూపంలో అజేయమైన ఆశాకిరణం మహారాష్ట్రలో మెరుస్తున్నది. మరాఠాల మదిలో విశ్వాస ముద్ర వేసుకుంటున్నది. చూస్తున్నంతలోనే వరుస బహిరంగ సభలతో మహారాష్ట్ర మొత్తం లోతుగా బీఆర్ఎస్ తో అల్లుకుపోతున్నది. సమీప రోజుల్లో జిల్లా పరిషత్ ఎన్నికలతో బీఆర్ఎస్ బోణి కొట్టి, అసెంబ్లీ-పార్లమెంటు దాకా గులాబీ ప్రాతినిధ్యానికి మహారాష్ట్ర కార్యోన్ముఖం అవుతున్నది.

బ్రహ్మాండమైన శుభారంభంగా భారత రాష్ట్ర సమితి నాందేడ్ మీటింగ్ మరాఠ్వాడాలో మార్పు (విప్లవం) బట్వాడాకు నాంది పలికింది. కడపటి కాంధార్‌సభ మహారాష్ట్ర ఉజ్వల భవితకు సమరశంఖం పూరించింది. మహారాష్ట్ర నట్టనడుమన గల నగరం ఇప్పుడు శంభాజీనగర్ గా పిలుస్తున్న ఔరంగాబాద్ లో మూడో బహిరంగ సభతో బీఆర్ఎస్ అంచనాలకు మించి ఫలవంతమైంది.

> చెప్పడమే కాదు, చేసి చూపించే అప్రతిహత విజయాల్లో మరో గొప్పనైనదిగా అదే మహారాష్ట్ర భూమి పుత్రుడు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల మహా ప్రతిమ ఆవిష్కరణ ప్రేరణాత్మకంగా నిలిచింది. సామాన్య ప్రజల జేజే లు, రాజ్యాంగ పితామహుడైన అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ కితాబు, బ్రిటన్ ఎంపీ వీరేంద్ర శర్మ ప్రశంసలు మరింత ఉత్తేజాన్ని నింపాయి.

తాజా శంభాజీనగర్ బహిరంగ సభ విజయవంతంతో మహారాష్ట్ర ప్రజల్లో కేసీఆర్ పట్ల మరింత విశ్వాసం పెరిగింది. కేసీఆర్ పాలనలో జీవం ఉట్టిపడే సంక్షేమ, సురక్షిత పథకాలు, గుణాత్మక అభివృద్ధి, శాశ్వత మౌలిక సదుపాయాల కల్పన ఫలాలు అనుభవిస్తున్న తెలంగాణ ప్రజల మాదిరి తమకూ సమీప భవిష్యత్తులో వాటిని అందించే భాగ్య విధాతను కేసీఆర్‌లో దర్శిస్తున్నారు. మరాఠా లీడర్లు, ఔత్సాహికులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ లో జాయిన్ అవుతున్నారు. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా బీఆర్ఎస్ ప్రబలమైన శక్తిగా మహారాష్ట్రలో అవతరిస్తున్నది. నేటి తెలంగాణ సీఎం రేపటి భారత ప్రధానిగా దృఢమైన భావనతో ఆ రాష్ట్ర ప్రజానీకం దీవిస్తున్నది. బీజేపీ బరితెగింపు పోకడల పీచమణిచేలా బీఆర్ఎస్ ప్రభావవంతమైన రాజకీయాలు, సమీకరణాలు, మహారాష్ట్రలోనూ మహా మార్పులకు చిహ్నాంగా విశ్లేషిస్తున్నారు.

బీఆర్ఎస్ నినాదం ఈసారి రైతు ప్రభుత్వం (అబ్ కీ బార్ కిసాన్ సర్కార్) మహారాష్ట్ర వాసుల హృదయాలకు సూటిగా తాకింది. అందుకే, కర్షకులు బీఆర్ఎస్‌ను ఓన్ చేసుకుంటున్నారు. మహారాష్ట్రలో 85 శాతం ప్రజలు వ్యవసాయం మీదే ఆధారపడినవారు. అక్కడ సేద్యంలో సంక్షోభాలు కల్లోలం రేపుతున్నాయి. రైతు ఆత్మహత్యలు లేని రోజంటూ లేదు. తెలంగాణలో అమల్లో ఉన్న రైతు బంధు, రైతు బీమా, పొలాలకు జలాలు, ఉచిత విద్యుత్తు, పంట కొనుగోళ్లు వంటివి మహారాష్ట్ర రైతాంగాన్ని ఆకర్షిస్తున్నాయి. ఆసరా పింఛన్లు, దళిత బంధు వంటి బతుకు భరోసా పథకాల కోసం మహారాష్ట్ర వాసులు వేచి చూస్తున్నారు. అధికారంలోకి వస్తే తెలంగాణ పథకాలన్నీ మహారాష్ట్రలోనూ ప్రవేశ పెడుతామన్న తెలంగాణ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధిపతి కేసీఆర్ సందేశం మరాఠాల మదిలో చెరగని ముద్ర వేసింది.

మహారాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పిస్తే మరాఠా రాజకీయాలు వదులుకొని, మధ్యప్రదేశ్ వెళ్తానని కేసీఆర్ తేల్చి చెప్పడం జనాన్ని ఎంతగానో ఆలోజింపజేస్తున్నది. ఆ సవాల్ అక్కడి పాలకులను ఆత్మరక్షణలోకి నెట్టింది. ఆ ఒక్క మాటతో కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు మరాఠ్వాడా జేజేలు పలుకుతున్నది.



ఇల్లెందుల దుర్గాప్రసాద్
9440850384

(వ్యాసకర్త: ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

> శంభాజీనగర్ బహిరంగ సభ విజయవంతంతో మహారాష్ట్ర ప్రజల్లో కేసీఆర్ పట్ల మరింత విశ్వాసం పెరిగింది. కేసీఆర్ పాలనలో జీవం ఉట్టిపడే సంక్షేమ, సురక్షిత పథకాలు, గుణాత్మక అభివృద్ధి, శాశ్వత మౌలిక సదుపాయాల కల్పన ఫలాలు అనుభవిస్తున్న తెలంగాణ ప్రజల మాదిరి తమకూ సమీప భవిష్యత్తులో వాటిని అందించే భాగ్యవిధాతను కేసీఆర్‌లో దర్శిస్తున్నారు. మరాఠా లీడర్లు, ఔత్సాహికులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో జాయిన్ అవుతున్నారు.

## ఓ తెలంగాణ బిడ్డా.. ఇదీ మన ఘనత

రాష్ట్రం సాధించి తొమ్మిదేండ్లు అవుతున్నది. ఈ తొమ్మిదేండ్లలో మన రాష్ట్రం, మన సర్కారు ఏం సాధించిందో ప్రతి తెలంగాణ బిడ్డ తెలుసుకోవాలి. తెలంగాణ ఏం సాధించిందో తెలుసుకోవడమే కాదు. కాలర్ ఎగరేసి.. గర్వంగ ప్రపంచానికి చాటి చెప్పాల్సిన అవసరం ఉన్నది. ఎందుకంటే దేశంలో ఎక్కడా లేని విధంగా... ఏ రాష్ట్రమూ సాధించనన్ని గొప్ప లక్ష్యాలను మన తెలంగాణ సాధించింది.

మనం ఇవాళ ఇలా స్వేచ్ఛగా జీవిస్తున్నామంటే దానికి కారణం రాజ్యాంగం. ఆ రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌కు ప్రపంచంలోనే అతిపెద్దదైన 125 అడుగుల విగ్రహం కట్టించింది మన ప్రభుత్వం. ఆయన పేరుతో దేశంలోనే అత్యద్భుతమైన, అతిపెద్దదైన సెక్రటేరియట్ మనకు ఉన్నది. రాష్ట్ర పరిపాలనా సౌధమే కాదు. ప్రతి జిల్లా పరిపాలనా సౌధాలు కూడా అత్యద్భుతంగా కొలువుదీరాయి. అతిపెద్ద సమీకృత కలెక్టరేట్ భవనాలతో ప్రజలకు అన్ని సేవలు మరింత చేరువయ్యాయి.ప్రతి నియోజకర్గంలో ఎమ్మెల్యేలకు క్యాంపు ఆఫీసులు నిర్మించి.. ప్రజలకు ప్రజాప్రతినిధులను చేరువ చేసింది మన సర్కారు. పాలనే కాదు భద్రతలోనూ మనకు ఎవరూ పోటీరారు. దేశంలోనే ది బెస్ట్ పోలీసింగ్ మనది. అతిపెద్ద కమాండ్ కంట్రోల్ సెంటర్ మనకున్నది. భద్రతలో భాగంగా మన రాష్ట్రంలో 2,82,558 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సైబర్ నేరగాళ్లు ప్రపంచంలో ఏ మూలన ఉన్నా పట్టేసే టెక్నాలజీ మన సొంతం. దీనికోసం సైబ ర్ క్రైమ్స్ కో ఆర్డినేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. సైబర్ క్రైమ్స్ బ్యూరో ఏర్పాటు దిశగా ప్రయత్నాలు చేస్తున్నది.



ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం మన తెలంగాణలోనే ఉన్నది. ఇంత పెద్ద ప్రా జెక్ట్ కట్టిన మనలను డిస్కవరి ఛానల్ మెచ్చుకున్నది. ఓ డాక్యుమెంటరీని నిర్మించింది. కాళేశ్వరంతో ఎర్రటి ఎండల్లోనూ మన చెరువులు నిండుకుండల్లా కనిపిస్తున్నాయి. భూగర్భ జలాలు పెరిగాయి. ఫలితంగా సా గు విస్తీర్ణం పెరిగింది. ధాన్యం సేకరణలో తెలంగాణే నంబర్ వన్. రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా మారి దేశానికి అన్నం పెడుతున్నది. అంతేకాదు.. మన రాష్ట్రం సీడ్ బౌల్ ఆఫ్ వరల్డ్‌గా అవతరించింది. దేశంలోని 65 శాతం విత్తన అవసరాలను తీరుస్తున్నది. 18 దేశాలకు విత్తనాలు సరఫరా చేస్తున్నది. ఈ స్థాయిలో ఉత్పత్తి పెరగడానికి నీటి వసతితో పాటు..24 గంటల ఉచిత కరెంట్, సర్కారు ఇస్తున్న రైతు బంధు కూడా ఎంతో ఉపయోగపడ్డాయి.


> వ్యవసాయమే కాదు ఐటీ రంగంలోనూ విశేష ప్రగతి నమోదైంది. బెంగళూరు, చెన్నై, ముంబై వంటి మెట్రోపాలిటన్ నగరాలను పక్కకు తోసి.. ఐటీలో తెలంగాణ నంబర్ వన్ స్థానానికి ఎదిగింది. 2013-2014లో తెలంగాణ నుంచి ఐటీ ఎగుమతుల విలువ రూ.57,528 కోట్లు. 2021-22 ఏడాదికి అది రూ. 1,83,569 కోట్లకు పెరిగి ఐటీ ఎగుమతుల వృద్ధి రేటులో దేశంలోనే అగ్రస్థానాన నిలిచింది. తెలంగాణ ఐటీ రంగంలో 1,49,506 ఉద్యోగాలు వచ్చాయి.

టీ హబ్‌తో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు, టీ వర్క్స్ తో ఆవిష్కర్తలకు ఓ వేదిక కల్పించిన ఏకైక రాష్ట్రం కూడా మనదే. పారిశ్రామిక రంగంలో టీఎస్ ఐపాస్ తో విప్లవాత్మక మార్పులు తెచ్చి.. ఒక్క క్లిక్ తో అనుమతులు ఇస్తున్న రాష్ట్రం కూడా మన తెలంగాణే.

సంక్షేమంలోనూ మనమే టాప్‌లో ఉన్నాం. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు.. ఇలా అందరికి అత్యధిక పింఛన్ ఇస్తున్నది మన రాష్ట్రమే. ఇలా ఏ రంగం తీసుకున్నా తెలంగాణ నంబర్ వన్. ఇది మనం చెప్పుకుంటున్నది కాదు. దేశం, ప్రపంచం చెబుతోంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెబుతున్నది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్రం 20 అవార్డులకు గాను 19 అవార్డులు మన పల్లెలకే వచ్చాయి. 20 బెస్ట్ మున్సిపాలిటీలకు 10 మున్సిపాలిటీలు మనవే. పల్లెల అభివృద్ధి విభాగంలో కేంద్రం 46 అవార్డులు ప్రకటిస్తే అందులో 13 గ్రామాలు మనవే. ఈ లెక్కన దేశంతో పోలిస్తే 3 శాతం జనాభా ఉన్న రాష్ట్రానికి 30శాతం అవార్డులు వచ్చాయి. 100 శాతం బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామాలు ఉన్నది ఒక్క తెలంగాణలోనే అని కేంద్రమే చెప్పింది.

ప్రతి గ్రామానికి ఓ ట్రాక్టర్, పల్లె ప్రకృతి వనం, నర్సరీ, వైకుంఠధామాన్ని ఏర్పాటు చేసింది. హరితహారం తో పల్లె, పట్నం తేడా లేకుండా పచ్చదనాన్ని పెంచిపోషిస్తున్నది. అందుకే మన దగ్గర 4.7 శాతం అటవీ విస్తీర్ణం పెరిగింది. రాజకీయాల కోసం విమర్శలు, ఆ రోపణలు చేసినా..మన మంచి పనులకు అవార్డులు ఇవ్వకుండా ఉండలేకపోతున్నది కేంద్ర ప్రభుత్వం. పొరుగు రాష్ట్రాలకు మన సంక్షేమం రోల్ మాడల్ అయ్యింది. కల్యాణలక్ష్మితో పేదింటి ఆడబిడ్డలకు వరమైంది. కంటివెలుగై బాధలుబాపింది. దళితుల సంక్షేమానికి దళితబంధువై.యువత తమకాళ్ల పై తాము నిలబడేలా చేసింది. ఇంటింటికి నీరు వచ్చింది. పల్లెలకు కొత్త కళ వచ్చింది. 2014-15 లో తలసరి ఆదాయం రూ.1,24,000 ఉంటే 2022-23 నాటికి రూ. 3,17,000కు పెరిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే.. మనం సాధించిన ప్రతీది ఒక మైలు రాయే.

హైదరాబాద్ నడిబొడ్డున నిలబడిన అంబేద్కరుడిని చూసి ప్రపంచదేశాలు ఆశ్చర్యపోతున్నాయి. ఇది తెలంగాణకు గర్వకారణమంటూ వీరేంద్రశర్మ అనే బ్రిటన్ ఎంపీ స్వయంగా మన సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. అమెరికాలో స్థిరపడి ఈ మధ్యే హైదరాబాద్ వచ్చిన తెలుగు నటి లయ.. హైదరాబాద్ ముందు న్యూయార్క్, లాస్ ఏంజిల్స్ లాంటి పట్టణాలు కూడా దిగదుడుపేనని స్వయంగా చెప్పారు. అది మనకు ఎంత గర్వకారణం. సర్కారు మంచి పనులు అన్నీ కలిసి ఇవాళ తెలంగాణ వెలిగిపోతున్నది. భావి భారతానికి ఓ ఆశాకిరణంలా మారింది. ఈ గొప్ప విషయాన్ని.. ఓ తెలంగాణ బిడ్డగా మనం గర్వంగా చెప్పుకోవాలి. సగర్వంగా ప్రపంచానికి చాటిచెప్పాలి.




వై.సతీష్ రెడ్డి
9641466666

(వ్యాసకర్త : తెలంగాణ పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ చైర్మన్)

## డార్విన్ సిద్ధాంతం తొలగింపు అశాస్త్రీయం

> సిలబస్ రేషనలైజేషన్ పేరిట జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ (ఎన్‌సీఈఆర్‌టీ) పదవ తరగతి జీవ శాస్త్ర పుస్తకాల నుంచి డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించింది. విద్యార్థులపై సిలబస్ భారాన్ని తగ్గించే పేరిట అత్య ంత ముఖ్యమైన చాప్టర్‌ను తొలగించడం గర్హనీయం. జీవుల పరిణామం, నూతన జీవుల ఆవిర్భావము, జన్యుశాస్త్రం మొదలయినవాటికి జీవపరిణామ సిద్ధాంతం ఆయువుపట్టు .



2018లో అప్పటి మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి సత్యపాల్ సింగ్ డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ సిద్ధాంతాన్ని తొలగించాలని కోరారు. నాటి ఆయన కోరికను ఎన్‌సీఈఆర్‌టీ ప్రస్తుతం తీర్చినట్టున్నది.

అనేక దేశాలలో ఛాందసవాదులు డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సృష్టివాదులు ఈ సిద్ధాంతానికి బద్ధ వ్యతిరేకం. సౌదీ అరేబియా, ఒమన్, అల్జీరియా, మొరాకో వంటి దేశాలలో డార్విన్ సిద్ధాంతాన్ని నిషేధించారు.సెకండరీ స్కూల్ సిలబస్ నుంచి డార్విన్ సిద్ధాంతం తొలగించడం తిరోగమన చర్య. బాల్య దశలో నేర్చుకోవలసిన ముఖ్యమైన సిద్ధాంతాన్ని సిలబస్ నుండి తొలగించడం వల్ల జీవుల పరిణామం గూర్చి విద్యార్థులు అవగాహన కల్పించుకోలేరు.

మానవాళి మనుగడకు సవాలుగా నిలుస్తున్న అనేక సమస్యలకు జీవ పరిణామ సిద్ధాంతం సమాధానం చూపిస్తుంది. కరోనా లాంటి అనేక మహమ్మారిలు మున్ముందు వచ్చే అవకాశం ఉన్నది...వాటి అంచనా జీవపరిణామ సిద్ధాంతం ఆధారంగానే జరుగుతుంది. ఇప్పటికే భారత దేశంలో సైన్స్ బోధన చాలా లోపభూయిష్టముగా ఉన్నది. సాంప్రదాయ విద్య, నైతిక విద్య పేరుతో శాస్త్రీయంగా నిరూపితమైన అంశాలను మరుగున పడేయడం దురదృష్టకరం.

డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడాన్ని శాస్త్రవేత్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. విద్యావేత్తలు, శాస్త్రవేత్తల సమూహం బ్రేక్ త్రూ సైన్స్ సొసైటీ ఎన్‌సీఈఆర్‌టీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బహిరంగ లేఖ రాసింది. జీవ పరిణామ సిద్ధాంతం జీవుల పరిణామ క్రమాన్ని విద్యార్థులకు విశదీకరించడంలో కీలక భూమిక పోషిస్తుంది. డార్విన్ సిద్ధాంతం విద్యార్థులలో సునిశిత పరిశీలన, విమర్శనాత్మక ఆలోచనను పెంపొందిస్తుంది.

డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడాన్ని శాస్త్రీయ దృక్పథం కలిగిన వారందరూ ఖండించాలి. ఈ తొలగింపును అడ్డుకోకపోతే భవిష్యత్తులో అనేక అంశాలను ఇదే విధంగా తొలగించి మళ్ళీ మనల్ని మధ్య యుగాలకు తీసుకుపోయే ప్రమాదమున్నది. చిన్నవయసు నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించాలంటే అనేక పరిశోధనల అనంతరం నిరూపితమైన సిద్ధాంతాలు ఖచ్చితంగా సిలబస్‌లో ఉండేలా చూడాలి. మూఢనమ్మకాలు, అశాస్త్రీయ అంశాలు సిలబస్‌లో చొప్పిస్తే భవిష్యత్‌లో సైన్స్ రంగంలో పరిశోధనలు మందగిస్తాయి. శాస్త్ర పరిశోధన రంగంలో ఇప్పటికే మనం ఎంతో వెనుకబడి ఉన్నాం...ఇలాంటి నిర్ణయా ల వల్ల మరింత వెనుకబడిపోతాం. వెంటనే ఈ తొలగింపు నిర్ణయాన్ని మార్చుకుని డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తిరిగి సిలబస్‌లో చేర్చాలి.

-డాక్టర్ ఏ. వేణుగోపాల్‌రెడ్డి



## ఆపద్బాంధవుడు సీఎం కేసీఆర్!

రాళ్లవానతో కూడిన అకాల వర్షాలతో రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో పంట నష్టం జరగడం బాధాకరమైన విషయం. 27 జిల్లాల్లో సుమారుగా 2,36,194 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లుగా సమాచారం. అత్యధికంగా 1.60 లక్షల ఎకరాల్లో వరి దెబ్బతిన్నట్టుగా వ్యవసాయశాఖ క్షేత్రస్థాయి పరిశీలనతో తెలుస్తున్నది. దెబ్బతిన్న పంటలలో వరి, మామిడి,మక్కజొన్న, పుచ్చకాయ, తర్బూజ, టమాటలు, వంకాయలు, నువ్వులు, కూరగాయలు, పెసర్లు, జొన్న, నిమ్మ, పొద్దుతిరుగుడు, బొప్పాయి తదితర పంటలు ఉన్నాయి.

స్వరాష్ట్రంలో రైతన్నను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న సీఎం కేసీఆర్.. రాళ్లవానతో దెబ్బతిన్న పంటలతో దిగాలుపడ్డ రైతన్న వద్దకే రాష్ట్ర యంత్రాంగాన్ని పంపి వారికి ఎంతో ధైర్యాన్ని ఇచ్చారు. నర్సంపేట ప్రాంతంలో చెట్టుకు కాయ కూడా లేకుండా వంద శాతం పంట దెబ్బతినడంతో ఎక్కువ నష్టం జరిగింది. సమైక్య పాలనలో చొప్పదండి చాలా కరువు ప్రాంతంగా, భయంకర ఎడారి ప్రాంతంలా ఉండేది. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఒక చొప్పదండే కాదు తెలంగాణనే దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా మార్చారు సీఎం కేసీఆర్.

నేడు మనదేశంలో తెలంగాణలోనే అత్యధికంగా వరి పండుతుండటం మనందరికీ ఎంతో గర్వకారణం. తెలంగాణలో వరి 56 లక్షల ఎకరాల్లో, ఇతర పంటలు దాదాపు 20, 22 లక్షల ఎకరాల్లో పండుతున్నాయి. సీఎం కేసీఆర్ దార్శనికతతో దేశంలో ఎక్కడాలేని అద్భుతమైన వ్యవసాయ విధానం తెలంగాణలో అమలవుతూ, అన్నిరకాల పంటలతో 84 లక్షల ఎకరాలు రెండవ పంటతో సాగులో ఉంది. తెలంగాణ ప్రభుత్వం రైతులను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటున్నది. రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంటు, ప్రాజెక్టుల నుంచి ఉచిత సాగునీరును తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్నది.

గతంలో రాళ్లవానతో దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు, రైతన్నలకు ధైర్యం చెప్పేందుకు వెళ్లిన సీఎం కేసీఆర్ కు రైతులు తమ మనోగతాన్ని వినిపించారు. భూగర్భ జలాలు పెరిగాయని, అద్భుతంగా పంటలు పండించుకుంటున్నామని, నాలుగైదేండ్ల నుంచి మంచి లాభాలు వచ్చాయని రైతులు ఆత్మవిశ్వాసంతో ఆపత్కాలంలోనూ చెప్పడం గొప్ప విషయం. దురదృష్టవశాత్తూ ఈ ఒక్కసారి నష్టం వచ్చినా సరే తట్టుకుంటా అని ఒక రైతు చెబితే సీఎం కేసీఆర్‌తో పాటు అందరికీ ఎంతో సంతోషం కలిగింది. సీఎం కేసీఆర్ మొక్కవోని పట్టుదలకు, పెట్టుకున్న నమ్మకానికి సత్ఫలితం కనిపిస్తుంటే ప్రతి ఒక్కరూ హర్షిస్తుండటం సహజమే.

స్వాతంత్ర్య భారతంలో దేశాన్ని పాలించినవారికి రైతులంటే ఎన్నడూ చిన్నచూపే. సీఎం కేసీఆర్ తన సుదీర్ఘ రాజకీయ అనుభవాన్ని మదించి అనేక సృజనాత్మక పథకాలు తెలంగాణ రాష్ట్రానికి అందించడంతో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. కొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి.

> రాష్ట్రంలో అకాలవర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ ఎకరాకు రూ.10 వేలు ప్రకటించి నాడు రైతుల వెన్నంటి నిలిచారు. ఇదే సందర్భంలో రాష్ట్ర రైతాంగం పట్ల కేంద్ర బీజేపీ సర్కార్ తీరు దారుణంగా ఉన్నది. అకాల వర్షాలతో నష్టపోయిన తెలంగాణ రైతులకు కేంద్రం నయా పైసా ఇవ్వకుండా వివక్ష ప్రదర్శిస్తున్నది.

రైతన్నా!..నేనున్నా..' అంటూ సీఎం కేసీఆర్ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తెలంగాణ రైతాంగానికి కొండంత అండగా నిలిచారు. రైతులు ఈ సందర్భంలో ఆత్మ స్థైర్యం కోల్పోవద్దు. రైతుల వెంట సీఎం కేసీఆర్ సదా ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నది. రైతులు మరింత మనోధైర్యంతో పని చేసుకోవాలి. ఒక బృహత్తర లక్ష్యంతో 'అబ్ కీ బార్...కిసాన్ సర్కార్' అనే నినాదంతో దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమాల 'తెలంగాణ మాడల్' రేపటి రోజున భారతదేశాన్ని బంగారుమయం చేయడం ఖాయం.



సుంకె రవిశంకర్

(వ్యాసకర్త : శాసనసభ్యులు, చొప్పదండి నియోజకవర్గం.)